
# కథామంజరి

పది కథల సమాహారం



జనవరి 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**జనవరి 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 1

ఈ నెల కథామంజరి సంచికకు

ఆర్థిక సహాయం అందించిన వారు,

**స్వర్గీయ ఎస్. జగన్నాధాచార్యులు,**

**ఎస్. శ్రీరంగమ్మ** గార్ల

జ్ఞాపకార్థం వారి కుమారుడు

**డా. ఎస్. రాఘవన్, (న్యూ ఢిల్లీ).**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు


సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన | viii |
| కథాపుస్తక పరిచయం | ix |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| నిన్ను దాటుకు చూడు | పి. వి. ఆర్. శివకుమార్ | 1 |
| ఫ్లెక్సీ మీది బొమ్మ | డా. చెళ్ళపిళ్ళ సూర్యలక్ష్మి | 7 |
| నెలవు | సి. యమున | 12 |
| బాబిగాడు | వై. జ్యోతిర్మయి | 18 |
| సినిమావాళ్ళంతే! | బి. నర్సన్ | 25 |
| వల | కోయిలాడ రామ్మోహన రావు | 31 |
| జవాబు రాని ప్రశ్న | వల్లూరి విజయకుమార్ | 36 |
| నరుడి బ్రతుకు నటన! | కొత్తపల్లి ఉదయబాబు | 41 |
| నిజం | శివల జగన్నాథరావు | 47 |
| హనుమంతుని స్వప్నంలో ఆంధ్ర రాష్ట్రం | కీ. శే. ఆవంత్స సోమసుందర్ | 53 |


Cover Page Credit : Neom, Saudi Arabia

విశాఖపట్నం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నవంబరు14,15,16 తేదీలలో "బాలోత్సవం–2023" నిర్వహించారు. ముఖ్యంగా.. 130 ప్రభుత్వ పాఠశాలలు, చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలల నుంచి ఆరువేల మంది పిల్లలు ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు. ఇప్పుడు జనాన్ని బాగా మోజులో పడేస్తున్న ఆటలు, డాన్స్‌లు, ఫ్యాషన్ షోలు కాకుండా, ఆ వయసులో వారికి అవసరమైన, నేర్పవలసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఈ పోటీలు నిర్వహించడం చాలా ముదావహం! ముఖ్యంగా కథారచన, కథావిశ్లేషణ, కథలు చెప్పడం, వార్తా రచన, వక్తృత్వం.. వంటి అంశాలలో పోటీలు నిర్వహించడం చాలా ఆనందం ఇచ్చింది. హైస్కూలు స్థాయిలో విద్యార్థులకు ఈ అంశాలలో అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు బాగా దోహదపడతాయి. పుస్తకాలు చదవడం, పదిమంది ముందు మాట్లాడడం, తమ ఆలోచనల్ని నిరభ్యంతరంగా చెప్పగలగడం, ఎక్కడో దాగున్న తమ తమ సృజనాత్మకతకు బయటకు తీసి పదును పెట్టడానికి.. ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి. వర్తమాన పరిస్థితులలో ఇవి అవసరం కూడా!


కథావిశ్లేషణ పోటీ నిజంగా ఓ మంచి ఫలితాన్ని ఇవ్వగలదనే నమ్మకం ఆ రోజు కలిగింది. ఓ ప్రముఖ పత్రికలో ప్రచురితమై, పాఠకుల్లో బాగా ప్రాచుర్యం పొందిన కథను, పోటీలో పాల్గొన్న విద్యార్థులకు ఇచ్చి.. ఆ కథ చదవడానికి పది నిమిషాలు సమయం ఇచ్చి, మరో అరగంటలో కథ మీద విశ్లేషణ వ్రాసి ఇవ్వడమే పోటీ. నలభై మంది 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో పత్రికలు, కథలు చదివే అలవాటు, అనుభవం ఉన్నవాళ్లు ఎవరూ లేరు. పత్రికలో వచ్చిన ఓ కథ చదవడం.. వారందరికీ అదే మొదటిసారి. కాని అనూహ్యంగా పది పదిహేను మంది వ్రాసిన విశ్లేషణ చూసిన తర్వాత ఆశ్చర్యం వేసింది. చక్కటి తెలుగుభాషతో.. కథావిశ్లేషణ బాగా చేసారు. ఇప్పటి విద్యావ్యవస్థలో చదువుకుంటున్న ఈ తరానికి చెందిన ఆ వయసులోని పిల్లలకి అసలు .. కథ అర్థం అవుతుందా, అర్థమయిందాన్ని విశ్లేషిస్తూ వ్రాయగలరా అనే సంశయాలు చాలా వచ్చాయి. కథలో ఉండే లోతైన విషయాన్ని, కథలో ఇమిడి ఉన్న హెచ్చరికను, పిలుపును, సూచనలను బాగా ఆకళింపు చేసుకుని, వారు వ్రాసిన విశ్లేషణలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా ఆ కథారచయిత... కథ ద్వారా పాఠకుల నుంచి ఆశించిన స్పందన ఆ విశ్లేషణలో కనబడింది! మనిషి మనోవికాసానికి, మంచి ప్రవర్తన అలవడడానికి, బాల్యం నుంచి పుస్తకాలు, కథలు చదవడం చాలా అవసరమనీ, వాటి వలన ప్రయోజనం ఉందనే మనవంటి వారి వాదనలకు ఆ కార్యక్రమం మరింత బలాన్ని ఇచ్చింది!

ముఖ్యంగా, సమాజంలో పడిపోతున్న నైతిక విలువలు, మనుషుల్లో కొరవడుతున్న.. సమాజశ్రేయస్సుకు ఉపయోగపడే సృజనాత్మకత, సమస్యలను ఎదుర్కొనే శక్తి, ఐక్యత, మనమందరం ఒక్కటే అనే భావన.. ఇలా ఎన్నో లక్షణాలకి తిరిగి జీవం పోయగలిగే శక్తిని బాల్యం నుండే ఇవ్వాలి. వయసుతో ప్రమేయం లేకుండా పుస్తకాలు, ముఖ్యంగా కథలు చదవాలి, బాల్యం నుంచి చదివించాలి! చదివేటట్టు విద్యావ్యవస్థలో మార్పులు చేస్తే ఇంకా మంచిది!

స్వీయానుభవంతో.. ఈనాటి ఈ కథాకీయం అందిస్తూ.. స్వస్తి!!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ శివల జగన్నాథరావు**

చాలారోజులు క్రిందట ఓ వారపత్రికలో "వాక్యానికి వార్ధక్యం రాకూడదు" అనే శీర్షికతో ఓ రచయితతో ముఖాముఖి వచ్చింది. "పోరాటం.. జీవితమంతా పోరాటం, సమాజంతో పోరాటం, అక్షరాలతో పోరాటం, అనారోగ్యంతో పోరాటం, ఒంటరితనంతో పోరాటం..." అంటూ కదిలించే ఉపోద్ఘాతం చదివిన తర్వాత ఆ రచయిత గురించి చదవకుండా ఏ పాఠకుడు ఉండలేరు! అలా ఆ పోరులో పోరాటమూర్తిగా చరిత్రలో నిలిచిపోయేలా రచనలు చేసి, అటు కథాసాహిత్యంలోనూ, ఇటు జీవితంలోనూ అందరికి మార్గదర్శకుడుగా ముద్రపడిన రచయిత శ్రీ శివల జగన్నాథరావుగారు. జీవిత రథయాత్రలో క్షతగాత్రుడైనా, కథాకేళిలో విజయయాత్ర చేసి, తెలుగు కథాప్రియుల హృదయాలలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సాధించిన కథారచయిత శ్రీ జగన్నాథరావుగారు... ఓ విలక్షణమైన వ్యక్తిత్వం గల మంచి వ్యక్తిగా కూడా సమాజంలో ఆయనకి గుర్తింపు ఉంది. "నిత్య జీవిత పోరాటం, జీవన మార్గం, నా మానసిక స్థితుల మార్గంలో పయనిస్తూ, ఆసూయతో కథలు వ్రాయడం మొదలెట్టాను. అందరూ వ్రాసేస్తున్నారు.. నేనెందుకు వ్రాయకూడదు అనే తపనతో వ్రాసాను. నా ఆరోగ్యం నాకు ఊపునిచ్చింది! అలాగే.. కళాకారుడికి వాడి కళను కొనసాగించడానికి తపన ఉండాలి. మరో కళాకారుడి ఉన్నత స్థితిని గౌరవించే గుణం ఉండాలి. అలాగే కథకుడికి మంచి కథ వ్రాయాలనే కసి ఉండాలి!" అంటూ తన సాహితీ ప్రస్థానం గురించి చెపుతారాయన! ఆ ఆలోచనలే ఆయన్ని, ఆయన జీవితాన్ని ముందుకు నడిపి, జీవనాన్ని కొనసాగేలా చేసింది.

1945 లో జన్మించిన శ్రీ జగన్నాథరావుగారు.. చిన్నతనంలో వారి తండ్రిగారి ఉద్యోగరీత్యా చాలా ఊర్లు తిరిగారు. కాకినాడలో ఉన్నప్పుడు శ్రీ కళ్లేపల్లి శ్రీధరంగారి ప్రోత్సాహంతో పుస్తకాలు చదవడం, రచనలు చేయడానికి ప్రేరణ కలిగాయి. తర్వాత కాలంలో విశాఖపట్నం చేరిన తర్వాత వ్రాసిన మొదటి కథ "సీత" .. 1965లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైంది. మరుసటి నెలలోనే రెండో కథ "పాఠం నేర్పిన పాఠం" అదే పత్రికలో అచ్చయింది. ఇక తర్వాత కలానికి విశ్రాంతి ఇవ్వలేదు. ఆ రోజుల్లో కాళీపట్నం రామారావు, బలివాడ కాంతారావు, గణపతిరాజు అచ్యుతరామరాజు, అంగర వెంకటకృష్ణారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆదూరి వెంకట సీతారామమూర్తి.. వంటి ప్రముఖ రచయితలు, వీరిని

వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఓసారి చాసోగారు ఆశీర్వదించి “నీకు కథ రాయడం వచ్చింది!” అనే కితాబు కూడా ఇచ్చారు. అనారోగ్యరీత్యా శ్రీ జగన్నాథరావు గారు ఏ ఉద్యోగం చేయలేకపోయినా, సాహిత్యపరంగా నిత్యం కృషిచేసారు. తల్లిదండ్రులు కాలం చేసినా, తోడబుట్టిన వారి సహకారంతో జీవనాన్ని వెళ్లబుచ్చుతున్న శ్రీ జగన్నాథరావుగారి కథల్లో మనకి కనబడేవి... సునిశిత పరిశీలనాశక్తి, అనుబంధాలు, ఆవేదనలు, మన చూట్టూ తిరిగే పాత్రలు, సంఘటనలు, సాదాగా సాగే రచనాశైలి! మసిపూసి మారేడుకాయ చేయకుండా, ఉన్నదున్నట్లు నిర్మొహమాటంగా కథలు వ్రాయడంలో శ్రీ జగన్నాథరావుగారు ఎప్పుడూ దారి తప్పలేదు. అందుకే వీరి కథలు.. పాఠకుల్ని భయపెడతాయి, ఆందోళన కలిగిస్తాయి, వెంటాడి వేధిస్తాయి, కళ్లమ్మట నీరు పెట్టిస్తాయి. రెండు వందల ఏభై పైగా కథలు, పన్నెండు నవలలు, ఎన్నో రేడియో నాటికలు రాసిన ఆ కలం.. ఓ పది ఏళ్ళ నుంచి మూగపోయింది. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, శ్రీ జగన్నాథరావుగారి తనువు, మనసు ఇంకా కథ చుట్టూ తిరుగుతూనే ఉంటాయి. ఆయన మాటల్లో చెప్పాలంటే.. “కుటుంబ నేపథ్యంలో కథలతో పాటు, దినపత్రికలో చదివిన సమస్యల మీద కూడా కథకులు స్పందించి ‘బాణం’ వదులుతున్నారు. అన్యాయాన్ని సహించలేని కథకుడు అక్షరాన్ని ఆయుధంగా వాడుతున్నాడు. పరిస్థితులకు అనుగుణంగా రచయిత కథలు వ్రాయక తప్పదు!” అని అంటారు. వీరి “వీళ్ళే చుట్టాలు, రాజీ, పచ్చతోరణం, కంపార్ట్‌మెంటాలిటి, అష్టా–చెమ్మా, ఉసురు, తడక, గంగాభవాని, అపశృతి వంటి కథలు, ‘పట్టువదలని పతివ్రతలు, బాను, మైత్రేయి’ వంటి నవలలు పాఠకుల మన్ననలు పొందాయి. ఎన్నో బహుమతులు, పురస్కారాలు అందుకున్న శ్రీ జగన్నాథరావు గార్కి 2020 సంవత్సరం “ఘండికోట బ్రహ్మాజీరావు గారి పురస్కారం” లభించింది. ఆ సందర్భంలోనే వారి అభిమానులు అందరు కలిసి వారికి ఇతోధికంగా ఆర్థికసహకారం కూడా అందించారు.

వాక్యానికి వార్థక్యం రాకూడదనే మాటకి అర్థం చెప్పే రచనలు అందించిన శ్రీ శివల జగన్నాథరావుగారు విశాఖపట్నంలోనే స్థిరనివాసం ఉంటున్నారు. వారిని ‘కథామంజరి’ ఈ సంచికలో పరిచయం చేసుకోడానికి సహకరించిన వారి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ, శ్రీ జగన్నాథరావుగారికి పూర్ణాయుష్షు కలగచేయమని ప్రార్థిస్తూ, ఆ కలం నించి మరిన్ని మంచి కథలు రావాలని ఆకాంక్షిస్తూ ..

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**కీ.శే. ఆవంత్స సోమసుందర్**

రచయిత అన్నవాడు.. ఏ విషయాన్నయినా మొహమాటం లేకుండా సూటిగా చెప్పగలగాలనే ప్రాథమిక సిద్ధాంతానికి కట్టుబడి రచనలు సాగించిన తరంలో పుట్టి... తొంభయ్యవ సంవత్సరంలో అడుగు పెట్టిన తర్వాత కూడా కాలూ చెయ్యి సహకరించకపోయినా .. వదలకుండా కలాన్ని వజ్రాయుధంలా ఝుళిపించిన సాహితీవేత్త కీ.శే. ఆవంత్స సోమసుందర్. తెలుగు సాహితీరంగంలో అభ్యుదయ కవిగా, రచయితగా, నాటకకర్తగా, విమర్శకుడిగా తన జీవితాన్ని కవిత్వానికే అంకితం చేసారు. హైస్కూలులో చదువుతున్నప్పుడే పద్యం మీద మక్కువ కలిగి చందస్సుని పూర్తిగా అధ్యయనం చేసారు. ఆ ప్రారంభం ఎన్నో మలుపులతో ఏడుదశాబ్దాల పైగా సాహితీ సేవలో సాగి, తనదైన ముద్ర వేయుంచుకున్న శతగ్రంథకర్త శ్రీ సోమసుందర్ గారు.

1924లో తూర్పుగోదావరి జిల్లాలోని శంఖవరం గ్రామంలో జన్మించిన శ్రీ సోమసుందర్ గారి విద్యాభ్యాసం పిఠాపురంలో సాగింది. పెద్దాపురంలో డిగ్రీ చదువుతున్నప్పుడు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, ఆ రోజుల్లో వచనకవిత్వం వైపు అడుగులు వేసారు. విద్యార్థిగా ఉన్నప్పుడే కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు మొగ్గుచూపి, ఆ ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ రోజుల్లో నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో జరుగుతున్న పోరాటానికి మద్దత్తుగా, దాశరథి వంటి ప్రజాకవులకు మద్దతుగా, తాను కూడా అనేక కవితలను రచించారు. యువతను ఉత్తేజపరుస్తూ రాసిన "వజ్రాయుధం" అనే కవిత బహుళ ప్రజాదరణ పొందింది. ఆ ఉద్యమానికి సంబంధించిన తన కవితలన్నింటిని "వజ్రాయుధం" పేరుతోనే సంకలనంగా విడుదల చేసారు. ఆ రోజుల్లో బ్రిటిష్ ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించగా, తిరిగి స్వాతంత్ర్యం వచ్చి, ఆంధ్రరాష్ట్ర అవతరణ తర్వాత ఆ పుస్తకం మీద నిషేధం ఎత్తివేశారు. వజ్రాయుధం చదివిన తర్వాత తనకు కవిత్వం వ్రాయలనే కోరిక కలిగి "మహాప్రస్థానం" వ్రాసానని శ్రీశ్రీ అనే వారని శ్రీ సోమసుందర్ గారు చెప్పేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్ని సంవత్సరాల రాజకీయ ఉద్యమాలలో పాల్గొన్నా, తర్వాత కాలంలో రాజకీయం, సాహిత్య వ్యాసంగం ఏకకాలంలో నిర్వహించడం సాధ్యం కాదని తలచి, రాజకీయాలకు స్వస్తి చెప్పారు. ఆ రోజుల్లోనే వచనకవిత్వంతో పాటు కథారచనల వైపు దృష్టి మరల్చి, ఆణిముత్యాల వంటి ఎన్నో కథలు వ్రాసారు. సహజ వాతావరణంలో వాస్తవ పరిస్థితులను

ప్రతిబింబించే కథలను అందించారు. కొంతమేర వామపక్ష భావజాలం కనబడినా, వీరి కవితలకు, కథలకు మనిషే ప్రాతిపదిక, సమాజమే నేపథ్యమూ! ఆకాశంలోనూ, మబ్బుల్లోనూ విహరించే రచనలు వీరివి మచ్చుకు కూడా కనబడవు. వీరి రచనలు మట్టిని, గాలిని విడిచి సాము చెయ్యవనే సత్యం.. తెలుగు సాహితీప్రియులను మరింత చేరువచేసింది. 1969–73 మధ్య కాకినాడ నుంచి "కళాకేళి" అనే సాహిత్య పత్రికను నడిపారు. ప్రతీ ఏటా ఒకటో రెండో వీరి పుస్తకాలు విడుదల అవుతూనే ఉండేవి. అసలు ఏమి రాయకుండా గడిపిన రోజు ఒక్కటీ ఆయన జీవితంలో లేదనే చెప్పాలి. నిత్య అగ్నిహోత్రుడులా నిత్యం సాహిత్యసృష్టిలో ఉండేవారు. మిణుగురులు, రాగరేఖలు, లోకం చిక్కిపోతుంది, సంచారిణీ దీపరేఖ, బొద్దెంకలు, కోటాగుడ్ల గోడు, గులకరాళ్ళు, దొంగలున్నారు జాగ్రత్త, ఓలమ్మో పోలీసు మంచోడే.. వంటి వీరి కథలు చాలా ప్రాచుర్యం పొందాయి. వజ్రాయుధం, జలప్రళయం, అక్షరనాదం వంటి కవితాసంకలనాలు, కృష్ణశాస్త్రి కవితాత్మ వంటి గ్రంథాలు .. శ్రీ సోమసుందర్‌గారిని తెలుగు సాహిత్యవనంలో చిరస్థాయిగా నిలబెట్టాయి. సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు, రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, ఎన్టీఆర్ స్మారక జాతీయపురస్కారం వంటి ఎన్నో అవార్డులు అందుకున్న శ్రీ సోమసుందర్‌గారి రచనలు డెబ్బైకి పైగా పుస్తకరూపంలో విడుదలయ్యాయి. అవి గాక అముద్రిత రచనలు ఇంకా ఉన్నాయి. నిత్యం ఎంతోమంది కొత్త రచయితలను ప్రోత్సహిస్తూ, వారికి రచనావ్యాసంగంలో సరైన సూచనలు అందించేవారు. శ్రీ సోమసుందర్‌గారికి జ్ఞానపీఠ అవార్డు రాకపోవడం చాలా దురదృష్టకరమని ఎంతోమంది భావించారు. సాహితీయజ్ఞం చేస్తూనే తొంభైరెండో ఏట ఆగస్టు 18, 2016న మరణించిన శ్రీ ఆవంత్స సోమసుందర్‌గారు సృష్టించిన తెలుగుసాహిత్యానికి మరణం లేదు. అది అజరామరంగా తెలుగు నేల మీద ప్రకాశిస్తూనే ఉంటుంది!

తెలుగు సాహిత్యక్షేత్రంలో ఐదారు తరాలవారితో సాహిత్యప్రయాణం సాగించిన శ్రీ ఆవంత్స సోమసుందర్‌గారికి కథామంజరి నివాళి అర్పిస్తోంది!

**కథామంజరి బృందం**



## రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి రచన : ఆఖరి దశ

రాచకొండ విశ్వనాథశాస్త్రిగారికి పరిచయమక్కరలేదు. ఆయన రాసిన కథలెన్నో ప్రాచుర్యం పొందినవే. ఆయన రాసిన ఒక చిన్న కథ నేనెన్నిసార్లు చదివినా ఏదో కొత్తగా కనిపించేది, ఎంతో ఆశాజనకంగా తోచేదీ 'ఆఖరి దశ' కథ. చిన్న స్కెచ్. పాఠకులకు సుపరిచితమే. అయినా, ప్రస్తుత పరిస్థితులలో ఇంకోసారి పునశ్చరణ చేసుకోవడం బాగుంటుందేమో ననిపించింది.

ఇది ప్రజాసాహితి, 01 డిసెంబరు,1993 సంచికలో ప్రచురితమయింది. 'రచన' శాయిగారు 'కథాముత్యాలు' అనే సంకలనంలో ఈ కథను కూడా చేర్చారు. ఈమధ్య కొప్పర్తి రాంబాబుగారు తమ పాడ్‌కాస్ట్‌లో చదివారీ కథని.

ఏ కాలానికి ఆ కాలంలో మానవజాతి విపత్కర పరిస్థితుల్ని అనుభవిస్తోంది. నిజానికి అవి విపత్కరమే కానక్కరలేదు. విపత్కరమనే భావనే చాలు. ఆ భావనలు నిజమా, కాదా అన్న ప్రసక్తి అక్కరలేదు. అయితే, అలాంటి పరిస్థితులొచ్చినప్పుడల్లా, మనం చేయగలిగేదేమీ లేదనే నిస్పృహ ఆవరిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో, మూడవ ప్రపంచయుద్ధం రాబోతోందా? ఈసారి వచ్చేది అణుబాంబుల యుద్ధమా? వాతావరణ కాలుష్యం, దానివల్ల కలిగే దుష్ఫలితాలవల్ల మానవజాతి అంతరించిపోతుందా? ఇలాంటి ప్రశ్నలు ఉదయిస్తూనే ఉంటాయి. ఎప్పటికప్పుడు భయమే. భయాలు నిజమే కావచ్చు. అయితే ఆశాభావంతో ప్రశాంతంగా జీవనం సాగించే రోజులొస్తాయా? ప్రపంచానికి వచ్చే సమస్యలకు సమాధానం ఉందా? వెతకగలమా? మానవజాతి మనుగడ కొనసాగుతుందా? మనకు ఆశనివ్వడానికి చరిత్ర ఉపయోగిస్తుందా? రావిశాస్త్రిగారి ఈ 'ఆఖరి దశ' కథ చూద్దాం.

కథలో మొత్తం నాలుగు సన్నివేశాలు. నాలుగూ, కాల ప్రవాహంలో వివిధ సందర్భాలలో సమాజంలో ప్రబలిన నిస్పృహతో కూడిన సంభాషణలు.

కాశీనగరంలో గంగాతీరాన తెల్లని ఇసుకతిన్నె మీద కూర్చొన్న దేవదత్తుడు, చారుదత్తుల సంభాషణతో మొదలవుతుంది. అది కురుపాండవుల యుద్ధం సమాప్తి అయిన రోజులు. 'ప్రాపంచిక సౌఖ్యాలకోసం తండ్రులు, కొడుకులు, అన్నదమ్ములు, బంధువులు, స్నేహితులు – సాధారణులు కూడా కారు, గొప్పవారు, పండితులు, జ్ఞానులు – అంతా ఒకర్నొకరు పొడుచుకు చంపుకున్నారో, వీరితోపాటు అమాయక ప్రజానీకం ఎంత హతమయిందో!' అంటాడు దేవదత్తుడు. ఎటు చూసినా ఆర్యుల్లో అధర్మం ప్రబలిపోతుంటే ఇక అనార్యుల సంగతి చెప్పాలా? ప్రపంచానికే అంత్యకాలం ఆసన్నమైనట్టయింది. ఇదీ సంగ్రహంగా వారిద్దరి మధ్య సంభాషణ.

ఇక రెండో సంభాషణ బౌద్ధభిక్షువులు ఉపాలి, ఆనందుల మధ్య. సందర్భం – శంకరాచార్యుడు బౌద్ధులను సంవాదంలో ఓడించి, ప్రజలను వైదిక హిందూసాంప్రదాయానికి, మతాచార కర్మలను అనుసరించడానికి శ్రీకారం చుట్టిన కాలం. బౌద్ధులలో దోషాలు పెచ్చుపెరిగిపోవడం వల్లనే దానికి విరుగుడుగా, బ్రాహ్మణాధములు మంత్రతంత్రాలతో తిరిగి తలెత్తుతున్నారని బాధ. తమ సంఘాలు, తాము పాటించే ధర్మం, బౌద్ధభిక్షువులు లేకపోతే సంఘం నాశనం అయిపోదూ?

మూడో సందర్భం ఇద్దరు మహమ్మదీయులు హుసేన్ ఖాన్, రహిమాన్‌ల మధ్య జరిగిన సంభాషణ. ఔరంగజేబు మరణించిన సందర్భమది. ఆయన తర్వాత సమర్ధవంతంగా పాలించేవారేరీ? అదీగాక సింహాసనం కోసం ఇక ఎందరో కొట్టుకు చావవలసిందేగా? ఇక కాఫీర్లు బతకనిస్తారా? అటు మరాఠీ దొంగలు దెక్కన్ లోనూ, ఇటు సిక్కులూ ఢిల్లీలోనూ, ద్రోహం చేయడానికి ఉద్యుక్తులై ఉన్నారు. ఒక కాఫీర్లే కాదు. ఇరానీలు, మంగోలులు, తెల్లవాళ్లు, ఒక్కరా? కొత్త కొత్త ఆయుధాలు వచ్చి పడుతున్నాయి. ఇక ప్రపంచంలో శాంతి ఉంటుందా? మొగలాయి సామ్రాజ్యానికి ఆఖరు రోజులొస్తే, ప్రపంచానికి ఆఖరు రోజులయినట్లే కదా! ఇదీ ఆలోచన.

నాలుగవది – అది క్రీస్తుశకం 1947, ఆగస్టు నెల పదిహేడవ తారీకు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కలకత్తా నగరమంతా ఎంతో కోలాహలంగా ఉంది. ఇద్దరు ఆంగ్లేయులు.. రిచర్డ్, చార్లెస్, ఒక క్లబ్బు ఆవరణంలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడంటే ఇలా పండగ జరుపుకుంటున్నారే కానీ, ఇంకొన్ని రోజులలో ఈ జనమంతా గోరీల్లోనూ శ్మశానాల్లోనూ ఉండరూ? తమ దేశంలో బలహీనమైన, చేతకాని గవర్నమెంటు రావడం వల్లే కదా ఈ విపత్తుకి కారణం. అటు రష్యన్లు తమకు దొరికిన భూభాగాన్ని మింగేస్తున్నారు. ఇటు అమెరికా అణురహస్యాన్ని తన గుప్పిట్లోనే పెట్టుకుంది – తమతో కూడా పంచుకోకుండా. యూరోప్ అంతా నలిగిపోతోంది. ఇక ప్రపంచానికి శాంతి ఎక్కడుంది? ఆఖరిరోజులు వచ్చినట్లేగా!

రచయిత చివరికి చెప్పిందేమిటో తెలుసా?

'ప్రపంచం సాగుతూనే ఉంది, ఇన్ని వేల సంవత్సరాల నుంచీ, ఇన్ని యుగాల నుంచీ....'

కథ చెప్పడానికి రచయిత ఎన్నుకున్న శిల్పం గమనార్హం. నాలుగు కాలాలలో జరిగిన విషయాలను, అభిప్రాయాలను, సంభాషణల రూపంలో వ్యక్తపరచడం వల్ల పాఠకుడికి అభిప్రాయాలు, నిజాలు బేరీజు వేసుకునే అవకాశం కలుగుతుంది.

ఆ ఒక్క వాక్యంలోనే పై నాలుగు సందర్భాలలోని ఆలోచనలూ ఎంత తాత్కాలికమో, జీవితానికి సమస్యలలోంచి లేక సమస్యలనుకోబడే సందర్భాలలోంచి,.. బయటపడే శక్తి ఎంత ఉందో, రచయిత అతి సూక్ష్మంగా చెప్పడం జరిగింది. చరిత్ర బాటలో ఎన్ని మలుపులున్నా, ప్రతి మలుపూ ఇంకో కొత్త ఆలోచనలకు దారి తీస్తూ సమాజం ముందుకు వెళ్ళిందే తప్ప ఆగిపోలేదు. సమసిపోలేదు. రెండవ ప్రపంచయుద్ధం ఎన్ని లక్షలమందిని బలిగొన్నా, ప్రపంచం సర్దుకుని మళ్ళీ తన గమనాన్ని అందుకోవడానికి పట్టిన సమయం కాలగమనంలో అతి చిన్నదే అని చెప్పాలి.

అందుకే, ప్రపంచం సాగుతూనే ఉంటుంది – ఇంకొన్ని వేల సంవత్సరాలు, ఇంకొన్ని యుగాలు కూడా. అవునా?

***పరిచయకర్త – శాయి రాచకొండ, హ్యూస్టన్***

సముద్రం కథ గురించి... "అతి సర్వత్రా వర్జయేత్" అన్నట్లుగా జీవితంలో ఏదీ ఒకదాన్ని ఒకటి అధిగమించకూడదు. ఈ కథలో వనమాలిను, వృత్తినీ ప్రవృత్తికి అధిగమించేసింది. సాధారణంగా కథలు 1st,3rd పర్సన్స్‌లో సాగుతాయి. ఈ కథ 2nd పర్సన్‌లో నడపడం ఒక ప్రత్యేకత. అయితే 'సముద్రాన్ని ఎక్కడ పారబోయాలి' అన్నది అతని సమస్య. నిజానికి మన సమస్య కూడా! అయితే పుస్తకాలు కూడా భౌతికంగా ఒక వస్తువులే. టీవి, ఫ్రిజ్ లాగ కొన్నాళ్ళకు పనికిరాకుండా పోతాయి. ముట్టుకుంటే చిరిగిపోతాయి. అయితే, అవి అంతటితో ఆగవు. భావాలను వెదజల్లుతాయి. ఆదరించే మనుషులు వుంటే ఎన్ని వందల సంవత్సరాలు అయినా జీవించే ఉంటాయి. అలా కాకపోతే, కన్యాశుల్కం, మహాప్రస్థానం లాంటి పుస్తకాలు ఏనాడో కనుమరుగైపోయేవి. కాబట్టి సముద్రాన్ని పారవేసే చోటు... ఆదరించే పాఠక హృదయమే!


**– వి. వెంకటరావు, విజయనగరం**

కథామంజరిని ఒక్క బిగిలో ఈ చివర్నుంచి ఆ చివరివరకూ చదివాను. సమగ్రమైన ప్రచురణ. కథలన్నీ మంచి ఇతివృత్తాలతో సంవిధానంతో కూడుకుని శిల్పశైలీ ప్రధానంగా రచింపబడ్డాయి. ముఖ్యంగా సంపాదకవర్గం నిర్దేశించుకున్న సముచిత పరిధిలో ఉండి కథలన్నీ పాఠకులను ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రచురణలో లేని భారతి మాసపత్రిక, ఆంధ్రపత్రికను అందుకోగలిగిన స్థాయికి త్వరలో చేరుకోగలదని నావంటి వారు ఆశిస్తారు.

**యం. ఎస్. ఆర్. శేషు, హైదరాబాద్**

ఈ సంచికలోని కథలు కొన్ని మెరుగుగా ఉన్నాయి. ముఖ్యంగా రచయిత్రుల కథల్లో కొంత వైవిధ్యం గోచరించింది. 'ముందడుగు' కథలో కథావస్తువు మగవారిలోని మరో కోణాన్ని, ఇంతవరకూ ఎవరూ స్పృశించని రీతిలో వారిలోని ముప్పిరిగొన్న భావోద్వేగాలను విభిన్నంగా వ్యక్తీకరించారు. మా నాన్నగారు పోయినప్పుడు కూడా నేను అదే విధంగా 11వ రోజున.. ఆపుకోలేని దుఃఖము ఉప్పెనలాగ క్రమ్ముకున్న రోదనలో నిజమైన అనుభూతిని పొందాను. 'ఆట' కథలో క్రీడాకారులు తమ అంగవైకల్యాన్ని పదే పదే తమ విజయాల్లో ప్రస్తావన చేస్తుంటే, వారు పడే వేదనను రచయిత్రి బాగా వ్యక్తీకరించారు. తల్లిదండ్రుల నిర్లక్ష్యము వారిని ఎంత బాధిస్తుందో, వారి మనోభావాలపై ఎటువంటి ప్రభావము చూపుతుందో తెలియజేసారు. 'మౌలికస్వరము' కథలో ముగింపులో .. గాయపడ్డ గాయని మనసులోని మనోభావాలు, నిర్భీతితో ఆమె వివరించిన వాక్యాలు ఆకట్టుకున్నాయి. 'మొదటి అడుగు' కథలో వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ, ఆ దంపతులు తీసుకున్న నిర్ణయం నేటి యువతలో కొంతమందికైనా కనువిప్పు కలిగిస్తుందని ఆశించడంలో తప్పులేదనిపిస్తుంది. ఇంకా సమాజంలో అలాంటి వ్యక్తులు తారసపడే విషయం మనం వార్తాపత్రికల్లో చూస్తూనే ఉన్నాము. 'హృదయం ఎక్కడున్నాది' కథలో నియమాలని అపహాస్యం చేసే విపరీతధోరణి కనిపించింది. ఇది ఈమధ్య కనిపిస్తుండటం దౌర్భాగ్యం. తమ సౌకర్యమే లక్ష్యంగా భావించేవారికి ఆచారాల అంతరార్థాలు తెలుసుకోకుండా విమర్శించడం పరిపాటి అయిపోయింది. కుహనా సంఘసంస్కర్తలు కావాలని అభిలాషిస్తున్నారేమో ఈ జంట "వసుంధర". ఇక మిగతా కథలన్నీ మూస ధోరణిలో పేలవంగా సాగాయి.

**రామలింగేశ్వరరావు.**




## శివరంజని

ప్రఖ్యాత కథా, నవలా రచయిత శ్రీ శివల జగన్నాథరావుగారి కలం నుండి జాలువారిన ఇరవైఏడు కథల కథాసంపుటి "శివరంజని". డెబ్బై, ఎనభై దశకాల నాటి కథలను ఈ తరం వారికి పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నం. " ప్రియమైన రచయితలు" ప్రచురణలో జూన్ 2021 లో విడుదలయిన ఈ 'శివల కథలు' ధర రూ. 200.

ప్రతులకు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 33-22-2, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, **విజయవాడ - 520004**. ఫోన్ : 0866-2430302, 9052101320


నవచేతన పబ్లిషింగ్ హస్, 12-1-493/VA, గిరిప్రసాద్ భవన్, జిఎస్.ఐ.రోడ్, బండ్లగూడ, నాగోలు, **హైదరాబాదు- 500068** . ఫోన్ : 040-24224454/53


విశాఖ ప్రియమైన రచయితల సాహిత్య సంక్షేమ సంఘం, 7-50, శ్రీసాయి నిలయం, సింహాచలం, **విశాఖపట్నం - 530028**. ఫోన్ : 9951171696

## కథా బృందావనం

పద్నాలుగు కథలతో విశాఖ రసజ్ఞవేదిక ద్వారా ఇటీవలే వెలువడిన ఈ "కథా బృందావనం" కథల రచయిత శ్రీ సోమంచి వినయభూషణరావు గారు! రసగుళికల్లా ఉన్న ఈ కథల సంపుటి ధర ₹200/-. ప్రతుల కోసం రచయితనే సంప్రదించాలి.

502, గంగాధర్ ఎన్‌క్లేవ్,
సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్,
**విశాఖపట్నం - 530013**
ఫోన్: 9908495421







## పూర్ణమూ... నిరంతరమూ...

హృదయాన్ని, మెదడుని ఉద్రేకపరిచే కథనశైలితో, సమకాలీన వస్తువుతో, పాఠకుల అలోచనలను తట్టిలేపే పంతొమ్మిది కథలతో ఆదర్శిని మీడియా, హైదరాబాదు వారి ప్రచురణ ఈ "పూర్ణమూ... నిరంతరమూ.." రచయిత శ్రీ కె.ఎ. సురేష్ పిళ్లై.

ప్రతులకు

నవచేతన, విశాలాంధ్ర, నవోదయ, అమెజాన్, www.amazon.in

## కొసమెరుపు కథలు




శ్రీ పోట్లూరు సుబ్రహ్మణ్యంగారి పద్దెనిమిది కథలతో నవంబరు 2020లో విడుదలైన "కొసమెరుపు కథలు" ధర ₹ 150/-.

విశాఖ ప్రియమైన రచయిత సాహిత్యసంక్షేమ సంఘం ప్రచురించిన ఈ పుస్తకము యొక్క

ప్రతులకు

అన్ని బుక్‌స్టాల్స్ లోనూ లేదా రచయిత (ఫోన్: 9491128052) దగ్గర లభ్యమవుతాయి.



# నిన్ను దాటుకు చూడు

పి. వి. ఆర్. శివకుమార్
8779258589

*ధర్మఘాట్‌కి రానున్న ప్రళయం గురించి హెచ్చరించి, ముందు జాగ్రత్త చర్యగా వారిని పునరావాస కేంద్రాలకు తరలించటం అంత తేలికైన పని కాదు. బలవంతాన తరలింప చూస్తే, ఎన్నికలని దృష్టిలో ఉంచుకుని, మా పార్టీకి వోట్లు వేయరన్న కక్షతో ఇదంతా చేస్తున్నామని ప్రతిపక్షాలు ప్రచారం ప్రారంభిస్తారు. కాలహరణం జరిగి, సమయం మించిపోవచ్చు. అందుకే, మా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.*

**ఉపోద్ఘాతం**:

ఆ హిమాలయ పర్వత గుహాంతర్భాగంలో ఇరవైనాలుగు గంటల ఏకాంత ధ్యానం ముగించుకున్న మహర్షి వంటి మనీషికి చివరి అరగంటలో చెదిరిన ధ్యానం. ఏదో అలజడి. ఎక్కడినుంచో తెలియని హోరు. జలపాతమా? జనఘోషా?

ఇరవై నాలుగు గంటలుగా తను స్థిరంగా కూర్చున్న రాతి దిమ్మె సైతం ప్రకంపనలతో కదులుతున్న భావన.

ఏదో ప్రళయం జరగనున్నట్లు సంకేతాలు అందుతున్న భావన.


తల విదిలించి, మనసును వశపరచుకుని, ఏకాగ్రతతో ఓంకారం జపిస్తూ కూర్చుండిపోయాడు. చివరి క్షణాలలో అంతా సర్దుకున్న సూచన. నెమ్మదిగా లేచి, ఓంకార జపంతోనే, గుహ బహిర్భాగాన్ని చేరుకున్నాడు. చీకటికి అలవాటు పడ్డ కనులకి ఒక్కసారిగా, ఉషోదయ కాంతి రేఖలతో పసిడి పర్వతంలా మిరుమిట్లు గొలుపుతున్న కైలాసశిఖరం గోచరమై, 'అంతా శుభమే జరుగుతుందని' అభయమిస్తున్నట్లు తోచింది. రెండు చేతులూ పైకెత్తి జోడించి, కైలాసవాసుని స్మరిస్తూ బయటకు నడిచాడు ఆయన.

★★★

నాలుగు వైపులా ఉన్న కొండల మధ్య ఇమిడి ఉన్న ఆ ప్రాంతాన్ని ధర్మఘాట్ అంటారు. అక్కడ ఉన్న ఆరు గ్రామాల జనసంఖ్య లక్షన్నర. అన్ని గ్రామాల మీదా కలిపి అజమాయిషీ ముగ్గురు పెద్దల చెప్పు చేతలలోనే ఉంది. స్వరాజ్యం వచ్చినప్పటినుంచి, ఆ ఊళ్ళలో జెండా మారలేదు. అక్కడ రాజ్యమేలుతున్న పార్టీ ఎజండా మారలేదు. పండీపండని బీళ్లలో సాగీసాగని వ్యవసాయం, కొండకోనలలో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులు సేకరించి పొట్ట పోసుకోవటం... బయటి నుంచి వచ్చే దళారులు కట్టిన ధరలకి తల ఊపి, తీసుకోవటం, అదే ఆ గ్రామాలవారి వృత్తి, జీవనాధారం! అక్కడ ఒక్క బ్యాంక్ లేదు. బడి లేదు. ఆ గ్రామప్రజల్లో అవిద్య, అజ్ఞానాలని పోషిస్తూ, వారి వ్యవసాయ, అటవీ ఉత్పత్తులని కారుచవకగా స్వాధీనం చేసుకోవటంలో, అక్కడ పాతుకుపోయిన పార్టీ నిష్ణాతురాలైపోయింది. దేశంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఆ ఊసుకూడా అక్కడ తెలియదు. కొత్త పార్టీలు వస్తున్నా, ఎటూ లభ్యం కాని గుప్పెడు సీట్ల కోసం, ఆ భూగోళం వెలివేసిన

గ్రామాల మధ్యకి వెళ్ళి, పాతుకుపోయిన పార్టీతో తలపడి, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొని, అపజయం మూట కట్టుకునే అవసరం వాటికి ఎన్నడూ కనిపించలేదు.

అటువంటి ధర్మఘాట్ లో, ఊహించని మలుపు! త్వరలో వస్తున్న ఎన్నికల వాతావరణంలో, స్థానిక పార్టీ నాయకులంతా, జేబులో ఉన్న ఈ గ్రామాలని వదిలి, దేశం మీద పడ్డ పరిస్థితి చూసుకుని, కేంద్రంలో కొత్తగా అధికారం చేపట్టిన పార్టీ తాలూకు సుశిక్షితులైన వెయ్యి మంది కార్యకర్తలు, కారవాన్లలో ధర్మఘాట్ గ్రామాల మధ్యకి రామదండులా వచ్చి పడ్డారు. ముందుగా, ముగ్గురు గ్రామదేవతలకి దండిగా నైవేద్యాలు సమర్పించారు.



"మాకేమీ వద్దు. మీ వోట్లు కూడా వద్దు. నాలుగు రోజుల పాటు మా దారిన మమ్మల్ని వదలండి. చాలు" అని చెప్పారు.

అయ్యవార్లు నైవేద్యాలకి, విందు విలాసాలకి తృప్తి చెందారు.

అప్పటినుంచీ, కార్యకర్తలు ఊరూరూ, ఇల్లిల్లూ తిరిగారు. ప్రజలకి ఎన్నడూ చూడని స్వర్గంలాంటి పట్టణ వైభోగాలను సినిమాలు వేసి చూపించారు. ఎన్నడూ తిననోచని రుచులు వండి వార్చారు.

అయిదవ రోజు ఉరమని పిడుగులా దేశ ప్రధాని పర్యటన ఏర్పాటయింది. ప్రతిపక్షాలకి తెలిసేసరికే వేళ మించిపోయింది.

ప్రజలందరూ హాజరైన ఆ మహాసభని ఉద్దేశించి రెండు గంటలు అవిరళంగా ప్రసంగించారు ప్రధాని. ఎక్కడా రాజకీయాల ప్రస్తావన లేదు. ప్రతిపక్షాల ఊసు మొదలే లేదు.

ఇన్ని దశాబ్దాలుగా వాళ్ళు కోల్పోతున్నదేమిటో అన్యాపదేశంగా వివరించారు. చివరగా ఒక ప్రస్తావన చేశారు.

“దేశంలో అంతటా, ప్రభుత్వ ఉద్యోగులకి, కార్పొరేట్ ఉద్యోగులకి ఒక సదుపాయం ఉంటుంది. ప్రతి నిర్ణీత వ్యవధి తరవాతా, వారికి దేశంలో ఎక్కడికైనా వెళ్ళి, కొద్ది రోజులపాటు వినోదభరితంగా గడిపే అవకాశం ఉంది. ఇందుకు దారిఖర్చులు ప్రభుత్వం లేదా ఆయా సంస్థలు భరిస్తాయి. కొన్ని ఉదార సంస్థలు నివాసానికి, ఇతర విలాసాలకి అయ్యే వ్యయం కూడా భరిస్తాయి.

మీరు ఇన్ని దశాబ్దాలుగా పంటలు పండించి, అటవీ ఉత్పత్తులు సేకరించి ప్రజలకి అందించి, ఆటవిడుపు అనేది లేకుండా పాటు పడుతున్నారు. అందుకే, ఇప్పుడు ప్రభుత్వం మీ అందరికీ ఒక వారం రోజులపాటు, ప్రజా ఆహ్లాద పథకం క్రింద అటువంటి ఆటవిడుపు కల్పిస్తోంది. ఎల్లుండే మీ ఆటవిడుపు ప్రారంభం. మీ ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. మీరు మీ సామాను సర్దుకుని, సిద్ధం కండి. ఇక్కడ, మీ ఇళ్లను, మీ పశుసంపదను ఈ వారం రోజులూ మా కార్యకర్తలే సంరక్షిస్తూ ఉంటారు. మీ సెలవు దినాల ఖర్చుల కోసం ప్రభుత్వం రేపే మీ అందరికీ, ఇంటికి పది వేల రూపాయల చొప్పున అందజేస్తుంది.”

అత్యధిక ప్రజలు, ముఖ్యంగా యువత ఆనందంతో పొంగిపోయారు. అనుమానంతో నిండిన ప్రజలకి, కార్యకర్తలు నచ్చ చెప్పారు. మూడవ రోజు ఉదయానికి ఆ నాలుగు కొండల మధ్య లెక్కకి అందనన్ని లగ్జరీ బస్సులు బారులు తీరాయి. వంద కిలోమీటర్ల దూరాన ఉన్న విమానాశ్రయానికి ప్రజలని విడతలు విడతలుగా చేరవేశాయి. అక్కడినుంచి ఎయిర్‌ఫోర్స్ విమానాలలో ప్రయాణం. సాయంత్రానికి ఊళ్లన్నీ నిర్మానుష్యమై పోయాయి.

అక్కడికి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో, సువిశాల మైదానాలలో, పారామిలటరీ జవాన్లు నిర్మించిన విశాలమైన గుడారాలలో, కనీస సౌకర్యాలతో అందరికీ వసతి ఏర్పాటయింది.

★★★

అకస్మాత్తుగా దేశంలో పెను తుఫాను చెలరేగింది... రాజకీయ తుఫాను!

“ఏం జరుగుతోంది? పట్టపగలే ప్రజాస్వామ్యం ఖూనీ చేయబడుతోందా? గ్రామాలకి గ్రామాలనే హైజాక్ చేస్తుంటే, అడిగే వాళ్ళు లేరన్న ధైర్యమా? తమకి ఎన్నడూ వోటు వేయలేదని, ఆ గ్రామాల ప్రజలపై ఇంతటి ఉచ్చు పన్నుతారా? లేదంటే, ప్రభుత్వ ధనంతో ప్రజలని లోబరుచుకొని, వోట్లు వేయించుకునే పథకమా? ఇటువంటి తెగింపు ఎంతటి నియంతలోనూ చూడలేదు. ప్రధాని స్వయంగా పూనుకుని, ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఇష్టం వచ్చినట్లు దుర్వినియోగం చేసి, పాల్పడిన ఈ ఘాతుకానికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలి.”

ప్రతిపక్షాలు, అధిక శాతం మీడియా ముక్త కంఠంతో గర్జించాయి. నిరసన ర్యాలీలు నిర్వహించాయి.

ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయింది. అధికార ప్రతినిధులకు, ఎన్ని ప్రశ్నలు ఎదుర్కొన్నా, ఒకే జవాబు చెప్పే అనుమతి మాత్రమే లభించింది,

“ఇది బాధ్యతా యుతమైన ప్రభుత్వం. ధర్మఘాట్ ప్రజల ఆహ్లాదం కోసమే ఈ ఏర్పాటు చేయబడింది. వారి ఆనందోత్సాహలను ఎప్పటికప్పుడు వీడియోలు విడుదల చేస్తున్నాం. కావాలంటే, ప్రతిపక్షాలు, మీడియా ప్రతినిధులు పరిమిత సంఖ్యలో అక్కడకు వెళ్ళి చూసి రావచ్చు. అయితే, అక్కడ సభలు, సమావేశాలు, ధర్నాలు, రాజకీయాలు నిషిద్ధం. ప్రజల ప్రశాంతతని భగ్నం చేసే ఏ చర్యా అనుమతించబడదు.”

ప్రతిపక్షాలు, మీడియా పళ్ళు నూరుకున్నారు. కత్తులు నూరారు. తమ తమ ఛానెళ్లలో ఘోషించారు. ‘ఈ ప్రభుత్వ పతనానికి ఇది నాంది’ అని శాపనార్థాలు పెట్టారు. రానున్న ఎన్నికలలో ఈ ప్రభుత్వం మట్టి కరవక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ మిత్రపక్షాలు కూడా భయంతో కంపించిపోయే వాతావరణం సృష్టించారు.

ప్రభుత్వం తుఫాన్ ముందు ప్రశాంతతలాంటి గాంభీర్యం వహించి ఊరుకుంది.

★★★

అంతకు వారం రోజుల ముందే:

దేశ రాజధానిలో, అత్యంత గోపనీయంగా, కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగింది.

ప్రధానమంత్రి వెల్లడించిన ఒక ముఖ్యసమాచారం విని సభ్యులు తలలు పంకించారు తప్ప, అంతగా స్పందించలేదు. అటువంటి పరిస్థితులలో సాధారణంగా అనుసరించే పరిష్కార చర్యలు సూచించారు. అయితే, ప్రధాని వెల్లడించిన పరిష్కార పథకం విని, అంతటి అనుభవజ్ఞులూ ఉలిక్కిపడ్డారు.

“అదెలా సాధ్యం? అసలు ఎందుకా రాజకీయంగా ప్రమాదకరమైన దుస్సాహసం చేయటం? తరతరాలుగా, ధర్మఘాట్ గ్రామాలు ప్రతిపక్షాల ఉక్కు పంజాలో ఉన్నాయి. మనం ఇప్పుడు అక్కడకు పోయి తలదూర్చటం, చేజేతులా ప్రతిపక్షాలకు ఆయుధాలు అందించినట్లే అవుతుంది. ఒకవైపు ఎన్నికలు ముంచుకు వస్తున్న తరుణంలో, ఒక్క ఎం.పి. సీటు కోసం ఇలాటి ‘సెల్ఫ్ గోల్’ అవసరమా?” అసహనంగా ప్రశ్నించాడు రక్షణ మంత్రి.

“మీరు విన్నది నూటికి నూరు పాళ్ళు విశ్వసనీయమే అయిన పక్షంలో, మీ పథకం చివరిదాకా ఫలిస్తేనే, మనకి విజయం లభిస్తుంది. అయితే, అందులో ఏమాత్రం తేడా వచ్చినా, ఊహించినది జరగకపోయినా, ప్రతిపక్షాలు దేశంలో శాంతిభద్రతలకు భంగం కల్పించినా ఆశ్చర్యం ఉండదు. మనం అభాసుపాలు కావటమే కాదు, ఊహించని స్థాయిలో పరాజయం ఎదుర్కోవలసి వస్తుంది. ప్రధానిగా మీ ప్రతిష్ఠకి మాయని మచ్చ ఏర్పడుతుంది!” హెచ్చరికగా అన్నాడు గృహమంత్రి.

మిగిలినవారు కూడా అంత సుముఖత వ్యక్తపరచలేదు. అందరి అభిప్రాయాలూ విన్న ప్రధాని, ప్రశాంతంగా జవాబిచ్చాడు. తోటిసభ్యులు సూచించిన సాధారణ పరిష్కార చర్యలు ఇప్పటి పరిస్థితులలో ఎందుకు పనిచేయవని తాను అనుకుంటున్నాడో, సవివరంగా వారికి తెలియజెప్పాడు. చివరగా అన్నాడు:

“మీ ఎవ్వరి మాటలూ నేను ఖండించటం లేదు. నిజమే, ఇది దుస్సాహసమే. రానున్న ఉపద్రవం నాకు ముందుగా తెలిసింది. ఆ విషయం సంబంధిత శాఖల ద్వారా ధ్రువపరుచుకున్నాను. కనుకనే, ఈ నిర్ణయం తీసుకున్నాను. నిజానికి, నేను విన్న

ప్రమాదం రాకూడదనే కోరుకుందాం! అప్పుడూ ధర్మఘాట్ గ్రామాలకి మేలే జరుగుతుంది. అయితే, మనం అమలు జరిపే పథకం ‘కీడెంచి, మేలెంచే’ దిశలో జరుగుతున్న ప్రయత్నం. మీరన్నట్లు, ఒకవేళ, నా సమాచారం నిజం కాకపోతే, మనం తీసుకోబోయే చర్యకి నా ప్రతిష్ఠ, మన ప్రభుత్వ పరువు పోవచ్చు. కానీ, ప్రస్తుతం పరువు, ప్రతిష్ఠలని పణంగా పెట్టటమే మన కర్తవ్యం. నా సమాచారం నిజమనే నమ్ముతున్నాను. నమ్మిన ధర్మం ఆచరించటమే ముఖ్యం. గీతావాక్యం గుర్తు చేసుకోండి.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన । మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి ॥

కర్తవ్య కర్మను ఆచరించుటయందే నీకు అధికారం ఉంది. కానీ ఆ కర్మఫలముల పైన నీకు హక్కు లేదు.

కర్మఫలములకు నీవే హేతువు అని ఎప్పుడూ అనుకోకు. ఏ పరిస్థితులలోనూ, చేయవలసిన కర్మలు మానుటలో ఆసక్తి చూపకు. అందుకే, మనసా వాచా నమ్మి, ముందడుగు వేద్దాం. ఫలితాల ఆలోచన వద్దు.

మనని, మన సొంత లాభాలని దాటి, మరింత ముందుకు ఆలోచిద్దాం.”

ప్రధాని మీది గౌరవం, ఆయన విజ్ఞత మీది నమ్మకం అందరూ ఆయన పథకానికి అంగీకరించేలా చేశాయి.

“ఒక్క మాట. చివరి వరకూ ఈ విషయం ఈ నాలుగు గోడల మధ్యే ఉండిపోవాలి.”

అందరూ దృఢంగా తలలూపారు.

★★★

ప్రతిపక్షాలు రెండు రోజుల వ్యవధిలో భారత్ బంద్ పిలుపునిచ్చాయి. అయితే, మరుసటి రోజే విలయం విరుచుకు పడింది. హిమాలయ సానువుల్లో అంతర్లీనంగా ప్రవహించే పీయూష వర్షిణీ నది గత శతాబ్దంలో లేని విధంగా విశ్వరూపం దాల్చి, దశాబ్దాలుగా క్వారీలు తవ్వి, రాళ్ళు దోపిడీ చేయబడటంతో గుల్లబారిన కొండలను తేలికగా తొలుచుకుంటూ, ధర్మఘాట్ గ్రామాలను ముంచెత్తింది! దశాబ్దాలుగా నీటి చుక్కకు నోచుకోని గ్రామాలను జలసమాధి చేసింది. ధర్మఘాట్ అంతటా జలభీభత్సం తప్ప మరేమీ కనపడని పరిస్థితి! విషయం తెలిసిన దేశం విస్తుపోయింది!

“ఇంతటి విలయం జరిగితే, కనీసం కాచుకునే అవకాశం కూడా లేకుండా, ప్రజలను వినోదాల పేరిట అక్కడ లేకుండా చేసి, ఎంత ఘోర పాపం మూట కట్టుకుంది ఈ ప్రభుత్వం!” అనేశాయి ప్రజా పక్షాలు.

అప్పుడు నోరు విప్పారు ప్రధాని. దేశాన్ని ఉద్దేశించి టెలివిజన్లో ప్రసంగించారు.

“హిమాలయాలలో మంచు కరిగి, చరియలు మహోగ్రంగా ప్రవహించే ఉపద్రవ సూచికలు ప్రస్ఫుటంగా కానవస్తున్నాయని వాతావరణ శాఖ ముందుగా ప్రభుత్వానికి వర్తమానం అందించింది. పర్యవసానంగా, ప్రకృతి సహజ దుర్భేద్యమైన కోట వంటి ధర్మఘాట్ రాతి ప్రాంతంలో నమ్మశక్యం కాని జల ప్రళయం సంభవించవచ్చు అన్నది హెచ్చరిక.

వర్షాపాతం అధికంగా ఉండవచ్చునని అందరికీ తెలిసింది గానీ, ఈ సూచన అందరికీ తెలియదు.

అప్పుడే మేము తీవ్రంగా ఆలోచించాము. ధర్మఘాట్ కి రానున్న ప్రళయం గురించి హెచ్చరించి, ముందు జాగ్రత్త చర్యగా

వారిని పునరావాస కేంద్రాలకు తరలించటం అంత తేలిక పని కాదు. బలవంతాన తరలింప చూస్తే, ఎన్నికలని దృష్టిలో ఉంచుకుని, మా పార్టీకి వోట్లు వేయరన్న కక్షతో ఇదంతా చేస్తున్నామని ప్రతిపక్షాలు ప్రచారం ప్రారంభిస్తారు. కాలహరణం జరిగి, సమయం మించిపోవచ్చు. అందుకే, మా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మరో విషయం, అక్కడి ప్రజలను వినోదయాత్ర పేరుతో తరలించిన మరునాడే, సీ. ఆర్. పి. ఎఫ్. దళాలు, అక్కడి పశుసంపదను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఇంతటి విపత్తు సంభవించినా, ఒక్క ప్రాణ నష్టం కూడా సంభవించనీయలేదు.

ఇక ప్రభుత్వ ధన దుర్వినియోగంపై అభియోగాలు వచ్చాయి. విపత్తు సంభవించి, ప్రాణనష్టం సంభవించిన తరువాత, హెలికాప్టర్ సందర్శనలు, పునరావాస చర్యలు, మృతకుటుంబాలకి లక్షల పరిహారాలు మొక్కుబడిగా జరిగిపోవటం ఆనవాయితీ. వీటన్నిటికన్నా తక్కువ ఖర్చుతోనే, ప్రజలని ప్రశాంతంగా తరలించి, సౌకర్యవంతంగా ఉంచటం జరిగింది.

ధర్మఘాట్ లో నీరు తీసి, గ్రామాలలో మామూలు పరిస్థితులు నెలకొనే వరకూ, ఆ గ్రామాల ప్రజలు విలాస కేంద్రాలలోనే ఉంటారు. మామూలు పరిస్థితులు నెలకొన్నాక, వారిని గ్రామాలకు పంపటమే కాదు, వారి నివాసాల పునరుద్ధరణకు అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వం భరిస్తుంది. వారి పశుసంపదను వారికి అప్పగించటం జరుగుతుంది.

'ఒకవేళ, ఈ విలయం సంభవించకపోతే? వాతావరణ శాఖ వర్తమానం నిజరూపం దాల్చకపోతే?' అన్న ప్రశ్నఉంది.

అందుకు మేము చెప్పుకున్న సమాధానం ఒక్కటే. విలయం సంభవించాలని ఎవ్వరూ కోరుకోరు. సంభవించకపోతే, మా చర్యలు తప్పుగా అర్థం చేసుకుని, మా పై బురద చల్లే అవకాశం అందరికీ ఇచ్చినవాళ్లం అవుతాం. కానీ, విలయం సంభవించే సూచన ఉన్నప్పుడు మా ప్రతిష్ఠ కోసం ఆలోచించి, ప్రజల ప్రాణాలు పణంగా పెట్టటం సరికాదు. మా ప్రతిష్ఠనే పణంగా పెట్టటమే మంచిది అన్న నిర్ణయానికి వచ్చాము. ఇప్పుడు జరిగినది మీ అందరికీ తెలుసు. సర్వే జనాః సుఖినోభవంతు. జైహింద్."

**ఉప సంహారం:**

ఆరు నెలలలో ధర్మఘాట్‌ను ముంచెత్తిన పీయూష వర్షిణి నది నింపిన జలామృతం, అక్కడి బీడు పొలాలలో సహజమైన ఒండ్రు మట్టిని, ఖనిజ సంపదని నింపి, బంగారం పండే భూములుగా మార్చింది.

తిరిగి వచ్చిన ప్రజలకు సస్యశ్యామలమైన పంటలు పండే భూములు స్వాగతం పలికాయి.

విలయంతో గంగ పాలు కావలసిన తమ జీవితాలలో ప్రభుత్వం చేసిన ముందు ఆలోచన ఇంతటి మహోన్నత దశ తేవటం వారికి పట్టరానంత సంతోషాన్ని కలిగించింది.

# ప్లెక్సీ మీద బొమ్మ

డా. చెళ్ళపిళ్ళ సూర్యలక్ష్మి
📞 9445184363

> *"ఇది పాత ఫోటో మేడమ్, ఇప్పుడు పాపం ఆ కళే లేదు.*
> *పక్షవాతం వస్తే, ఆవిణ్ణి ప్రేమతో కూడా చూసుకోలేదు ఆ కొడుకు, కోడలు! ఆళ్ళకి డబ్బుల ఇబ్బంది ఉంది, కాని ప్రేమ మాత్రం ఫ్రీగానే లభిస్తాది కదు మేడమ్!"*

ముక్కనుమ రోజున జరిగే హడావుడి, ఆ తర్వాతి రోజుపై ఎటువంటి ప్రభావమూ చూపకూడదు. కానీ, మినహాయింపులుండక మానవుగా! మందు ప్రభావం వల్ల ఆ మరుసటి రోజు చాలా మంది సెలవు పెడుతూ ఉంటారు... ఆఫీసు పని మందకొడిగా సాగుతుంది.

ఒక అర్జంటు పని ఉండి, నేను మా ఊరు వెళ్ళలేక పోయాను. ఆ పని ముక్కనుమకి మరుసటి రోజు పూర్తయిపోవాలి. గట్టిగా చెప్పాలంటే, పండుగ రోజులన్నింటిలో నేను కాస్సేపు ఆఫీసుకి వెళ్ళక తప్పలేదు. ఒక్కో రోజు రెండు మూడు సార్లు కూడా వెళ్ళవలసి వచ్చింది.

అంటే, మా సిబ్బందిలో కొంతమందిని కూడా ఇబ్బంది పెట్టవలసి వచ్చిందన్న మాట! ఎన్నిసార్లు వెళ్ళినా, మా డ్రైవరు మాత్రం విసుక్కోకుండా, పిలిచిన పది నిముషాల్లోపు మా ఇంటి ముందుండే వాడు. ఏదో ఓవర్ టైమ్‌కి ఆశ పడి వచ్చాడేమో అని అనుకోలేము. అది ప్రభుత్వంవారి స్వంత వాహనం కాదు. కేవలం కిరాయి మీద తీసుకున్న ప్రభుత్వ వాహనం మాత్రమే!

★★★

పని పూర్తవలసిన రోజు కూడా సమయపాలనతో డ్రైవరు వచ్చి నన్ను ఆఫీసుకి తీసుకుని వెళ్తాడనుకున్నాను. కానీ, నేను బయలుదేరే సమయమైనా, అతను ఇంకా రాకపోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇంతకీ, అతను మందుబాబా? ఏమో, నా ఎదుటయితే కాదు!


అతని గురించి వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడానికి నేను ఈ ఊరు వచ్చి కొన్ని నెలలే అయ్యాయి కదా! పైగా, నేను వ్యక్తివాద సమర్థకురాలిని. నాతో ప్రవర్తించేటప్పుడు సరిగ్గా ప్రవర్తించారా లేదా అన్నదే నాకు కావాలి.

వ్యక్తిగతంగా వాళ్ళు మందు కొట్టచ్చు, సిగరెట్ కాల్చచ్చు. నా ఎదుట ఎటువంటి వాసనా సోకడానికి వీల్లేదు. ఇది జగమెరిగిన విషయం. నేను చెప్పిందే చేస్తాను, చేసిందే చెప్తాను గనుక అందరూ నాతో సరిగ్గానే మసలుకుంటారు. ఇలా అతను రాలేదని ఏవేవో ఆలోచనలు!

సాయంత్రం అయిదు లోపు పని ముగించాలి కాబట్టి, నా మెదడులోని రొదని కట్టిపెట్టి, గ్యారేజ్ తెరిచి నా కారుని బయటికి తీసి, ఆఫీసుకి బయలుదేరాను. ఎప్పుడూ వెనుక సీట్‌లో కూర్చుని మొబైలు నొక్కుకునే నేను, డ్రైవింగ్ సీట్‌లో కూర్చుంటే

వింతగా తోచింది. అలాగని మొబైలుకి అంకితమైపోయి, పరిసరాలు గమనించని దాన్ని కాను!

మా ఇంటి నుండి ఆఫీసు మూడున్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంచుమించు అర కిలోమీటర్ మా కాలనీ దాటడానికే పడుతుంది. ఏపుగా ఎదిగిన తురాయి, బాదం, నేరేడు చెట్లు రోడ్డుకిరువైపులా ఉంటాయి. ఎంత ఎత్తుగా, విస్తారంగా ఉంటాయంటే... వెళ్ళే వాహనాలకు గొడుగు పట్టినట్లుంటాయి. ఎండా కాలంలో కూడా ఏసీ లేకుండా వెళ్ళచ్చు!




గేటు బయటికి రాగానే హైవే. ఇక్కడ కూడా ఇరువైపులా చెట్లుంటాయి. కానీ చిన్నవి. వాటి కొమ్మలు అప్పుడప్పుడు కారుని రాసుకుంటూ ఉంటాయి. దూరం నుంచి చూస్తే అవి షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటున్నట్టుంటాయి.

ఒక పక్కన చర్చి, ఆ పక్కనే స్కూల్! దానికి ఎదురుగుండా చిన్న చిన్న ఇళ్ళుండే కాలనీ. మురికివాడ కాదు గాని తక్కువ ఆదాయం వచ్చే వాళ్ళు ఉండే చోటు. పేరు క్రాంతి కాలనీ. మా డ్రైవరు ఇల్లు కూడా అక్కడేనట. చెప్పాడు.

అది దాటితే ఎడమ పక్క పాల దుకాణం. కుడి పక్క శ్మశాన వాటిక. అక్కడ దయ్యాలు తిరగవట. మా డ్రైవరు చెప్పాడు. అది దాటితే ఎడమ పక్క ఒక విద్యుత్ పోల్ వస్తుంది. దానికో ప్రత్యేకత ఉంది. రోజూ దాని మీద ఎవరో ఒకరు ఫ్లెక్సీలో దర్శనమిస్తారు. శుభకార్యాల నిమిత్తం కాదు... పరలోకయానాన్ని గురించి తెలియజేస్తూ!

అది దాటితే ఎడమ పక్క మరో స్కూల్, దానికి ఆనుకుని ఫుట్ బాల్ గ్రౌండ్ ఉంటాయి. సాయంత్రం కాలేజీ యువకులు ఆడుతూ దర్శనమిస్తారు. దానికి ఎదురుగా క్రికెట్ గ్రౌండ్. అది దాటిన అర కిలోమీటర్‌కి కుడి పక్కన మా ఆఫీసు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

★★★

డ్రైవ్ చేసేటప్పుడు భలే ఏకాగ్రతతో ఉంటాను. పండుగ ఉత్సాహం ఇంకా తగ్గలేదో ఏమో, హైవేలో కూడా అసలు ట్రాఫిక్ లేనేలేదు. బండి సజావుగా పోనిస్తుంటే, తక్కువ ఆదాయపు ప్రజల కాలనీ నుండి శ్మశానం వైపు శవయాత్ర జరుగుతూ, రోడ్డు నిండిపోయింది.

ఇందువలనే, అతను రాలేదేమో అనుకున్నా! ‘ఓ ఫోను కొట్టి ఉండవచ్చుగా’ అని అనుకున్నాను. ‘కనీసం, ఒక మెసేజ్‌కి కూడా సమయం లేదా ఇతనికి’ అనుకున్నా!

వాళ్ళు వెళ్ళే దాకా కారు ఆపాలి కాబట్టి, నా మనసు గతంలోకి వెళ్ళినా నేను అడ్డు నిలువలేదు.

★★★

“మేడమ్, ఈ ఎడమపక్క క్రాంతి కాలనీ ఉంది చూశారా? అక్కడ చాలా మంది వస్తాదులుంటారు!” అన్నాడు అతను.

“ఎవరైనా పేరు ప్రఖ్యాతులున్న బాడీ బిల్డర్లు ఉన్నారా?” అడిగాను నేను.

“అలా కాదు మేడమ్, మా చిన్నప్పుడు ప్రతీ పండుగకీ, మద్యం ఎక్కువై జనాలు కొట్టుకునే వారు” అన్నాడతను.

“మరి పోలీసులు వచ్చేవారేమో?” అన్నాను నేను.

తాగుడుతో మొదలయ్యి, కులాల పేరుతో ఎండ్ అయ్యేవి, ఆ కొట్లాటలు! మన దేశంలో కులమనేది చాలా సెన్సిటివ్ విషయం గనుక పోలీసులు కూడా ఇరువైపులా సంధి చేసేవారు.

“ఇంట్లో అందరు మగవాళ్ళూ దొమ్మీలో పాల్గొనేవారు. జంగిల్ రాజ్‌లా మా వాళ్ళు మసలుకుంటే బలహీనులు ఓడిపోయి, చనిపోతారని, ఇంట్లో అందరు మగాళ్ళనీ వస్తాదుల్లా తయారు చేసేవాళ్ళు. అదీ సంగతి!” అన్నాడతను.

నాకు భయం వేసింది. “మరి ఇప్పుడు?” అని అడిగాను.

“తొంభైల వరకూ జరిగేవి మేడమ్, ఇప్పుడు ఆగిపోయాయి. తరం మారిందిగా!” అన్నాడు డ్రైవరు.

“అన్నీ పూస గుచ్చినట్లు చెప్తున్నారు, ఇన్ని డీటైల్స్ మీకెలాగ తెలుసు?” అని అడిగాను.

“కొన్ని విన్నవి, మరి కొన్ని కన్నవి, ఇంకొన్ని చేసినవీను,” అని జవాబిచ్చాడు.

ఎప్పుడూ బుద్ధిగా కనిపించి, అలాగే మసలుకునే డ్రైవరు ఒక మాజీ రౌడీ అని తెలిసిన వెంటనే, నా పెదవులు అప్రయత్నంగా ‘అమ్మ బాబోయ్’ అని అరిచాయి.

అతనో నవ్వు నవ్వి, "భయపడకండి మేడమ్, నేను అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ కూడా ఒక పర్ఫెక్ట్ జెంటిల్మన్‌ని. మాతో తగవులాడే కులపు అమ్మాయినే, రెండు వైపులా పెద్దల ఆశీస్సులతో పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరు పిల్లల తండ్రిని కూడా!" అని సర్ది చెప్పాడు.

జీవితంలో తెల్లవన్నీ మంచితోనూ, నల్లవన్నీ చెడుతోనూ పోల్చకూడదంటారు ఇందుకేమో, అని నేను అనుకున్నాను.

★★★

వర్తమానంలోకి వచ్చి చూస్తే ఊరేగింపు ఇంకా దాటిపోలేదు. జనప్రవాహం పెరుగుతున్నట్టు అనిపించింది. లేట్ అయ్యేటట్టుందని, ఆఫీసుకి ఫోన్ చేసి, కొన్ని విషయాల్లో సూచనలనిచ్చి, నేను ఆఫీసుకి చేరేసరికల్లా, చేసిన పనికి ప్రింట్ తీసి, నా టేబుల్ మీద పెట్టమన్నాను. తరువాత, ఈ ఊళ్ళో నాకు ఆశ్చర్యం కలిగించిన ఫ్లెక్సీ మీది బొమ్మలు, వాటి వెనుక కథలు గుర్తు చేసుకున్నాను. ఎందుకంటే, ఇవ్వాళ నేను చూసిన ఈ చావు తరువాత, బొమ్మ ఖచ్చితంగా మారుతుంది కాబట్టి.

★★★

తప్పతాగి డ్రైవింగ్ చేస్తూ, ఎదుటి బండినో, రోడ్డు డివైడర్‌నో గుద్ది మరణించిన వారే ఎక్కువ ఈ బొమ్మల్లో! కానీ, కొన్ని మనసుని కదిలించే కథలు లేకపోలేదు. "పాపం ఈ పెద్దావిడ మహాలక్ష్మి కళతో ఉన్నారు. ఎలా పోయారేమిటి?" అని నేను అడిగితే, "ఇది పాత ఫోటో మేడమ్, ఇప్పుడు పాపం ఆ కళే లేదు. పక్షవాతం వస్తే, ఆవిణ్ణి ప్రేమతో కూడా చూసుకోలేదు ఆ కొడుకు, కోడలు! ఆళ్ళకి డబ్బుల ఇబ్బంది ఉంది, కాని ప్రేమ మాత్రం ఫ్రీగానే లభిస్తాది కదు మేడమ్!" అన్నాడు డ్రైవరు.

★★★

మరో రోజు పైనాపిల్ హెయిర్‌కట్ ఉన్న ఒక నూనూగు మీసాల యువకుడి గురించి చెప్తూ, "వీణ్ణి పాము కాటేసిందండీ!" అన్నాడు.

"అయ్యో, టీనేజర్. ఎలా కాటేసింది?" అని అడిగాను.

"వాడు కోరి తెచ్చుకున్నాడు. మా ఇంటి చుట్టుపక్కల ఎక్కడ పాములొచ్చినా, వీడు ఒడుపుగా పట్టగలడు. మంచి పేరుంది కూడా! అదే ఆడి పొగరుకి కారణమయ్యింది. అయిదు రోజుల క్రితం ఓ పాముని పట్టి, దాన్ని నులక మంచం కోడుకి కట్టేశాడంట. పైగా సిగరెట్‌తో వాతలు పెట్టాడంట. నిన్న దాని మెడని పుచ్చుకుంటే అది కాటు వేసిందంట. ఆ విషాన్ని నోటితో లాగితే, కొంత లోపలికి పోయి, వెంటనే పోయాడంట. శాడిస్ట్ సచ్చినోడు సచ్చాడు. పాములు సంతోషిస్తాయి లెండి!" అన్నాడు.

★★★

ఇంకొకసారి, "ఒక తల్లికి కడుపు కోత మిగిల్చాడమ్మా వీడు!" అన్నాడు.

"క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం వచ్చింది వీడికి! న్యూ ఇయర్‌కి రాలేనని తల్లికి చెప్పాడు. ఆఖరి నిముషంలో పని

ముగిశాక వాళ్ళు వాడికి ఊరుకి వెళ్ళే పర్మిషన్ ఇచ్చారంట. తాను కారు తిన్నంగా నడుపుతున్నా, న్యూ ఇయర్ గనుక రాష్ డ్రైవింగ్ ఎక్కువగా ఉందంట హైవేలో! దాన్ని తప్పించుకుని వస్తుంటే, ఒక బ్లైండ్ కర్వ్‌లో యమా స్పీడ్ మీద వచ్చి, ఒక బెంజ్ కారు గుద్దేసిందంట. మనోడు సీట్ బెల్ట్ పెట్టుకోలేదంట, అంతే, ఆం ఫట్ అయిపోయాడు! పాపం, తండ్రి చిన్నప్పుడే పోయాడు. తల్లీ, తండ్రీ రెండూ తనే అయ్యి పెంచిన ఆ తల్లి ఇప్పుడు ఏకాకి అయ్యింది!" అని అతను చెప్తుంటే వస్తున్న కన్నీళ్ళని ఆపుకోవడానికి కర్చీఫ్ అంది వచ్చింది నాకు.

సంక్రాంతి ముందు...

"ఇప్పుడు స్త్రీ స్వాతంత్ర్యం పేరుతో ఆడోళ్ళు తెగ తాగేస్తున్నారండీ! దానికి ఈవిడే ఎగ్జాంపుల్ అండీ!" అని మరొకామె గురించి చెప్పాడు అతను.

★★★

వెనుక ఉన్న బళ్ళ హారన్‌లు కర్ణభేరిని బద్దలు కొడుతుంటే, వర్తమానంలోకి వచ్చాను. అంతిమ యాత్ర పూర్తయ్యిపోయినట్టు ఉంది. కారు ముందుకు పోనిచ్చి, కరెంట్ పోల్ మీద వేలాడే ఫ్లెక్సీ మీది బొమ్మ ఎవరిదా అనే కుతూహలం కొద్దీ చూశాను.

నమ్మబుద్ధి కాలేదు. "కె.ఎమ్.బి.జె.కె. రమేశ్ కుమార్" అన్న పేరుకి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. ఆ ఫోటో... నా డ్రైవరుదే. పర్ఫెక్ట్ జెంటిల్మన్ అయినవాడు ఇంత సడన్‌గా ఎలా పోతాడు? అతని కవల అయి ఉండచ్చేమో! కానీ, పేరు?

వెంటనే కారు స్టార్ట్ చేసి, అక్కడ ఇంకా వెనుకబడిన కొందరిని విషయం కనుక్కుందామనుకున్నాను.

"నిన్న అందరూ తప్పతాగి దొమ్మీకి దిగారు!" అనగానే, "రమేశ్ కూడానా?" అని అడిగాను.

"అతను తాగడమ్మా. అన్నీ మంచి బుద్ధులే! అందుకేనేమో, కొట్టుకునే వాళ్ళని సముదాయించబోతే, ఎవరో వెనుక నుండి దుడ్డుకర్రతో బలంగా కొట్టారు. వెంటనే ప్రాణాలు పోయాయి!" అన్నారు వాళ్ళు.

ఎప్పుడూ నాకు ఫ్లెక్సీ మీది బొమ్మల వెనుక కథలు చెప్పే మనిషి, ఒకనాడు తానే ఒక బొమ్మలా దర్శనమిస్తాడని, తన చావు వెనుక ఒక ఆదర్శం ఉంటుందని, నేను అనుకోలేదు.

కర్తవ్యం పిలుస్తుంటే... అక్కడే ఆగలేక, మళ్ళీ కారు స్టార్ట్ చేసి, కళ్ళలో తిరుగుతున్న నీళ్ళని అక్కడే ఆపేసి, వాటిని దిగమింగి, భారమైన హృదయంతో మూడు నిముషాల్లో ఆఫీసు చేరుకున్నాను.

# నెలవు

## సి. యమున
9550445911

***ఓనాడు, వైకుంఠం నుండి నేరుగా భూమికి దిగి వచ్చి మొసలి బారిన పడిన ఏనుగును రక్షించావట. మా పెద్దలు చెప్పగా విన్నాను. మరి ఇప్పుడు ఇలా చేశావే ? బోనులో పట్టి బంధించిన నా బిడ్డ అమాయక మొహం నీకు కనపడ లేదా? చూస్తూ కూర్చున్నావా... మా తల్లీ బిడ్డలం ఇలా దూరమవ్వటం ఎంత బాధాకరమో తెలుసా... నా రోదన నిన్ను చేరటం లేదా?" ఆ చిరుత వేదన***

చిరుత తల్లి :

ఎటు పోయింది ఈ బుజ్జిది? చీకటి పడింది... వర్షం కూడా వచ్చేటట్లు ఉంది. జాడ తెలియటం లేదు. రెండు రోజులగా వేట చిక్క లేదు. ఆకలితో పిల్లలికి డొక్కలు మాడుతున్నాయి.

“నేను ఏదో ఒకటి వేటాడి తీసుకు వస్తాను. ఈ చిన్న గుట్ట ప్రక్కనే ఉండండి. ఎక్కడికి పోవద్దు. ముఖ్యంగా ఆ మెట్ల దగ్గరకు వెళ్ళకండి. అక్కడ రకరకాల తినుబండారాలు అమ్ముకునే వారితో, మెట్లు ఎక్కి ఆ దేవుడిని దర్శించుకోవటానికి వెళ్ళే భక్తులతో రద్దీ ఉంటుంది. వాళ్ళ కంట పడవద్దు!” ముగ్గురు పిల్లలకు జాగ్రత్తలు చెప్పాను.

ఇద్దరు పిల్లలు బుద్ధిగా తలఊపారు. బుజ్జిది మటుకు “ఎందుకు వెళ్లకూడదు?” అని సూటిగా ప్రశ్నించింది.

అది పుట్టినప్పటి నుండీ అంతే. మిగతా పిల్లల్లా కాదు. ప్రతిదీ తెలుసుకోవాలనే ఆరాటం. ఆ మధ్య కొండ చిలువ పిల్లను మెడలో వేసుకు వచ్చింది. భయపడి పోయాను.

గబ గబా మెడ నుండి తీసి, చెట్టు మీదకు వదిలేశాను. అది పిల్ల కాబట్టి సరిపోయింది. అదే పెద్ద కొండ చిలువ అయితే? హమ్మో, ఊహించుకుంటేనే భయమేసింది.

“అలా ఎందుకు చెట్టు మీద పడేశావు?” అంటూ కోపంగా గాండ్రించింది బుజ్జిది.

“కొండ చిలువ అంటే ఏమనుకున్నావు... అది చుట్టి, గట్టిగా బంధిస్తే ఏమవుతుందో తెలుసా!” అంటూ ఓపికగా వివరించి చెప్పాను.

అంతా విని, “బుజ్జీ, ఇంక ఎప్పుడూ అలా తీసుకురాకు. భయం వేస్తోంది!” అంటూ పిల్లలు డొక్కలో దూరి పోయారు. బుజ్జి మటుకు గుర్రుగా చూస్తూ ఉండిపోయింది.

అందుకే బుజ్జికి అర్థమయ్యేటట్లు చెప్పాలని, “ఎందుకు మనుష్యుల కంటపడకూడదో తెలుసా? వారిలో కొందరు, మనల్ని వేటాడి చంపుతారు!” అన్నాను మెల్లగా.

“ఎందుకు?” వెంటనే మళ్ళీ ప్రశ్న దూసుకొచ్చింది బుజ్జి నుండి.

"మనల్ని చంపి, మన చర్మాన్ని, గోళ్ళను పెరికి అమ్ముకుంటారు!" అన్నాను కోపంగా.

"బాబోయ్, అలా అయితే మేము అటుకేసి వెళ్ళం!" అన్నారు పిల్లలిద్దరూ వణికిపోతూ.

బుజ్జిది మటుకు "నేనే వాళ్ళ గోళ్ళు, చర్మం ఒలిచేస్తాను!" అని తల ఎగరేసింది.

'ఈ పిచ్చి మొహంది మనుష్యుల దగ్గరకు పోయి ఎలాంటి ఆపదలు తెచ్చుకుంటోందో...' నా గుండెల్లో దడ.



"చూడు బుజ్జీ, వారి దగ్గర తుపాకులు ఉంటాయి. ఎంతో దూరం నుండే మనల్ని కాల్చి, మట్టి కరిపిస్తారు. జాగ్రత్త. పొరపాటున కూడా వారి దగ్గరకు వెళ్ళకు!" అని ఓర్పుగా చెప్పి వేటకు వెళ్ళాను.

తిరిగి వచ్చేసరికి బుజ్జిది లేదు.

"మేము చెపుతున్నా వినకుండా, 'నేను కూడా ఏదన్నా తింటానికి దొరుకుతుందేమో చూస్తాను. ఈ చుట్టు ప్రక్కలే ఉంటాను' అని వెళ్లింది. ఇంకా రాలేదు!" భీతిల్లిన గొంతులతో పిల్లలిద్దరూ చెప్పారు.

మనసంతా బాధ. ఇప్పుడిప్పుడే అడవిలో ప్రదేశాలకు అలవాటు పడుతోంది. పాపం, పసిది. వేట కూడా పూర్తిగా రాదు. తనకి ఇంకా శత్రువు, మిత్రుల మధ్య తేడా తెలియదు. ఎక్కడని వెతకాలి?

అంజలి :

ఈ కొండలు, అడవి ఎంత బాగుందో! మా ఇంటి ముందు కుండీలలో ఉన్న చిన్న మొక్కలు... రోడ్డు మీద ఉన్న చెట్లు తప్పితే నేను ఎప్పుడూ ఇంత పెద్ద పెద్ద చెట్లు చూడ లేదు. నాకు పుట్టగానే ఏదో జబ్బు చేసిందట. అప్పుడు అమ్మ మొక్కుకుందట, ఈ కొండపై ఉన్న దేవుడి దగ్గరకు తీసుకు వస్తానని. నాకు వెంటనే జబ్బు తగ్గిపోయిందట.

"అంజలికి ఐదేళ్లు నిండి పోయాయి. ఇంకా ఎప్పుడు మొక్కు తీర్చేది ? దానికి ఈ మధ్య ఏదో ఒకటి వస్తోంది. ఆ భగవంతుడికి కోపమొస్తుందేమో! మొక్కు తీర్చేద్దామండీ." అమ్మ, నాన్నతో గట్టిగా చెప్పింది.

"అంత ఖర్చు పెట్టటానికి డబ్బులు లేవు" అని నాన్న చెప్పినా అమ్మ వినలేదు.

నాకు మొక్కులు, ఖర్చులు అంత అర్థం కాలేదు. కానీ ఇక్కడకు వచ్చి చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. మా స్కూల్ ఇక్కడ ఉంటే ఎంత బాగుంటుందో అనిపిస్తోంది. మా స్కూల్లో అన్నీ గదులే! చెట్లు, ఆడుకోవటానికి చోటు... ఏమీ లేవు!

చాలా మెట్లు ఎక్కి, కొండపైకి వెడితే అక్కడ గుడిలో దేవుడు ఉన్నాడట. ఈ మెట్లు ఎక్కి వెళ్ళటం కూడా మొక్కేట! అమ్మ చెప్పింది.

"ఇది నడవగలదా... మనకి ఎత్తుకోవటం కష్టం అవుతుందేమో!" అన్నారు నాన్న.

"చూసుకోండి, మీకన్నా ముందుగా ఎక్కేస్తాను. మీరు తమ్ముడిని ఎత్తుకుని రండి!" అన్నాను ఆ చుట్టూతా చూస్తూ.

"సరే, ఉత్సాహపడుతోందిగా... ఎక్కనీండి. దాని వల్ల కాకపోతే అప్పుడే ఎత్తుకుందాము!" అంది అమ్మ.

నేను గబ గబా ఎక్కటం మొదలు పెట్టాను.

"అలా ముందుగా వెళ్ళిపోకు. తప్పిపోతే కష్టం!" అన్నారు నాన్న తమ్ముడిని భుజం మీద వేసుకుని.

అయినా వినకుండా ఎక్కేస్తున్నాను.

"చెప్పేది నీకు కాదా... అలా పరుగెత్తకు. బూచాడు ఎత్తుకు పోతాడు!" ఆయాసపడుతూ అమ్మ అరిచింది.

దానితో భయమేసి, మెల్లగా ఎక్కటం మొదలు పెట్టాను.

కొంతసేపు తరువాత, తమ్ముడు ఏడుపు మొదలు పెట్టాడు.

"వీడికి ఆకలి వేస్తోందనుకుంటా... పాలు పట్టి బయలుదేరదాం!" అంది అమ్మ మెట్ల మీద ఓ ప్రక్కగా కూర్చుని.

నేను, నాన్న కూడా ఆగిపోయాము. అమ్మ తన బాగ్‌లో నుండి బాటిల్ తీసి తమ్ముడికి పాలు పడుతోంది.

"అటు చూడు, ఆ గుడి ఎంత బాగుందో!" అన్నారు నాన్న.

నేను, అమ్మ అటుకేసి చూశాము. మాకు కాస్త దూరంలో, పెద్ద పెద్ద చెట్ల మధ్య చిన్న గుడి.

"భలే ఉంది!" అన్నాను నేను చప్పట్లు కొడుతూ.

"ఓసారి అది చూసి, మళ్ళీ నడక మొదలు పెడదాం!" అంది అమ్మ.

"నువ్వు పాలు పడుతూ ఉండు" అంటూ నాన్న నన్ను తీసుకుని అటుకేసి నడిచారు.

ఆ గుడిలో ఎవరూ లేరు. మూసి ఉన్న గ్రిల్ తలుపులలో నుండి ఎవరో దేవుడు, దీపాలు కనపడుతున్నాయి.

"స్వామీ, రక్షించు" అంటూ నాన్న దండం పెట్టారు. నేను కూడా పెట్టాను.

ఇంతలో అమ్మ, "ఏమండీ మీ బాగ్‌లో నాప్‌కిన్ ఉంది ఇయ్యండి. వీడు పాలు కక్కుతున్నాడు!" అంటూ గట్టిగా పిలిచింది. "ఆ వస్తున్నా" అంటూ స్పీడ్‌గా నాన్న అమ్మ దగ్గరకు వెళ్లారు.

నేను అక్కడే ఉండి పోయాను. చుట్టూ చూశాను. చాలా చాలా పెద్ద చెట్లు. చల్లటి గాలి. ఏదో పూల వాసన కూడా వస్తోంది.

'ఆ ప్రక్కన పూల మొక్కలు ఉన్నాయా?' అనుకుంటూ ఆ చెట్ల కేసి నడిచాను.

కాస్త దూరంగా, ఓ చెట్టు చాటునుండి ఏదో బల్బుల్లాగా మెరుస్తున్నట్లు అనిపించాయి. అవి ఏమిటో చూడాలనిపించింది. మెల్లగా అక్కడికి వెళ్ళాను. చిన్న పులిపిల్ల కూర్చుని తొంగి చూస్తోంది. అచ్చు, నా బుక్‌లో చూసినట్లే ఉంది.

మా ఇంటి ప్రక్క అంకుల్ వాళ్ళకు పెద్ద కుక్క ఉంది. దాని కన్నా కొంచెం పెద్దగా ఉందేమో అనిపించింది. నాకు అస్సలు భయం అనిపించలేదు.

నన్ను చూసి, కళ్ళు మూసి తెరిచింది. నాలిక బయట పెట్టి మూతి చుట్టూతా తుడుచుకుంది!

నేను వెళ్ళి అంకుల్ వాళ్ళ కుక్కకు ఇచ్చినట్లే, తన కాలు పట్టుకుని 'షేక్‌హాండ్ ' అని ఇచ్చాను. అది ఏమీ అనలేదు. తనకి ఎవరూ షేక్‌హాండ్ నేర్పలేదేమో!

"ఇదిగో, ఇదే షేక్‌హాండ్... నేర్చుకో!" అంటూ మళ్ళా రెండుసార్లు ఇచ్చాను.

అది తోకను మెల్లగా నేలకేసి కొట్టి, నా వైపు కాస్త సీరియస్‌గా చూసింది.

"ఎందుకూ కోపం" అంటూ తన ఎదురుగా కూర్చుని తన మెడ మీద చెయ్యేసి మా ఇంటి ప్రక్క కుక్కను రాసినట్లే చిన్నగా రాశాను.

'పాపం, తనకి కూడా నా మెడను తడమాలనిపించిందేమో, నోటిని మెల్లగా నా మెడ దగ్గరకు తీసుకు వచ్చింది..'

"అంజూ, ఎక్కడ ఉన్నావు!" అమ్మ పిలుపు గట్టిగా వినపడింది.

"అమ్మో... అమ్మ పిలుస్తోంది!" లేవబోయాను.

అది కంగారుగా, నోటితో నా మెడను గట్టిగా బిగించి, పరుగు పెట్టింది.

"అమ్మా ...వ..స్తు..న్నా......" నా పిలుపు అమ్మకు వినపడిందా?

పాప అమ్మ :

అది పుట్టగానే జబ్బు పడింది. ఎన్ని మందులకూ లొంగలేదు. ఈ దేవుడికి మొక్కగానే తిప్పుకుంది. మళ్ళీ మామూలు పిల్ల అయ్యింది. ఐదేళ్లు నిండాయి. ఇంకా మొక్కు తీర్చటానికి అవ్వలేదు. ఎప్పుడూ ఏదో ఖర్చులు.

మధ్యతరగతి జీవితాలు అంతేనేమో! ఈ మధ్య అంజలికి ఏదో ఒక ఆరోగ్య సమస్య వస్తోంది. మొక్కు పట్టించుకోలేదని, దైవం కన్నెర్ర చేస్తాడేమో అని భయం. అందుకే పట్టు పట్టి బయలుదేర తీశాను. అంజలి పుట్టిన తరువాత ఇదే పెద్ద ప్రయాణం. దానిలో ఎంత హుషారో!

ప్రొద్దున వాన పడి, కొండ మీద నుండి ఉరికి పడుతున్న జలపాతాలను చూసి ఆనందంతో కేరింతలు కొట్టింది.

మెట్లు ఎక్కటానికి తన ఉత్సాహం చూస్తే ముచ్చటగా ఉంది. మెట్లదారిలో కనపడ్డ ఉడతలు, కోతులు చూసి ఎంత సంబరంగా చప్పట్లు కొట్టిందో!

"అమ్మా, ఎంత పెద్ద చెట్లు! చాలా బాగుంది. మనం ఈ ఊరికి వచ్చేద్దామా?" పెద్ద కళ్ళను మరింత పెద్దవి చేస్తూ అడిగింది. నిజంగా దీని ఆనందం కోసమన్నా మళ్ళీ రావాలి.

మెట్లు ఎక్కుతూ, పిల్లవాడు ఏడవటంతో ఆగిపోయాము. బాబుకి నేను పాలు పడుతున్నాను. ఆయన, అంజలి ఆ మెట్ల ప్రక్కనే ఉన్న చిన్న గుడికి వెళ్లారు.

అంతలో బాబు పాలు కక్కటంతో, నాప్‌కిన్ కోసం నేను ఆయనను పిలిచాను. అంజలి అక్కడే ఉండి పోయింది. ఆయన వచ్చారు.

వాడికి కక్కుకున్న బట్టలు మార్చి, ఒళ్ళు తుడిచి పౌడర్ వేయటం పనిలో పడి పోయాము. అన్నీ సర్దుకుని అప్పుడు హడావుడిగా గుడికేసి వెళ్లాము. అక్కడ అంజలి లేదు.

చుట్టూతా చూసాము. ఏమీ కనపడ లేదు. అంత వేగంగా ఎక్కడికి వెళ్ళి పోతుంది?

హుషారుగా నడుచుకుంటూ, భక్తులతో కలిసి పైకి ఎక్కివేసిందా?

ఎలా తనని వెతకటం. మనసంతా ఆందోళన కమ్మేసింది.

"భగవంతుడా నా పాపను కాపాడు!" రెండు చేతులు ఎత్తి ప్రార్థించాను.

దేవుడు :

బిడ్డలకు దూరమైన ఆ ఇద్దరు తల్లుల రోదన నా మదిని కలచి వేస్తోంది.

"పసిబిడ్డ స్వామీ అది... నా ప్రార్థన ఆలకించి దానికి ఆయుష్షు పోసావనే, మొక్కు తీర్చుకోవటానికి వచ్చాను. మొక్కు తీర్చటం ఆలస్యమైనంత మాత్రాన ఇంత శిక్ష వేస్తావా? నువ్వు దేవుడివేనా? నీకు మనసనేది ఉందా?

కొండ మీద అడుగు పెట్టిన దగ్గర నుండి అంజలి ఆనందంతో తుళ్లి తుళ్లి పడుతోంది. పాముకు, తాడుకు తేడా తెలియని పసివయసు దానిది. దాని ఆనందం చూసి మళ్ళీ తీసుకు రావాలనుకున్నాను. కానీ దానిని ఇక్కడే శాశ్వత సమాధి చేస్తావనుకోలేదు.

అంజలి ఛిద్రమైన శరీరాన్ని తీసుకు వచ్చి ఆనవాలు పట్టమన్నారు. ఎలా గుర్తు పట్టానో తెలుసా? తన శరీర భాగాల మధ్య దొరికిన, సదా దానిలో మెడలో ఉండే నీ లాకెట్ ను చూసి. మాకు ఇంత శిక్ష అవసరమా? ఇలాటి ఆవేదన కలగ చేసినందుకు నేను నీకు ఎటువంటి శిక్ష విధించాలి?" అంటూ నన్ను నిలదీస్తున్న అంజలి తల్లి మాటలు, గుండెలను పిండేస్తున్నాయి.

మరో ప్రక్క చిరుత మాటలు ఎక్కు పెట్టిన బాణాల్లా దూసుకు వస్తున్నాయి...

"నేను ఏమి పాపం చేశాను స్వామీ? మాకు ఎందుకు ఈ దుఃఖం? పాపం బుజ్జిది, నిన్న మొన్నటిదాకా నా దగ్గర పాలు తాగిన చిరుత పిల్ల అది. ఇంకా వేట కూడా పూర్తిగా తెలియదు. మనుషుల ఉన్న ప్రదేశానికి వెళ్ళటమే అది చేసిన తప్పా?

ఓనాడు, వైకుంఠం నుండి నేరుగా భూమికి దిగి వచ్చి మొసలి బారిన పడిన ఏనుగును రక్షించావట. మా పెద్దలు చెప్పగా విన్నాను. మరి ఇప్పుడు ఇలా చేశావే ? బోనులో పట్టి బంధించిన నా బిడ్డ అమాయక ముఖం నీకు కనపడలేదా? చూస్తూ కూర్చున్నావా? మా తల్లీబిడ్డలం ఇలా దూరమవ్వటం ఎంత బాధాకరమో తెలుసా... నా రోదన నిన్ను చేరటం లేదా?" ఆ చిరుత వేదన, హృదయాన్ని బద్దలు కొడుతోంది.

ఏ ప్రాణి అయితే ఏమి... మాతృ హృదయం ఒకటే కదా!

ఒకనాడు సృష్టి మాత్రమే ఉంది. 'నాతో' సహా అందరూ ఆ సృష్టిలో సమాన భాగస్వాములం. ఎప్పుడైతే కొన్ని జీవులు మానవులుగా రూపాంతరం చెందాయో, అప్పుడే పరిధులు, పరిమితులు ఏర్పడ్డాయి. రూపమే లేని నాకు కూడా అనేక రూపాలు ఏర్పడ్డాయి.

లక్షల సంవత్సరాలు ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రతి జీవికి కొన్ని నెలవులు ఏర్పడ్డాయి. మానవులకు చట్టాలు, బాధ్యతలు కూడా నెలకొనబడ్డాయి.

తన నెలవు తప్పి, అమాయకంగా మనుష్యసంచారానికి దగ్గరగా వచ్చిన బుజ్జిది...

పసితనంతో మనుష్యసంచారాన్ని వీడి బుజ్జి దగ్గరకు వెళ్ళిన అంజలి పాప...

తమ బాధ్యత మరచి, భక్తులు సంచరించే నెలవులకు రక్షణ ఇవ్వని ఉద్యోగులు...

నా 'నెలవు' నుండి దర్శిస్తున్న నాకు కూడా మనసు తల్లడిల్లుతోంది... నిస్సహాయంగా!!

# బాబిగాడు

వై. జ్యోతిర్మయి

***"సార్! మా కోడలికి పెయిన్స్ వస్తున్నాయి. దయచేసి దారివ్వండి హాస్పిటల్కి తీసుకెళ్ళాలి. లేదంటే... బిడ్డ అడ్డం తిరిగి, పెద్ద ప్రాణానికి ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికే లేట్ అయ్యింది!" వేడుకుంది.***

***"అడ్డం తిరగలేదు కదా... కాస్త అక్కడ వెయిట్ చేస్తే... మా సి.ఐ. గారొస్తారు ఆయనతో మాట్లాడి చెప్తాను వెళ్ళు!"***

"అమ్మా! మామయ్యకి సీరియస్ అయితే... హాస్పిటల్లో జాయిన్ చేసారట!" గదిలోకి వస్తూ నెమ్మదిగా చెప్పాడు చక్రవర్తి.

పడుకున్నది కాస్తా గాభరాగా లేచి కూర్చుంది సుందరమ్మ.

"పడుకో పడుకో... అంత గాభరాపడకు!"

"బాబిగాడికి సీరియస్ అయ్యిందా?"

"హా! ముందు నువ్వు కంగారు పడకుండా చెప్పేది విను!"

"అయ్యో! ఇప్పుడెలా? ఆ పాడు కరోనాగాని వచ్చి చచ్చిందా ఏంట్రా?"

"కాదు... కాదు... కరోనా కాదట! హఠాత్తుగా గుండెల్లో పట్టేసినట్టై, స్పృహ తప్పి పడిపోయాడట. వెంటనే హాస్పిటల్కి..."

"ఏంటీ! హార్ట్ ఎటాక్ వచ్చిందనేగా చెప్పబోతున్నావ్?"

"లేదమ్మా! కంగారుపడకూ... అసలే నీకు..."

"షుగరు లేరా, పోతే పోయాను! బాబిగాడు అక్కడెలా ఉన్నాడో ఏమో!" కంగారుగా మంచం దిగుతూ అందామె.

"డాక్టర్లు చెక్ చేస్తున్నారట"

"..."

"ఇందాక ఒకసారి స్పృహలోకి వచ్చాడట. రాగానే... 'రీ' అంటూ నీ పేరే కలవరించాడట. నీకేదో రహస్యం చెప్పాలని అంటూండగా మళ్ళీ అన్కాన్షియస్ లోకి జారుకున్నాడట!" తల్లినే చూస్తూ చెప్పాడతను.

అంతే ఆమె మోము వింత భావాలతో నిండిపోయిందో క్షణం. ఆ వెంటనే కొడుకు చేతిని పట్టుకుంటూ "మనం ఇప్పటికిప్పుడు బాబిగాడి దగ్గరకు వెళ్ళాలి" అంది స్థిరంగా.

“ఇప్పుడా! ఇంత రాత్రప్పుడు ఎలా వెళతాం?”

“ఏం! నీకు కుదరకపోతే చెప్పు, నేనే వెళ్ళిపోతా!” కోపంగా అందామె.

“అది కాదమ్మా! కరోనా వల్ల కర్ఫ్యూ విధించారు కదా... రేపు ఉదయం వరకు ఆగాలి తప్పదు!” ఆమెకి అర్థమయ్యేలా చెప్పాడతను.

దాంతో తలపట్టుకుంటూ మంచంపై కూర్చుండి పోయిందామె.



“అమ్మా! ఇంతకీ... ఏం రహస్యం అమ్మా? నీకేమైనా ఐడియా ఉందా?” ఆమె పక్కనే కూర్చుంటూ అడిగాడతను.

చెప్పడం ఇష్టం లేనట్టుగా మొహం పక్కకు తిప్పుకుంటూ “నన్ను కాసేపు ఒంటరిగా వదిలేయ్” అందామె.

దాంతో “సరే... రేపు ఉదయం వెళదాం. నువ్వు కంగారు పడకుండా నిద్రపో!” అని చెప్పి వెళ్ళిపోయాడతను.

ఎడతెరిపి లేకుండా కొడుకు మాటలు చెవుల్లో గింగిర్లు కొడుతోంటే, మంచంపై పడుకుని సీలింగ్‌నే చూస్తూ, ‘బాబిగా! ఇలా జరిగిందేట్రా?’ అని మనసులో వాపోతూ, ముక్కోటి దేవతలను ప్రార్థించింది.

★★★

“ఇప్పుడు బయలుదేరాం అంటే... ఎప్పటికి చేరుకుంటాం అంటావు?” కారు విండోలో నుండి, వెనక్కి వెళ్ళిపోతున్న చెట్లను చూస్తూ అడిగిందామె.

“నాలుగు గంటలు పట్టచ్చు” చెప్పాడు చక్రవర్తి.

అంతే గుండెల్లో రాయి పడ్డట్టుగా విలవిలలాడిపోయింది ఆమె ప్రాణం. నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్న మనవడిని అసహనంగా చూస్తూ “ఇలా నడిపితే... ఇక అంతే సంగతులు. నామాట విని ఆ డ్రైవరుగాడిని పెట్టుంటే... ఈపాటికి బాబిగాడి దగ్గర ఉండేదాన్ని!” అందామె.

దాంతో ఆశ్చర్యపోయి చూస్తూ “బామ్మా! నీకోసమే చాలా జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నా!” అన్నాడు మనవడు.

“కరోనా కదమ్మా! డ్రైవర్ని పెట్టడం రిస్కని...” అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న చక్రవర్తి మాటలకి అడ్డొస్తూ

“కాస్త వేగంగా నడపమని నీ కొడుక్కి చెప్పేదు” కసిరినట్టుగా అంది బామ్మ.

దాంతో కారు వేగం పెంచుతూ, “సుందరీ! కామ్‌డౌన్... నేను తీసుకెళ్తాగా. ఇంతకీ! బాబి తాత ఏదో రహస్యం చెప్పాలీ అన్నాడట... దేని గురించీ?” అడిగాడు మనవడు.

“నీకెందుకురా! మాకూ మాకూ ఏన్నో ఉంటాయి. అన్నీ చెప్పాలా నీకు? అయినా... లక్షసార్లు చెప్పుంటా... రామం తాతా అని పిలవమని! వాడు నాకు మాత్రమే బాబిగాడు. ఇంకోసారలా పిలిస్తే, వీపు విమానం మోత మోగుతుంది జాగ్రత్త!” గయ్యిమందామె.

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆమెను కదిలించడం అంటే సునామీతో ఢీ కొట్టడమని అర్థమై, సైలెంట్‌గా ఉండమని, కొడుకుకి సైగ చేసాడు చక్రవర్తి. దాంతో కిమ్మనకుండా ఉండిపోయాడతను.

మనవడు రహస్యం గురించి అడగటంతో, ఆమె ఆలోచనలు గతంలోకి వెళ్ళిపోయాయి.

★★★

సుందరమ్మ, రామం ఇద్దరూ కవలలు. ఆమె పుట్టి, సరిగ్గా నాలుగు నిమిషాలకి రామం పుట్టాడు. ఊహ తెలిసేనాటికే, రామంని ‘బాబి’ అని పిలిచేదామె. బాబి ఆమెను సింపుల్‌గా ‘రీ’ అని పిలిచేవాడు. కవలలే కానీ, ఎందులోనూ వారిద్దరి అభిప్రాయాలు అసలేమాత్రం కలిసేవి కావు. దాంతో గొడవలు కూడా బాగానే పడేవారు. ముఖ్యంగా ఆహారపదార్థాల విషయంలో వారికి ఎక్కువగా గొడవలు జరిగేవి. సుందరికి మిఠాయిలు అంటే ప్రాణం. అందులోనూ ముఖ్యంగా జీళ్ళంటే ఆరోప్రాణం. బాబికేమో తీపి పదార్థాలంటే అలర్జీ. ఇక జీళ్ళంటే అసహ్యం. ఆమెకెంతో ఇష్టమైన జీళ్ళని అతడలా అసహ్యించుకోవడం చూసి, సహించలేక పోయేదామె. దాంతో హోరాహోరీగా గొడవ పడేవారు. చివరికి అలసిపోయి కలిసిపోయేవారు.

ఆమెకింకా బాగా గుర్తు సరిగ్గా పదమూడో ఏట, ఆమె గుండెల్లో బాంబు పేల్చాడతను.

“బాబిగా! మనలా ఇప్పటిదాకా ఎవరూ లేరు, ఇక ఉండరు, ఇకపై ఉండబోరు! ఇలా చెప్పుకోవడం ఎంత గర్వంగా ఉంటుందో తెలుసా!” అందామె.

చిన్నగా నవ్వాడతను.

“నా జీవితంలో నీకు తెలియని పేజీనే లేదు, అలాగే నీ జీవితంలో నాకు తెలియని పేజీ కూడా లేదు!”

“ఒక్క నిమిషం”

“...”

“చాలా రోజులుగా నీకో విషయం చెప్పాలి అని అనుకుంటున్నాను!” అన్నాడతను మెల్లిగా.

“ఏంటీ?”

“హా! నిజానికి ఎప్పుడో చెప్పాల్సింది...” అంటూ ఆగాడతను.

గుండెల్లో రైళ్ళు పరిగెడితే ఎలా ఉంటుందో మొదటిసారిగా తెలిసిందామెకు. కంగారుగా చూసిందతడిని.

“అదేంటంటే... నా జీవితంలో నీకు తెలియని పేజీ ఒకటి ఉంది!” ఆమెనే చూస్తూ అన్నాడతను.

అంతే దిగ్భ్రాంతిగా చూసిందతడిని.

“అవును”

“చెప్పు... ఏం...టది?” మాటలను కూడగట్టుకుంటూ అడిగిందామె.

ఓ క్షణం ఆమెనే చూసి “చెప్పను. అది రహస్యం” స్థిరంగా అన్నాడతను.

కోపంతో ఆమె మోము కందిపోయింది. ఊపిరి బలంగా తీసుకుంటూ, “చెప్పకు... నేనే కనుక్కుంటాను...” అంటూ శపథం చేస్తున్నట్టుగా అందామె.

అప్పటి నుండి ఇప్పటి దాకా, ఎన్నో ప్రయత్నాలు చేసింది. అయినా ఆ రహస్యం ఆమెకు తెలియలేదు.

వారం రోజుల ముందు వీడియో కాల్ మాట్లాడుతూ, “ఒరేయ్! బాబిగా... ఆ రహస్యమేంటో చెప్పేయిరా. ఇక నా వల్ల కాదు... వయసైపోయింది...” అలసిపోయినట్టుగా మొహం పెడుతూ అడిగిందామె.

“రీ! నువ్వేనా ఈ మాటంటోంది! అంటే ఓడిపోయావన్నమాట!” ఎగతాళిగా నవ్వుతూ అన్నాడతను.

దాంతో పౌరుషంగా చూస్తూ, “దుర్మార్గుడా! ఈ సుందరి ఎప్పటికీ ఓడిపోదు!” అందామె.

“అయితే కనుక్కో” అంటూ మరికాస్త గట్టిగా నవ్వాడతను.

అంతలా గుండ్రాయిలా గలగలా నవ్వే బాబిగాడు ఇప్పుడు హాస్పిటల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. ఎంత భయపడుంటే, ‘రీ’కి రహస్యం చెప్పాలని అంటాడు. ‘అయ్యో బాబిగా!’ అంటూ మరోసారి వాపోయిందామె.

హఠాత్తుగా కారు ఆగడంతో, ఈలోకంలోకి వస్తూ, చుట్టూ చూసింది సుందరమ్మ. పక్క రాష్ట్రానికి చెందిన బార్డర్ అది. ఎదురుగా పోలీస్ కానిస్టేబుల్ నిలబడున్నాడు.

కానిస్టేబుల్ని చూడగానే “ఎమర్జెన్సీ సర్! మా మామయ్య హాస్పిటల్లో ఉన్నాడు వెళ్ళాలి” చెప్పాడు చక్రవర్తి.

“అయితే ఏంటీ? మా తాతయ్య ఐ.సీ.యూ. లో ఉన్నాడు. నేను వెళ్ళానా... చచ్చినట్టు డ్యూటీ చేయడంలా!” దీర్ఘం తీస్తూ కోపంగా అన్నాడతను.

“సర్ ప్లీజ్...” అంటూ ఇంకా ఏదో చెప్పబోయిన చక్రవర్తిని ఆపుతూ...

“నీకేమైనా గుడ్డా! చుట్టూ ఎన్ని వాహనాలు ఆగున్నాయో చూడు. అంబులెన్స్లతో సహా ఆపేశాం. మేం చెప్పేవరకూ కదలకండి. ఇంతకీ ఆ వెనకాలున్న బామ్మ ఎవరూ... మాస్క్ పెట్టుకోలేదేం... మాస్క్ పెట్టుకోనందుకు పదివేలు ఫోన్ పే

చేయండి!" అధికారంగా అన్నాడు కానిస్టేబుల్.

కరోనా వేవ్ సునామీలా దాడి చేయడంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు, బయటి రాష్ట్రాల వాహనాలను ఎక్కడివక్కడ ఆపేశారు పోలీసులు.

ఎన్నో వాహనాలు, అంబులెన్స్‌లు ఎండలో నడి రోడ్డుపై దిక్కులేని పిల్లల్లా దీనంగా నిలుచుని ఉన్నాయి.

"పదివేలా! సర్ మేం కారులోనే ఉన్నాం కదా. కిందకి దిగలేదు కదా!" ఆశ్చర్యంగా అడిగాడు చక్రవర్తి.

"కారులో ఉన్నా లేకపోయినా, కిందకి దిగినా దిగకపోయినా ఇది మా రూల్!" అన్నాడతను.

ఇంతలో ఏవరో నడివయసు స్త్రీ అక్కడికొస్తూ "సార్! మా కోడలికి పెయిన్స్ వస్తున్నాయి. దయచేసి దారివ్వండి హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. లేదంటే... బిడ్డ అడ్డం తిరిగి, పెద్ద ప్రాణానికి ప్రమాదం ఏర్పడుతుంది. ఇప్పటికే లేట్ అయ్యింది!" వేడుకుంది.

"అడ్డం తిరగలేదు కదా... కాస్త అక్కడ వెయిట్ చేస్తే... మా సి.ఐ. గారొస్తారు ఆయనతో మాట్లాడి చెప్తాను వెళ్ళు!" అసహనంగా అన్నాడు కానిస్టేబుల్.

ఆ కానిస్టేబుల్ వ్యవహారం చూస్తే, ఇప్పుడప్పుడే పని జరగదని అర్థమైంది చక్రవర్తికి. దాంతో తన పలుకుబడిని అంతా ఉపయోగించి, పొలిటికల్ బాణాన్ని సంధించాడు. అంతే వెంటనే క్షమాపణలు చెప్తూ, ఎంతో మర్యాదపూర్వకంగా దారి వదిలాడు కానిస్టేబుల్.

జరిగిన తతంగాన్నంతా చూసి అసహ్యంగా మొహం చిట్లించింది బామ్మ.

"ఇదేంట్రా! పరిస్థితి ఇలా తగలడింది?" అంది చక్రవర్తిని చూస్తూ.

"కరోనా వేవ్ అంటమ్మా!"

"ఎంత కరోనా వేవ్ వస్తే మాత్రం... మానవత్వం ఉండక్కర్లా? డబ్బు, పలుకుబడి ఉంది కాబట్టి, మనకి దారి వదిలారు. పాపం ఆ నిండు చూలాలు ఆ ఎండలో, పైగా నొప్పులు కూడా వస్తున్నాయి ఎలా ఉంటుందో... ఒకసారి ఆ కానిస్టేబుల్‌తో చెప్పరా. ఆ అంబులెన్స్‌ని కూడా మనతో పాటు తీసుకెళదాం!" అందామె కొడుకును చూస్తూ.

"బామ్మా! మనల్ని వదలాలంటేనే, ఎన్నో కాల్స్ చేయాల్సొచ్చింది. ఇప్పుడు అంబులెన్స్‌ని కూడా మనతో తీసుకెళ్ళాలంటే కుదరదు!" వెంటనే అన్నాడు మనవడు.

"అది కాదు... పాపం ఆ అమ్మాయి ప్రసవ వేదన అనుభవిస్తోంది!" వెనకాల నుండి చక్రవర్తి భుజాన్ని పట్టుకుంటూ అందామె.

నిజమే! ఇలాంటి సమయంలో కాకపోతే ఇంకెప్పుడు ఒకరికొకరు తోడుంటారు? తమకు చేతనైన సహాయం చేయాలి. అదేగా మానవత్వం అనుకుంటూ, కారుని ఆపమని చెప్పి, కానిస్టేబుల్ దగ్గరకు వెళ్ళాడు చక్రవర్తి.

అతడెళ్ళే సరికే, ఇందాకటి నడివయసు స్త్రీ, కానిస్టేబుల్‌ని దుమ్మెత్తి పోస్తూ, బూతులు తిడుతూ శోకాలు పెడుతోంది. ఆమె

మాటల్లోనే జరిగిందేంటో అర్థమైపోయింది అతడికి. ఇక ఎక్కువ సేపు అక్కడ ఉండకుండా వెనుదిరిగి వచ్చేసాడు.

"చక్రీ! ఆ అప్రాచ్యుడికి చెప్పావా?" కానిస్టేబుల్‌ని ఉద్దేశించి అడిగింది బామ్మ.

"లేదు... బిడ్డ అడ్డం తిరిగి ఆ అమ్మాయి చనిపోయింది" మనసంతా వికలమవ్వడంతో నెమ్మదిగా చెప్పాడతను.

"అయ్యో! భగవంతుడా! 'సామాన్యుల ప్రాణాలెప్పుడూ సర్కార్ చేతుల్లోనే ఉన్నాయి' అనడానికి ఇదే నిదర్శనం!" తల పట్టుకుంటూ బాధగా అందామె.

★★★

హాస్పిటల్లోకి అడుగు పెట్టగానే "అత్తయ్యా! బాగున్నావా" ఆప్యాయంగా పలకరించాడు తమ్ముడి కొడుకైన జగన్నాథం.

"బాబిగాడు! నా బాబిగాడెక్కడ?" అతడిని చూడగానే కంగారుగా అడిగింది బామ్మ.

"అత్తయ్యా! కంగారు పడకు. నాన్నకేమీ కాలేదు. కరోనా డైట్ అని ఈ మధ్య ఒకటి పాటిస్తున్నాము. ఆ డైట్‌కి ఆయన శరీరం అడ్జస్ట్ అవ్వలేకపోయింది. అందుకే ఇలా జరిగింది. ఇప్పుడు బాగానే ఉన్నారు!" చెప్పాడు జగన్నాథం.

"నీ డైట్ కింత అగ్గిపెట్టా! ఆ వెధవ డైట్‌ని... నువ్వూ నీ సంతతి పాటించండి. బంగారంలాంటి నా బాబిగాడిని బాధపెట్టావు కదరా పాపి!" కోపంతో రగిలిపోతూ అంది బామ్మ.

"అమ్మా! శాంతం... లోపల మామయ్య నీకోసమే ఎదురు చూస్తూ ఉన్నాడట చూడు!" ఆమెను ఆపకపోతే హాస్పిటల్ని రణరంగంగా మర్చేస్తుందన్న భయంతో కంగారుగా అన్నాడు చక్రవర్తి.

"హా! అవును అత్తయ్యా... 'రీ' వచ్చిందర్రా? 'రీ' కి రహస్యం చెప్పాలీ అని ఇందాక కూడా అన్నారు నాన్నగారు..." అన్నాడు జగన్నాథం కూడా గాభరాగా.

అతడి వాక్యం పూర్తవ్వకముందే, తమ్ముడిని ఉంచిన గదిలోకి సునామీలా దూసుకుపోయిందామె.

మంచంపై నీరసంగా పడుకుని ఉన్న తమ్ముడిని చూడగానే, ఆమె ప్రాణం విలవిలలాడిపోయింది.

"బాబీ!" నెమ్మదిగా పిలుస్తూ, దగ్గరగా వెళ్ళింది.

ఆమె కంఠం వినపడగానే కళ్ళని విప్పి, ఆనందంగా నవ్వుతూ "రీ!" అన్నాడతను.

"మళ్ళీ నీ కంఠం వింటాననుకోలేదు!" తడికళ్ళతో చూస్తూ అందామె.

నేను కూడా అన్నట్టుగా, ఆమె చేతిని పట్టుకున్నాడతను.

"రాత్రి నుంచి నిద్రనేదే లేదు బాబీ... ఎన్నిసార్లు మృత్యుంజయ మంత్రాన్ని జపించానో నాకే తెలీదు!"

"రీ! నీ ప్రార్థనే నన్ను బ్రతికించింది"

“నిజం! ఆ రహస్యాన్ని చెప్పకుండానే పోతావేమోనని... భయంతో చచ్చిపోయాను!” నవ్వుతూ అందామె.

“వాతావరణాన్ని తేలికచేయడంలో నిన్ను మించినవారిని నేను చూడలేదు రీ” అతడు కూడా నవ్వేస్తూ అన్నాడు.

“సరే కానీ... ఇప్పుడెలా ఉంది?”

“ఉక్కు శరీరం. ఇంకో పదేళ్ళ దాకా ఢోకా లేదు!”

“అయితే! ఇంకో పదేళ్ల దాకా రహస్యాన్ని దాచగలవన్నమాట?” కనుబొమ్మలని ఎత్తి, అనుమానంగా చూస్తూ అడిగిందామె.

సమాధానం చెప్పకుండా నవ్వేశాడతను.

“దుర్మార్గుడా!” అంటూ అతడి నవ్వులో శృతి కలిపిందామె.

## విన్నపం

కథామంజరి శ్రేయోభిలాషులకు...

ఆర్నెల్ల క్రిందట కథామంజరి చందాదారులుగా చేరమని విన్నవించగానే, మీ నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఆ స్పందన ఫలితంగా కథామంజరికి ఆర్థికపుష్టి చేకూరింది. అవసరానికి మించిన అర్థము అనర్థహేతువు అని మేము కూడా నమ్ముతాం. అందుకే ఈ అభ్యర్థన.

**“తిరిగి మేం ప్రకటన చేసేవరకు, చందాలు పంపవద్దని మనవి!”**

మీరు అందించిన సహకారానికి ధన్యవాదాలు చెప్పుకుంటూ...

***

**కథామంజరి బృందం**



# సినిమా వాళ్ళంతే

**బి. నర్సన్**
9440128169

***“సార్! అంత మాట అనకండి. సిన్సియర్‌గా చెబుతున్నా. సినిమావాళ్లెవరూ ప్రీప్లాన్డ్‌గా ఎవరినీ ఇబ్బంది పెట్టరు. సినిమా తీయడమంటేనే ఆక్సిడెంట్ అయినవారిని హాస్పిటల్లో చేర్పించినంత హడావుడి. గాయపడ్డవారిని ఒకరు కారులో వేసుకొని వెళ్తారు. ఒకరిద్దరు పని వదిలేసి తోడు వెళ్తారు. ఓ అమ్మ చీర కొంగు చించి గాయాలకు కట్టుకడుతుంది. గాయపడ్డవారు వీరిని ఇలా ఇబ్బంది పెట్టాలని ముందే అనుకుంటారా! సాయపడ్డవాళ్లు ఫలితాన్ని చూస్తారు గాని కష్టాన్ని లెక్క చేస్తారా... ఇదీ అంతే అనుకోండి!’***

ఇంట్లో)కి దోమలు చొరబడకుండా అన్ని బందోబస్తుల్ని మరోసారి తనిఖీ చేసి వచ్చి ముఖద్వారానికి అదనంగా బిగించిన జాలీ తలుపును మూసివేస్తూ, బయటి సందడి ఏంటాని తొంగి చూశాడు నారాయణ. తమ ఇంటి కాంపౌండ్ గోడనానుకొని ఉన్న రోడ్డు మీద ఓ ఐదుగురు ఏదో వస్తువు పోగొట్టుకొన్నట్లు పైకి కిందికి చుట్టుపక్కల శ్రద్ధగా చూస్తూ ఆయనకు కనబడ్డారు.

భూమి ధరలు భగ్గుమంటున్నా, నారాయణ భార్య సులోచన హైదరాబాదులో ఇండిపెండెంట్ ఇల్లే కావాలని పట్టుపట్టడంతో, నగర శివారులో రెండు వందల గజాల జాగా కొని ఈ ఇల్లు కట్టుకోక తప్పలేదు. వర్షాకాలంలో జాజు పానకంలాంటి బురద, ఎండాకాలం ఇల్లంతా ఎరుపెక్కే దుమ్ము! అగ్గిపెట్టె కోసమైనా అర కిలోమీటర్ పోక తప్పని పరిస్థితిలోంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారు. ఏడాది క్రితం వేసిన సిమెంట్ రోడ్డు... ఒక్క వర్షానికే కంకర తేలి ప్రయాణాన్ని మరింత కష్టతరం చేసినా, దుమ్ము బాధ మాత్రం తప్పింది. కోరి ఈ దారెంట ఎవరు పోరు. కానీ, పొద్దట్టేలా స్కూల్ వ్యాన్లు, అప్పుడప్పుడు ఆటో రిక్షాలు తప్పదన్నట్లు వస్తాయి.


అరగంటైనా బయటివాళ్ల వెతుకులాట ముగియకపోవడంతో అసలు వీళ్లకిక్కడేం పని అనుకుంటూ వరండాలో లైట్ వేశాడు. దీపపు పురుగుల్లా గేటు తీసుకొని లోపలికి వచ్చారు వాళ్ళు. నారాయణ జాలీ తలుపు తీసి బయటకు వచ్చి వెంటనే మూసి, బయట దోమల బాధ పడలేక వారిని కూడా లోపలి రండని పిలిచాడు. నింపాదిగా లోనికి వచ్చి వాళ్ళు ముందు గదిలోని సోఫాల్లో ఆసీనులయ్యారు.

ఈ సీనంతా కిచెన్ లోంచి చూస్తున్న సులోచన... ‘ఎవరీ కొత్త ముఖాలూ... ఎంత దర్జాగా కూచున్నారు...’ అనుకుని కిచెన్ లోంచే, ‘ఎవరీ శాల్తీలు?’ అన్నట్లు భర్త వైపు చేయి ఊపింది. ఎవరో తెలియదన్నట్లు కింది పెదవి విరుస్తూ సమాధానమిచ్చాడాయన. చూస్తూ ఉండలేక, సులోచన అందరికి గ్లాసుల్లో నీళ్లు తెచ్చి ఇచ్చింది. ఆబగా నీళ్లు తాగి వాళ్ళు సంతృప్తిగా ముఖాలు పెట్టి, ఆ ఆలుమగల్ని కృతాజ్ఞతాపూర్వకంగా మార్చి మార్చి చూసారు.

ఖాళీగ్లాసును కింద పెడుతూ నిశ్శబ్దాన్ని బద్దలు కొడుతున్నట్లు ఒకాయన, “మేం సినిమావాళ్ళం” అన్నాడు. సినిమాలు బాగానే చూసే సులోచన యాక్టర్లేమో అనుకుని వాళ్ళ ముఖాల్ని గుచ్చి గుచ్చి చూడసాగింది. అటువంటి

దాఖలాలేవీ ఆమెకు కనిపించలేదు. వారి మాట అర్థమయీ కానట్లు నారాయణ తల ఎటో ఓ దిక్కు ఊపాడు.

“మా సినిమా పేరు ప్రేమ వారధి. అంటే ఓ యువ జంటకు పిట్ట గోడ దగ్గర ప్రేమ పుట్టి, కథ అలా ముందుకు సాగుతుందన్నమాట. మీ ప్రహరీ గోడ మా కథకు తగ్గట్టుగా ఉంది. కెమెరా మూవ్‌మెంట్‌కు సరిపోయే జాగా షూటింగ్‌కి తగిన డే లైట్, లొకాలిటీ బాగుంది. స్పెషల్లీ గోడ మరి ఎత్తుగా లేకుండా పాతబడి, నేచురల్‌గా ఉంది!” అన్నారు వారిలో ఒకాయన డైరెక్టర్‌గా చేతులూపుతూ!



“మేం ఎత్తే కట్టుకున్నాం... ఈ మధ్య రోడ్ వేయడంతో పొట్టిదయింది. రోడ్ పనుల వల్ల దుమ్ము కొట్టుకుపోయింది. నీళ్లు కొట్టినా పోలేదు!” అన్నాడు నారాయణ.

“‘నో నో నో... దాన్ని ముట్టకండి. అలాగే మాక్కావాలి. అవసరమైతే మేం దాన్ని మరింత డర్టీ చేస్తాం.” అన్నాడు మరొకాయన. ఆయన కెమెరామెన్ ఏమో!

“ఆర్నెల్లలో మా అబ్బాయి పెళ్లి ఉంది. ఇంటికి రంగులేయిస్తాం!” అంది సులోచన.

“నెల రోజుల్లో మా పని పూర్తి చేసుకుంటాం. ప్లీజ్ కోఆపరేట్ చేయండి!” ఈ మాట అన్న మనిషి బహుశ ప్రొడ్యూసరేమో!

"చాల లొకేషన్లు స్టడీ చేశాం. ఇంత కన్వీనియెంట్‌గా ఎక్కడా లేదు!" అన్నాడు డైరెక్టర్ తీరు చేతులూపినాయన. ఆలుమగలకు ఏమి అర్థం కావడం లేదు. "మా అబ్బాయినడగాలి. వాడు బయటికెళ్ళాడు!" అంది సులోచన లంగరేస్తున్నట్లు. "ఫోన్ నెంబర్ ఈయండి. ఇప్పుడే మాట్లాడుదాం!" అని ఫోన్ బయటికి తీశాడొకాయన.

"వాడు ట్రాఫిక్‌లో ఉంటాడు. మేం చెబుతాం లెండి!" అంది ప్రవాహాన్ని ఆపుతున్నట్లు.

"సరే! రేప్పొద్దునే వస్తాం!" అంటూ వినయంగా నమస్కరించి వెళ్లిపోయారు.

రేపు, ఎల్లుండి, ఇలా రోజులు, నెలలు గడిచిపోయినయి. సినిమావాళ్ళ జాడలేదు. చూసి చూసి 'సినిమావాళ్ళే ఇంత...' అని సులోచన వాళ్ళ గురించి ఎంతో తెలిసినట్లు అనడంతో, 'అంతా మన మంచికే!' అనుకున్నాడు నారాయణ.

అబ్బాయి పెళ్ళికి ఇంకా నెల రోజులుంది. ముందుగా ఇంటికి రంగులేయాలి అని పనివాళ్ళతో బేరం కుదుర్చుకున్నారు. 'రేప్పొద్దునే వచ్చి పని మొదలు పెట్టాలి' అని కొంత బయానా వారి చేతిలో పెట్టాడు నారాయణ. తెల్లవారుతూనే ఇంటిముందు అలికిడి వినరావడంతో "రంగులవాళ్ళు వచ్చినట్లున్నారు సులోచనా!" అంటూ బయటికి వచ్చాడు నారాయణ.

తమ గేటు ముందు రోడ్డుపైన ఇరవై మంది దాకా... లోకంతో తమకు పనిలేనట్లుగా ఎవరి పనుల్లో వారున్నారు. పెద్ద కెమెరా, మెరుపు కాగితాల పలకలు, ఓ వ్యాను కనబడ్డాయి. అంతా కొత్త కొత్తగా ఉందాయనకు. నారాయణను చూడగానే 'ఆనాడు సినిమావాళ్ళం' అంటూ వచ్చినవారిలో ఒకాయన "గుడ్ మార్నింగ్ సార్! ఇవాళ మంచి ముహూర్తముంది. షూటింగ్ మొదలు పెట్టేశాం!" అంటూ ఎదురుగా వచ్చాడు.

"ఒక్క మాటైనా చెప్పకుండా..." అన్న నారాయణ మాట పూర్తికాకుండానే... "యాక్టర్ల, టెక్నీషియన్ల డేట్ల కోసం నానా యాతన పడ్డాం" అని మాటకు అడ్డం పడుతూ "మావాళ్లు కుర్చీలు తేవడం మరిచారు. నాలుగు కుర్చీలు ఇస్తే హీరో హీరోయిన్లు కూచుంటారు" అంటూ ఆయన ఇంట్లోకి పదమన్నట్లు నారాయణపై చేయి వేశాడు. 'అసలు రంగులేసేవాళ్ళు ఏమయ్యారు?' అని ఆలోచించుకుంటూ నిద్రలో నడిచినట్లు ఇంటి లోపలికి వెళ్ళాడు నారాయణ. బయట జరుగుతున్నదాన్ని అయోమయంగా కిటికీలోంచి చూస్తున్న సులోచనతో "వారికి నాలుగు కుర్చీలు కావాలట!" అన్నాడు. సులోచన తల తిప్పకముందే... నారాయణ వెనకాలే ఇంట్లోకి వచ్చేసిన సినిమాయన, "యాక్టర్లను ఇంట్లోనే కూచోబెడదామండీ... వాళ్ళను బయట ఉంచితే మీకే న్యూసెన్స్‌గా ఉంటుంది" అన్నాడు.

'మన ఇంట్లో ఈయన పెత్తనమేందీ?' అని ఆలుమగలిద్దరు ముఖాలు చూసుకుంటూ కోలుకోకముందే, ఆరుగురు వర్ధమాన తారలైన నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు నడి ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. వాళ్ళను సోఫాల్లో కూచోబెట్టినాయన "నాలుగు వాటర్ బాటిళ్లు ఫ్రిజ్‌లో పెట్టండమ్మా" అంటూ వెళ్ళిపోయాడు.

ఎడారిలో తిరిగి తిరిగి వచ్చినట్లున్న వారి ముఖాలు చూడగానే సులోచన ఫ్రిజ్‌లో నీళ్ల బాటిళ్లను బయట పెట్టింది. క్షణాల్లో ఖాళీ అయిన వాటిని నింపి ఫ్రిజ్‌లో పెట్టింది. ఈలోగా స్టవ్ మీద కూర మాడిపోయింది. ఆ ఘాటుకు దగ్గులు, తుమ్ములు ఆపుకోలేక ఇద్దరమ్మాయిలు బెడ్‌రూములోకెళ్ళి తలుపేసుకున్నారు.

"బెడ్‌రూములో మా అబ్బాయి పడుకున్నాడు" అంటూ పరుగున వచ్చి సులోచన తలుపు కొట్టింది.

“ఎవరూ లేరు ఆంటీ!” అని జవాబు వచ్చింది కానీ, తలుపు తెరుచుకోలేదు.

“బాత్‌రూములో ఉన్నాడేమో. ముందు తలుపు తీయండి” అని మరింత గట్టిగా కొట్టడంతో తలుపు తెరుచుకుంది. అప్పుడే బాత్‌రూము లోంచి బయటికి వచ్చిన అబ్బాయి సురేష్‌కు పరిస్థితి అర్థం కాక, “ఇది మనిల్లేనా మమ్మీ?” అన్నాడు అయోమయంగా!.

“ఎప్పుడో సినిమావాళ్లు వచ్చారు అన్నాం కదా... వాళ్ళు ఇవాళ వచ్చి ఏకంగా షూటింగ్ మొదలు పెట్టుకున్నారు. బయటికి రా, అంతా అర్థమైతది!” అంటూనే ఆమె కిచెన్ లోకి పరుగు తీసింది.

ఇంతలో ‘షాట్ రెడీ... షాట్ రెడీ...’ అంటూ అరుపులు వినిపించాయి. గంతులు వేసుకుంటూ నటీనటులు లొకేషన్ వైపు పరుగులు తీశారు. తెరిచి ఉన్న తలుపు మూసేసి నారాయణ రంగుల టీమ్ లీడర్‌కు ఫోన్ చేశాడు. చేయగా చేయగా కాల్ ఎత్తిన ఆయన.. నారాయణ మాట మొదలుపెట్టకముందే “సార్...మేం పొద్దున్నే మీ ఇంటికి వచ్చినం... అక్కడున్నవాళ్ళు మమ్ముల్ని లోపలికి పోనీయలేదు. మాకు ఈ ఇంట్లో నెల రోజుల పని ఉంది. ఆ తర్వాతే మీ పని అన్నారు!” అన్నాడు.

బయట నుంచి ఎవరో తలుపు కొడుతున్నారు. నారాయణ తలుపు తెరవగానే వచ్చినాయన డోర్ స్టాపర్‌ను కాలుతో నొక్కి ‘కంటిన్యుటీ దెబ్బ తింటుంది. మూయకండి’ అంటూ హుకుం జారీ చేసి వెళ్ళిపోయాడు.

ఆయన వెనుకాలే వెళ్లి నారాయణ “రంగులవాళ్ళు వచ్చారట!” అని అడగబోతుంటే ‘కట్’ అన్న అరుపు వినిపించి ఆగిపోయాడు. ‘ఆయనెవరండీ బాబూ... ఫ్రేమ్‌లోకి వచ్చాడు’ అంటూ దర్శకుడు, ఛాయాగ్రాహకుడు అసిస్టెంట్ల వైపు చూస్తూ విసుక్కున్నారు.

“అయ్యా! మీరు బయటి రాకండి...” అంటూ నారాయణను తోసినట్లు ఇంట్లోకి పంపాడాయన. అప్పటికే సినిమావాళ్లలో కలిసిపోయిన సురేష్ లోపలికి వెళ్ళమన్నట్లు సైగ చేస్తున్నాడు. ఏమనలేక నారాయణ ఇంటి వెనుకాల కుర్చీ వేసుకొని కూలబడ్డాడు. అక్కడికే టిఫిన్ తెచ్చింది సులోచన.

కొంతసేపటికి సినిమా సందడి కాంపౌండ్ లోపల మొదలైంది. అక్కడక్కడా ఉన్న పూలకుండీలను వెనుక గోడవారగా పెడుతున్నారు. వారి వేగిరపాటుకు పాతకుండీలు పగిలిపోతున్నాయి. ‘బయట షూటింగ్ అని లోపలి రావడమేమిటి? కుండీలను చెడగొట్టడమేమిటి?’ అని విసుగుపడుతున్న నారాయణకు ఎన్నడూ రాని కోపం పొంగి వస్తోంది. “మీరు ఉండండి. అబ్బాయిని పిలుస్తాను” అంటూ ఆమె సురేష్ వైపు చేయి ఊపుతూ రమ్మంది.

దగ్గరికొచ్చిన కొడుకు “ఏమిటేమిటి?” త్వరగా చెప్పండన్నట్లు ఉరుకులాట మీదున్నాడు.

“బయటే షూటింగ్ అన్నారు. లోపల ఈ గొడవేమిట్రా?” అన్నారిద్దరు యుగళగీతంలా.

“ఒకటే షాట్ అంట. హీరోహీరోయిన్ల కిస్సింగ్ షాట్ గోడచాటుగానట. అందుకే లోపలి వచ్చారు” అని మాట్లాడుతూనే వెళ్ళిపోయాడు.

వాకిట్లో రైలు పట్టాల్లాంటివి వేశారు. దాని మీద కెమెరాను పెట్టి అటు ఇటు తిప్పుతున్నారు. హీరోహీరోయిన్లు తప్ప మిగితా వారంతా గోడకు ఆవలివైపే ఉన్నారు. ఆ తతంగమంతా చూస్తున్న దంపతులకు అంతా వింతగా ఉంది.

బయట దండెంపై ఆరేసిన దుప్పటిని షూట్ లో వాడుకుంటూ దుప్పటి పైనుండి కెమెరా పాన్ అయి గోడచాటుగా కూచున్న నాయకీనాయకుల సరస సల్లాపాలు చిత్రించాలని ప్లాన్ చేశారు. అనుకున్నట్లుగానే షాట్ ఓకే అయింది. వెంటనే దండెంపై దుప్పటిని మడతపెట్టి పక్కనే ఉన్న రేకుపెట్టెలో వేసుకున్నాడు ఓ అసిస్టెంటు. అది చూసి పరుగున వచ్చిన సులోచన "మా దుప్పటి కదా" అంది ఈయమన్నట్లు.

"కంటిన్యుటీ మేడం... అటువైపు నుండి తీసే షాట్‌కు బ్యాక్‌గ్రౌండ్‌లో దండెంపై ఇదే దుప్పటి కనబడాలి అన్నారు మా డైరెక్టర్‌గారు. షూటింగ్ అయిపోగానే ఇస్తాం.." అంటూ యూనిట్ వైపు పరుగుతీశాడాయన. లొకేషన్ రెంట్‌కు తీసుకున్న లెవల్లో షూటింగ్ సాగిపోతోంది. కొడుకు సినిమావాళ్లవైపే ఉండడంతో దంపతులిద్దరూ ఎదురుప్రశ్నలు మానేశారు. తమ ఇంట్లో సినిమా షూటింగ్ జరుగుతున్న సంగతి మిత్రులందరికీ చేరవేశారు సురేష్. సినిమా ఛాన్సు కోసం తంటాలు పడుతున్న వాళ్ళు ఆయన చుట్టూ తిరుగుతున్నారు. కొందరు యూనిట్ సభ్యులకు టిఫిన్లను, స్వీట్లను తెచ్చిస్తున్నారు. స్తోమత ఉన్నవాళ్లు వాహనాలను ఎరేంజ్ చేస్తున్నారు. ప్రసన్నం చేసుకున్న వాళ్లలో ఒకరిద్దరు ఆటో డ్రైవరుగానో, డెలివరీ బాయ్ గానో కెమెరా ముందుకొస్తున్నారు.

పెళ్ళికి ఇంకా పదిహేను రోజులే ఉంది. నారాయణ, సులోచనలు బయటికి వెళ్లి అవసరమైన పనులు చూసుకుంటున్నారు. రంగులు వేయడం ఇప్పుడైనా మొదలుపెట్టాలని వారు సురేష్‌తో ఖచ్చితంగా చెప్పారు. వారి బాధ చూడలేక సరేనన్నాడు డైరెక్టర్. మర్నాడు కలర్స్ వేయడానికి వచ్చిన వారిలో ఇద్దరిని లోపలి అనుమతించి డైరెక్టర్ స్వయంగా ఇల్లంతా వారి చూపించి, ఎక్కడ ఏయే రంగు వేయాలో వివరిస్తున్నాడు. వారి వెనుకాలే నారాయణ ఇదేం గతిరా నాయన అనుకుంటూ తిరిగాడు. రంగులు ఫైనల్ చేసి డైరెక్టరు షూటింగ్ వైపు వెళ్ళగానే రంగులపెద్ద, నారాయణతో "ఆయన చెప్పినట్లు కలర్స్ వేస్తే ఖర్చు మరో ఇరవై వేలు పెరుగుతుంది!" అన్నాడు.

తన బాధ ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కాక పెళ్ళికి అందితే చాలు అనుకోని "సరే. కానీయండి" అని చేయి ఊపుతూ కుర్చీలో కూలబడ్డాడు. రంగులు వేయడం పూర్తయ్యాక చూస్తే హాల్ కోర్టు రూము లాగా, ఒక బెడ్‌రూము హాస్పిటల్ వార్డ్ లాగా, మరోటి పోలీస్ స్టేషన్ లాకప్ గదిలాగా తయారయ్యాయి.

ఇంకా పది రోజుల్లో పెళ్లి. షూటింగ్ ఇంట్లోకి వచ్చింది. మూడు రోజుల్లో సినిమావాళ్లు తమ పని ముగించుకొని వెళ్లిపోయారు. మార్పు చేర్పులకు సమయం లేనందువల్ల ఉన్న రీతిలోనే పెళ్లి కానిచ్చారు. పెళ్ళికి తప్పక వస్తామన్న సినిమావాళ్లు మళ్ళీ కనబడలేదు. సురేష్ చేసే ఫోన్ కాల్స్‌కు కూడా జవాబు లేదు. "ఈ సినిమావాళ్ళే ఇంత!" అని చాల రోజుల తర్వాత మరోసారి అంది సులోచన.

ప్రేమ వారధి సినిమా రిలీజయింది. వెండి తెరపై తమ రూపాన్ని చూసుకునేందుకు ఫస్ట్ డే మార్నింగ్ షోకే సురేష్, అతని మిత్రబృందం వెళ్లారు. ఎక్కడో లాంగ్‌షాట్ లో "అదిగో నేను. ఇదిగో నీవు" అని అరిచే లోపే బొమ్మ మారిపోతోంది. మరో వ్యక్తి గుర్తుపట్టే స్థాయిలో ఎవరూ కనబడలేదు. విచిత్రంగా నారాయణ, సులోచనలు మిడ్‌షాట్ లో తెరపైకి వచ్చారు. హీరోహీరోయిన్ల ముద్దుల సీనును విచిత్రంగా చూస్తున్న వాళ్ళ ఎక్స్‌ప్రెషన్స్‌కి హాలంతా నవ్వుల్తో నిండిపోయింది. అటువైపు నుండి డైరెక్టర్ తెలివిగా తీసిన ట్రాలీషాట్ లో వీరిని కవర్ చేసిన సంగతి బయట పెట్టలేదు.

నాలుగు నెలలయ్యాక నారాయణకు ప్రొడ్యూసర్ నుండి ఫోన్ కాల్ వచ్చింది. ఎత్తగానే "బాగున్నారా సార్! మా బొమ్మ

బాగా ఆడుతోంది. మంచి లాభాలొచ్చాయి.ఇప్పుడు దానికి సీక్వెల్ కూడా తీద్దామనుకుంటున్నాం. మీ గోడ మళ్ళీ మాక్కావాలి. ఈసారి రెంట్ పే చేస్తాం. మీ పిల్లలకు మంచి రోల్స్ ఇస్తాం!" అని అటు వైపు నుండి వినిపించింది. వెంటనే నారాయణ, "మా గోడా వద్దు. మీ పీడా వద్దు" అనేశాడు.

"సార్! అంత మాట అనకండి. సిన్సియర్‌గా చెబుతున్నా. సినిమావాళ్లెవరూ ప్రీప్లాన్డ్‌గా ఎవరిని ఇబ్బంది పెట్టరు. సినిమా తీయడమంటేనే ఆక్సిడెంట్ అయినవారిని హాస్పిటల్లో చేర్పించినంత హడావుడి. గాయపడ్డవారిని ఒకరు కారులో వేసుకొని వెళ్తారు. ఒకరిద్దరు పని వదిలేసి తోడు వెళ్తారు. ఓ అమ్మ చీర కొంగు చించి గాయాలకు కట్టుకడుతుంది. గాయపడ్డవారు వీరిని ఇలా ఇబ్బంది పెట్టాలని ముందే అనుకుంటారా! సాయపడ్డవాళ్లు ఫలితాన్ని చూస్తారు గాని కష్టాన్ని లెక్కచేస్తారా... ఇదీ అంతే అనుకోండి!'

"మీ కథలకేం గాని, మా వల్ల కాదు నాయనా!' అంటూ నారాయణ కాల్ కట్ చేశాడు. మళ్ళీ రింగ్ అయినా ఎత్తలేదు.

రోజులు గడుస్తున్న కొద్దీ చెప్పాపెట్టకుండా వాళ్ళు ఏ క్షణమైనా మళ్ళీ మీద పడుతారేమోననే బెంగ నారాయణకు పెరుగుతోంది! అప్పుడప్పుడు వాళ్ళు వచ్చేసినట్లు కలలు కూడా వస్తున్నాయి.

సినిమావాళ్ళా... తమాషానా!

కోయిలాడ రామ్మోహన రావు
9849345060

*ఏడాది లోపలే, పరిస్థితులన్నీ చక్కబడ్డాయి. అదే అభిమానం, ప్రేమతో ఉన్న శ్రీకర్, ఆకాంక్షను పెళ్లి చేసుకున్నాడు. ఆకాంక్ష, చరిత్రను తిరగరాసింది. శ్రీకర్‌కి ఆమె ఇప్పుడు మొదటి భార్య. సావిత్రిలాగో, మీనా కుమారిలాగో తాగుడికి బానిస అయిపోయి, రెండో భార్యగా ఉండిపోయి, తన జీవితాన్ని నాశనం చేసుకోలేదు.*

"ఏమండీ... గండం గడిచినట్లేనా? 'ఆకాంక్ష' బతుకుతుంది కదా?" అని ప్రశ్నిస్తున్నది నా భార్య వీణ దిగులుగా.

"ప్రమాదం తప్పిందనే అంటున్నారు డాక్టర్లు" అన్నాను ఆశాభావంతో. నా బుర్రంతా వేడెక్కిపోయి ఉంది. 'ఈ పిచ్చి పిల్ల ఎందుకిలాంటి పనిచేసింది?' అని ఎన్నిసార్లు అనుకున్నానో నాకే తెలియదు.


'ఎమ్మారెన్' గా యావద్భారత దేశం గుర్తెరిగిన సినీ దర్శకుడిని నేను. తెలుగు చిత్రరంగాన్ని శాసించే స్థాయిలో ఉన్నాను, నేనిప్పుడు. ఎనిమిదేళ్ల క్రితం, కాస్త పేరున్న దర్శకుడిని మాత్రమే. అప్పట్లో నా సినిమా కథలు నేనే రాసుకునేవాడిని. అయితే ఆ కథలు పరిపక్వత చెందేది, నా ఆప్తమిత్రుడు, 'మురళి'తో చర్చించిన తర్వాతే. వాడిచ్చిన సలహాలతోనే, కథలు ఉత్తమంగా రూపు దిద్దుకొనేవి. కథ రాయడం పూర్తి అయ్యాక, వాడికి వినిపించేవాడిని. కథను, అందులోని మెలోడ్రామాను కళ్ళకు కట్టినట్లు చెప్పడం నా ప్రత్యేకత. నేనెప్పుడు కథ చెపుతున్నా, తప్పనిసరిగా హాజరయ్యేది... వాళ్లింట్లో పనిచేసే పద్నాలుగేళ్ల 'సుబ్బులు' నేను వస్తున్నానని తెలిసిన వెంటనే, చక చకా అన్ని పనులూ పూర్తి చేసేసి, నా దగ్గర నేల మీద కూర్చుని, కథ వినడానికి రెడీ అయిపోయేది. ఆ పిల్ల, కథ వింటూ కళ్ళార్పుతూ ఉంటే, 'మహానటి సావిత్రి' గుర్తుకువచ్చేది. కలువల్లాటి అందమయిన కళ్ళను అటూ ఇటూ తిప్పుతుంటే, 'డ్రీమ్‌గర్ల్ హేమమాలిని' గుర్తొచ్చేది. నవ్వినపుడుగానీ, హావభావాలు ప్రదర్శించేటప్పుడు గానీ, ఎంతో మంది నటీమణులను గుర్తుచేస్తున్నపుడే నేనొక అంచనాకి వచ్చేసాను, ఆమెకు నటిగా ఎంతో భవిష్యత్తు ఉందని!

ఆ రోజుల్లో సినిమా కోసం ఒక కథను రాసాను. ఆ కథలో ఒక ముఖ్యపాత్రకు సుబ్బులు చక్కగా సరిపోతుందని నేను, మురళి అనుకున్నాం! కథానాయిక పాత్రకు ప్రముఖ హీరోయిన్ 'స్వాతిశ్రీ'ని కలిసి, ఆమెకు కథ వినిపించాను. ఆమెకు కథ నచ్చింది గానీ, కాల్‌షీట్లు కోసం ఏడాదిన్నర పాటూ వేచి ఉండాల్సి వచ్చింది. సుబ్బులుకి సరయిన శిక్షణ ఇవ్వడానికి నాకు ఆ సమయం బాగా కలిసివచ్చింది.

ఆమె పేరు ఆకాంక్షగా మార్చేసి, శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాను. ఎంతో శ్రద్ధతో చెప్పినవన్నీ నేర్చుకునేది. ఆమెతో తీసిన సినిమా సూపర్ హిట్ అయింది. క్లైమాక్స్‌లో, ఆమె ప్రదర్శించిన పది నిమిషాల నటనకు స్వాతిశ్రీతో సహా అందరూ ఫిదా అయిపోయారు. ఆకాంక్ష ఒక్కసారిగా సినీ ఆకాశంలో ధ్రువతారగా మెరిసిపోయింది. అప్పటి నుంచీ ఆమెకు ఎన్నో అవకాశాలు బారులు తీరాయి. తను నాకు పరిచయం అయిన రోజుల్లో మురళిని అయ్యగారు అని పిలుస్తున్నా, నన్ను మాత్రం ఎందుకో 'నాన్నగారూ' అని పిలిచేది. ఇప్పటికీ అదే సంబోధన. తను ఎంత ఎత్తు ఎదిగినా, ఇప్పటికీ నా సలహా

లేకుండా ఏమీ చెయ్యదు, ఒక్క విషయంలో తప్ప. ఆ ఒక్క విషయమే తన జీవితాన్ని అతలాకుతలం చేస్తుందని, ఆమె గానీ నేను గానీ ఊహించలేదు అప్పుడు!

ఒకరోజు, "నాన్నగారూ... మీకో విషయం చెప్పాలి" అన్నపుడు, తను చెప్పే విషయం నన్ను బాగా డిస్టర్బ్ చేస్తుందని నేను ఊహించలేదు. కాజువల్‌గా తలూపాను, ఏమిటన్నట్లు చూస్తూ!



కాస్సేపు సందేహించి, "కొత్త హీరో భార్గవతో ప్రేమలో పడ్డాను,అతన్నే పెళ్లిచేసుకోవాలనిఅనుకుంటున్నాను!" అన్నది నెమ్మదిగా.

అతనితో క్లోజ్‌గా ఉంటుందని తెలుసుగానీ, ఇంత తొందరగా నిర్ణయం తీసేసుకుంటుందని ఊహించని నేను షాక్ తిన్నాను. భార్గవ అంటే నాకు సదభిప్రాయం లేదు. నా దృష్టిలో ఆమెనే కోరుకుంటున్న ప్రసిద్ధ నటుడు శ్రీకర్, ప్రఖ్యాత క్రికెటర్ మహేంద్ర ఉన్నారు. వాళ్ళిద్దరిలో ఎవరిని చేసుకున్నా, ఆమె భవిష్యత్తు బాగుంటుందని నేను అభిప్రాయపడినా, ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. నన్ను ఒప్పించడానికి శతవిధాల ప్రయత్నించినా, నేను కూడా దిగిరాలేదు.

వారి వివాహం అయిన తర్వాత మా ఇద్దరి మధ్య దూరం పెరిగింది!

ఆమె వివాహం అయిన చాన్నాళ్ళ తర్వాత, మురళి ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నాను.

"ఆకాంక్ష తేలిగ్గా ఆ భార్గవ గాడి 'వల'లో పడిపోయింది. పెళ్ళికి ముందే వాడు చాలా షరతులు పెట్టాడట! ఆ షరతుల ప్రకారం, ఆకాంక్ష షూటింగ్ నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం ఆరు గంటల లోపల ఇంటికి వచ్చేయాలి. కార్‌వాన్ లోకి మేకప్‌మేన్, సెక్రటరీ, పర్సనల్ అసిస్టెంట్ తప్ప వేరే వాళ్ళెవరూ రాకూడదు. తన అనుమతితోనే అవుట్‌డోర్ షూటింగ్‌లకు వెళ్ళాలి. ఇలాంటి షరతులు మరి కొన్ని ఉన్నాయి. అయితే, అప్పటికే అతనితో పిచ్చి ప్రేమలో పడిపోయిన ఆకాంక్షకు అవేమీ అడ్డంకి అనిపించలేదు.

ఇన్ని షరతులు పెట్టినా తృప్తి పడని భార్గవ్, అతనికి బాబాయ్ వరస అయిన రాఘవయ్యను ఆమెకు సెక్రెటరీగా పెట్టి, ఆమె మీద ఒక కన్నేసి ఉంచేలా జాగ్రత్త పడ్డాడు. తన మీద విపరీతమైన ప్రేమ ఉండడం వల్లనే భార్గవ అలా చేస్తున్నాడని సరిపెట్టుకుందామె. అలా కొన్నేళ్ళు ఇద్దరూ సఖ్యంగానే కాపురం చేసారు. ఆ తర్వాత తెలిసింది, భార్గవకు ముందే పెళ్లి

అయిపోయిన విషయం! అవుట్ డోర్ షూటింగ్‌ల వంకతో, స్వంత ఊర్లో ఉన్న ఫేమిలీతో గడిపి వస్తున్నాడన్న విషయం తెలుసుకుని షాక్ అయింది. ఆ విషయమై వాళ్ళిద్దరూ గొడవలు పడినా, ఆమె మనసు గాయమయినా, సంసారం విషయంలో ఆమె రాజీ పడక తప్పలేదు... " అని మురళి చెపుతుంటే నా మనసు వికలమయిపోయింది.

'ఏమిటి మన హీరోయిన్ల ఖర్మ? ఏ రంగంలోనూ తప్పడం లేదు. ఇక్కడ ఆకాంక్ష, సావిత్రి, అక్కడ హిందీలో మీనాకుమారి, శ్రీదేవి, హేమమాలిని. రెండో భార్యగా ఉండాల్సిన ఖర్మ ఏమిటి, వీళ్ళందరికీ?' అనుకున్నాను బాధగా.

★★★

నన్ను డిస్టర్బ్ చేస్తూ అడిగింది నా భార్య వీణ. "ఇందాకట్నుంచి అడగడానికి భయపడుతున్నాను, మీ మోహం చూసి. ఆకాంక్ష ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంది?" అని. దీర్ఘంగా నిట్టూర్చి, చెప్పడం మొదలుపెట్టాను.

"నీకు తెలుసుగా హీరో శ్రీకర్‌కి ఆకాంక్ష అంటే చాలా ఇష్టం. అతను ఏదో పర్సనల్ విషయం మాట్లాడడానికి, ఆమె కారవాన్‌కి వచ్చాడట. అతను వెళ్ళిపోయాక, రాఘవయ్యకి, ఆకాంక్షకి ఆవిషయంలో పెద్ద గొడవే జరిగిందట. రాఘవయ్యకి బిపి పెరిగిపోవడంతో తొందరపడి, ఆమె చెంప పగల గొట్టాడట" అని చెపుతుండగా, బుగ్గ మీద చేయి వేసుకొని, విస్తుపోతూ,

"అయ్యో! ఆ వెధవకి ఎంత ధైర్యం? ఆఫ్ట్రాల్ వాడి స్థాయి ఎంత? మరి తను ఊరుకుందా? ఏమీ చేయలేదా?" అని అడిగింది.

"వెంటనే క్షమాపణ చెప్పాడట, 'తొందర పడ్డాను, తప్పయిపోయింది' అని. కానీ తను ఊరుకోలేదు. జరిగిన విషయం భార్గవకి చెప్పి, వెంటనే రమ్మన్నదట. వాడు మాత్రం రావడం కుదరదని, 'క్షమాపణ చెప్పాడుగా? తర్వాత చూద్దాంలే' అని తేలిగ్గా తీసుకున్నాడట..." అంటుండగా, వీణ అడ్డు తగిలి, "అంత మాట అన్నాడా? పైకి ఎంత మంచివాడిలా కనిపిస్తాడు! ఎంత బాగా మాట్లాడతాడు? బయట చాలా మంచి పేరే ఉందే!" అంది ఆశ్చర్యపోతూ.

"నిజమే. చాలామంది అలాగే కనిపిస్తారు! వాడు ఆకాంక్షను చాలా హింసలు పెడుతున్నాడని, ఇండస్ట్రీలో టాక్ ఉంది. ఈ మధ్య హీరోయిన్ 'జాబిల్లి' ఒక విషయం చెప్పింది. ఏదో అవుట్ డోర్ షూటింగ్‌కి వెళ్ళినపుడు ఆకాంక్షకి, ఆమెకు పక్క పక్క రూమ్‌లు ఇచ్చారట. భార్గవ రాత్రెప్పుడో ఆకాంక్ష రూమ్‌కి వచ్చి, గొడవ చేయడం మొదలుపెట్టాడట. చాలా ఘోరంగా మాట్లాడడం, కొట్టడం, ఆకాంక్ష ఏడవడం వినబడిందని జాబిల్లి చెప్పింది. మర్నాడు ఉదయమే భార్గవ వెళ్లిపోయినట్లు తెలిసిందని, ఆకాంక్ష కళ్ళు ఉబ్బిపోయి, ఎర్రగా అయిపోయాయని, చెపుతుంటే నాకు రక్తం సల సలా మరిగింది. కానీ ఏం చేయగలను?"

"ఆకాంక్ష ఎంత మాత్రమూ పిరికిది కాదు. కానీ పరిస్థితులు అలా వచ్చాయి. భార్గవ తెలివిగా ఆమె సంపాదనను కూడా వాడేసుకున్నాడని, కొత్తగా కొన్న ఆస్తులు వాడి పేరనే ఉన్నాయని తెలిసింది. వాడు చేసిన అన్యాయాలు, వాడు పెట్టే హింస భరించలేక ఆకాంక్ష చనిపోవాలన్న తొందరపాటు నిర్ణయం తీసుకుంది!" అంటున్న నా గొంతు బాధతో పూడుకుపోయింది.

★★★

ఆకాంక్షకి తెలివి వచ్చిందని, మమ్మల్ని మాత్రమే చూడాలనుకుంటుందని కబురు వచ్చింది. ఆమెకు నా మీద ఇంకా ప్రేమాభిమానాలు ఉన్నందుకు ఎంతో ఆనందం కలిగింది. ఆమె చేయి పట్టుకొని, ఆప్యాయంగా నిమురుతూ అడిగాను,

"ఎందుకమ్మా ఇలాంటి పనిచేసావు? నీ ధైర్యం, తెగువ, తెలివితేటలు తెర మీదేనా? నీ పాత్రల ద్వారా ఎంతమందికి ధైర్యం నూరిపోసావో, ఎంతమందికి సరైన మార్గం చూపించావో, ఎంతమందికి స్ఫూర్తినిచ్చావో మర్చిపోయావా?" అంటూ సున్నితంగా మందలించాను.

"నిజమే... కానీ ఆ క్షణికావేశంలో అవేమీ గుర్తుకు రాలేదు నాన్నగారూ!" అంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్న ఆకాంక్షను చూస్తే, నా హృదయం బాధతో మూలిగింది. ఈ పరిస్థితికి కారణమైన భార్గవ మీద కోపం తన్నుకు వచ్చింది.

"వాడికి విడాకులు ఇచ్చేయ్. వాడి అంతు చూస్తాను. ఇప్పుడే పోలీస్ కమీషనర్‌తో మాట్లాడతాను. మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను. వాడు కటకటాల వెనక్కి వెళ్ళడం ఖాయం. వాడి ఛాప్టర్ క్లోజ్" ఆవేశంగా పళ్ళు నూరాను.

"మీ సత్తా నాకు తెలుసు నాన్నగారూ. కానీ అంత దూరం వెళ్లొద్దు. అతనికీ ఒక కుటుంబం ఉంది. ఆ పాపం మనకెందుకు?" అంది ఆకాంక్ష లేని ఓపిక తెచ్చుకుంటూ.

"అయితే వాడిని అలాగే వదిలేయమంటావా? వాడితోనే కాపురం చేస్తావా?" ప్రశ్నించాను కోపంగా.

నా కోపాన్ని చూసి నీరసంగా నవ్వింది.

"ఆ ప్రసక్తే లేదు. విడాకులు తీసుకుంటాను!" నెమ్మదిగా అంది.

ఆ మాటతో నేను శాంతించాను. అయినా వాడి మీదున్న కోపం తగ్గలేదు.

"సరే. వాడిని తేలిగ్గా వదలొద్దు. వాడు చేసిన మోసాలకు వాడు నీ కాళ్ళ మీద పడి క్షమాపణ చెప్పాలి. నీకు చెందాల్సిన ఆస్తంతా నీ పేరున మార్పించాలి. పత్రికాముఖంగా తన నేరాలను ఒప్పుకోవాలి!" అని దృఢంగా పలికాను.

"కన్నతండ్రి కూడా మీలా రియాక్ట్ అవ్వడు నాన్నగారూ. వచ్చే జన్మలోనైనా మీ కూతురిగా పుట్టాలి నేను!" అంటూ కన్నీళ్లు పెడుతున్న ఆకాంక్షని అక్కున చేర్చుకొని,

"ఇప్పుడు మాత్రం నువ్వు నా కూతురివి కాదా? ఏమిటి?" అంటున్న నా కళ్ళు కూడా చెమ్మగిల్లాయి.

★★★

పోలీస్ కమీషనర్ సమక్షంలో భార్గవని దోషిగా నిలబెట్టాను. తనెప్పుడూ ఆమెను హింసించలేదని, పల్లెత్తు మాట అనలేదని, రాఘవయ్య తనకు బాబాయ్ వరసే గానీ, అతన్ని తను నియమించలేదని, ఏ షరతులూ పెట్టలేదని బుకాయించాడు. వాటన్నిటికీ నా దగ్గర ఆధారాలు ఉన్నాయని, ఆస్తి కాజేయడం, పెళ్లి అయిన నిజాన్ని దాచి పెట్టడం శిక్షార్హమయిన నేరాలని, మర్యాదగా చెప్పినట్లు నడుచుకొమ్మని బెదిరించేసరికి దారికి వచ్చి, ఆకాంక్షకు క్షమాపణ చెప్పాడు. నేను పట్టు పట్టినట్లే ఆస్తి, ఆకాంక్ష పేరున బదిలీ అయింది. విడాకులు కూడా తొందరగానే మంజూరు అయ్యాయి.

ఏడాది లోపలే, పరిస్థితులన్నీ చక్కబడ్డాయి. అదే అభిమానం, ప్రేమతో ఉన్న శ్రీకర్, ఆకాంక్షను పెళ్లి చేసుకున్నాడు. ఆకాంక్ష, చరిత్రను తిరగరాసింది. శ్రీకర్‌కి ఆమె ఇప్పుడు మొదటి భార్య. సావిత్రిలాగో, మీనా కుమారిలాగో తాగుడుకి బానిస అయిపోయి, రెండో భార్యగా ఉండిపోయి, తన జీవితాన్ని నాశనం చేసుకోలేదు.

ఇక భార్గవకు వచ్చిన చెడ్డ పేరో, నా పరపతో, లేక శ్రీకర్ పరపతో, ఆకాంక్షపై అభిమానమో... కారణం బహిర్గతం కాలేదు గానీ, సినీరంగంలో భార్గవ కెరీర్ దాదాపుగా అంతం అయిపోయింది.

★★★

కొన్నేళ్ళ తర్వాత ఒక పెళ్ళి కోసం భువనేశ్వర్ వచ్చి, తిరిగి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్తున్నప్పుడు, ఆకాంక్ష నుంచి ఫోన్ వచ్చింది. సంభాషణ ముగించి, వీణతో చెప్పాను,

"పిచ్చి పిల్ల! ఆకాంక్ష, తన కొడుక్కి నా పేరే పెట్టిందట!" అని.

"అబ్బో! గొప్ప సంతోషంగా ఉందే దొరగారికి. 'రామ్ నారాయణ్' అనే పెట్టిందా? లేక కాస్త మార్చిందా?" అని అడిగింది.

"లేదు. అదే పేరు!" అన్నాను గర్వంగా.

"ఎందుకు పెట్టదు సార్? మీరు ఆమె 'వల'లో చిక్కుకొని, ఆమెకు అనుకూలంగా అంతా చేసి పెట్టారుగా? ఆ మాత్రం కృతజ్ఞత ఉంటుందిలెండి!" అని వెటకారంగా అంటున్న 'ఊబర్' డ్రైవర్ గొంతు ఎక్కడో విన్నట్లు అనిపించి,

"ఏయ్... ఎవరు నువ్వు? ముందు కారు ఆపు!" అరిచాను కోపంగా. అతను కారు ఆపి వెనక్కి తిరిగాడు. అతన్ని చూడగానే, నేను వీణ గతుక్కుమన్నాం. అతను ఒకప్పటి హీరో భార్గవ. మేము ఏమీ అడగకుండానే అతను చెప్పడం మొదలుపెట్టాడు.

"నేను చెప్పబోయే విషయాలు మీకు తెలియవనే అనుకుంటున్నాను. పెళ్లి విషయం దాచి పెట్టడం, ఆస్తులు నా పేరున రిజిస్టర్ చేయించుకోవడం మాత్రమే నేను చేసిన తప్పులు. మిగిలినవన్నీ ఆకాంక్ష ఆడిన నాటకంలో భాగాలే. ఒక సినీనటికి అవన్నీ అమలు చేయడం పెద్ద కష్టమైన పని కాదు. అవుట్ డోర్ షూటింగ్‌లు జరిగేటప్పుడు కూడా, తెలివిగా నాటకం ఆడి, నేను తనని హింసిస్తున్నట్లు తోటి ఆర్టిస్టులను నమ్మించేది. ఇక మా బాబాయి విషయానికొస్తే, అదీ పెద్ద విషయం ఏమీ కాదు. డబ్బుతో అతన్ని కొనేసి, కావలసినట్లు నాటకం ఆడించింది. ఆత్మహత్య డ్రామా ఆమెకు బాగా బలాన్ని ఇచ్చింది. కమీషనర్ ముందు, నేను నిర్దోషిని అని నిరూపించుకోవడానికి అవకాశమే లేకుండా చేసింది. పైగా కొండంత అండగా మీరు ఉన్నారు. ఎప్పుడయితే నేను ఆమెను మోసం చేసానని తెలుసుకుందో, అప్పుడే ఒక పథకం వేసుకొని, నన్ను వదిలించుకుంది!" అంటూ ముగించాడు.

గట్టి షాకే తిన్న మాకు, తేరుకోవడానికి చాలా సమయం పట్టింది!!

# జవాబు రాని ప్రశ్న

## వల్లూరి విజయకుమార్
8885511950

***అవదానికేముందీ, మొండివాడి వంశం అంతరించి పోయింది.***
***అయ్యో!***
***అయ్యో, ఏమిటి, దానివల్ల లోకం యేవన్నా గొడ్డుపోయిందా? సాగిపోవట్లేదూ యెప్పట్లా.***
***ఎందుకలా?***
***ఎందుకేవిటి, దేవుడు మహా మొండివాడు. తను తల్చుకున్నదేదో చేసి తీరతాడు. పెద్ద పెద్ద జ్ఞానులకే దిక్కు లేదు.. అడగటానికి మీరెవరు... నేనెవరు...***

పసిగుడ్డు కెవ్వుమంటూ భూమ్మీద పడింది. అంతకాలం యెవరికీ కనపడకుండా చీకట్లో ప్రశాంతంగా గడిపేసిన పసిగుడ్డు... యిలా మరో లోకానికి వచ్చేసరికి, కళ్లుమూసుకుంది భయంతో గట్టిగా.

తెరుచుకున్న కళ్ళముందు కనిపిస్తే ఏవో రెండు ముఖాలు దగ్గరగా... సరిగ్గా అప్పుడే ప్రారంభమయింది పసిగుడ్డు మనసులో తొలి ప్రశ్నగా... 'ఎవరు వీళ్ళు, నా చుట్టూ?'

"మేమే... నీ... అమ్మా, నాన్నా... మా బుజ్జి నాన్నా..."

"అమ్మంటే?"

"నిన్ను కన్నతల్లిని"

"ఎందుకు కన్నావు నన్ను? కనమని నిన్నడిగానా నేను?"

"దేవుడిచ్చాడు మాకు నిన్ను. నువ్వు మా నోముల ఫలం!"

అప్పుడే మరో ప్రశ్న ఉదయించింది... "దేవుడా? ఎవరతను? ఎలా ఉంటాడు? నన్నడక్కుండా, నీకెందుకు ఇచ్చేసాడు నన్ను?'

ఈ ప్రశ్నకి కొందరు 'ఈశ్వరా' అన్నారు, 'ప్రభువా' అన్నారింకొందరు, 'అల్లా ఇచ్చాడు నిన్నని' మరికొందరు! పొంతనలేని జవాబులతో పసిగుడ్డు తెల్లబోయింది.

ఎవరిని నమ్మాలో తెలీలేదు పసిగుడ్డుకి.

కడుపులో ఏదో బాధ! గుక్కపట్టి ఏడుపు. పసిగుడ్డు ఏడుస్తుంటే అందరికీ ఎంత సంతోషమో... 'హమ్మయ్య!' అని ఊపిరి పీల్చుకున్నారు.

చిన్న పెదవులకి... ఏదో తగిలితే వెచ్చగా... తన ప్రమేయం లేకుండానే కడుపు నిండింది.

నారు పోసినవాడు, పాల నీరు పోసాడు...

ఎదుగుతూ ఉంటే మరో ప్రశ్న. 'వీళ్ళందరూ ఎవరు?'

"ఆ ముగ్గురూ నీ అక్కలు, పెద్దమీసాలవాడు నీ తాత. నీకు బొంబ్బ పోసిందే... అదే అమ్మమ్మ... దూరం నించి చిటికెలు వేస్తున్నాడు చూడూ... వాడు నీ నాన్న"

'ఇంతమందుండగా మళ్ళీ నేనేందుకూ' అదే ప్రశ్న మళ్ళీ.

"దేవుడిచ్చాడు" అదే సమాధానం.

అంటే అమ్మఆశపోతన్నమాట.

ఎందరున్నా దేవుడిని యింకా యింకా అడుగుతున్నది.

★★★

పసిగుడ్డు పెద్దవాడయాడు. పక్కింటి కోకిలమ్మ యింట్లో ఎవరూ లేరని కనిపెట్టాడు మనవాడు.

అంటే అమ్మ లేదు నాన్నా లేదు. ఒక ఆడ, ఒక మగా, అంతే!

'ఎందుకిలా?' మరోప్రశ్న

"వాళ్ళకి దేవుడియ్యలేదు"

'ఏం, అడగలేదా వాళ్ళు?'

"అడిగే ఉంటారు. పాపం, వాళ్ళకి యీ జన్మలో యింతే ప్రాప్తం!"

'ప్రాప్తం అంటే?'



ఇలా సమాధానం దొరకని ప్రశ్నలు వేసుకుంటూనే ఎదుగుతున్నాడు మొండివాడు.

★★★

ఒకరోజు వాడ్ని బడికి వెళ్లమన్నారు.

'ఎందుకు?'

"చదువుకోవాలి బుద్ధిగా"

'చదువుకుంటే?'

"నాన్నలా మంచి ఉద్యోగం వస్తుంది. పెద్దయ్యాక హాయిగా వుండొచ్చు"

'నాన్న యిప్పుడు ఉద్యోగం చేస్తున్నాడుగా, నేనూ ఎందుకు చెయ్యాలి? మంచి ఉద్యోగం అంటే?'

"అంటే, అంటే బోల్డు డబ్బు, పెద్ద ఇల్లు, మంచి బట్టలూ"

'మరిప్పుడివన్నీ లేవా? అవన్నీ ఏంచేసుకుంటాం?'

"ఏ ముహూర్తానికి కన్నావో కదా యీ మొండివాడ్ని?"

అమ్మకి ఇప్పుడిది అర్థం కాని ప్రశ్న.

అమ్మ మళ్ళీ గట్టిగా 'దేవుడా' అని తలపట్టుకుంది.

మొండివాడు ఆశగా ఇటూ అటూ చూసాడు... కనిపిస్తాడేమో దేవుడని! కనపళ్లేదు!

వాడికి నువ్వే మంచి బుద్ధి యివ్వాలి తండ్రీ.

మొండివాడు యిలా జవాబు రాని ప్రశ్నలు వేసుకుంటూనే పెరుగుతున్నాడు.

★★★

ఎందుకో తెలీదు. డిగ్రీ పాసయాడు, యెందుకో తెలీదు ఉద్యోగం చేస్తున్నాడు, ఎందుకో తెలీదు... డబ్బు సంపాదిస్తున్నాడు.

"నువ్వు పెళ్లి చేసుకోవాలి" అన్నారు అప్పుడు ఇంట్లో వాళ్లు.

'ఎందుకు?'

"ఎందుకేమిటి, చక్కగా పిల్లల్ని కనాలి. మనవంశం నీతో ఆగిపోకూడదు."

మొండివాడికి చిన్నప్పటి కోకిలమ్మ గుర్తొచ్చింది.

'వాళ్ళలాగా పిల్లలు పుట్టకపోతే అప్పుడేం చెయ్యాలి?' ప్రశ్న.

"అలా అనకూడదు, పుడతారు"

'వంశం నాతోనే ఆగిపోతే ఏమవుతుంది?'

"వెధవ ప్రశ్నలు వెయ్యకు"

మొండివాడికి ఎందుకో తన బతుకు అర్థం కావట్లేదు.

ఈ వంశం తనతోనే ఆగిపోతే వచ్చిన నష్టం ఏమిటి? నావంశం వాళ్లు సమాజానికి ఇప్పటిదాకా ఏంచేసారు?

నేనూ, నా ఆస్తులు, నా పిల్లలూ తప్ప... ఇంతా చేస్తే 'నేనూ' ఉండను!

ఆలోచిస్తూ పడుకున్నాడు, మొండివాడు.

★★★

తెల్లవారింది.

అందరూ కంగారు పడుతున్నారు... అమ్మా... నాన్నా... ఎందుకో?

ఎందుకేమిటి, మొండివాడు కనపడటంలేదు మరి.

ఎక్కడికెళ్లాడు?

అదే తెలీదు.

ఎందుకు?

"భగవంతుడా, తెలీదయ్యా!"

★★★

సరే ఇంతకీ ఏమైంది ఆ తర్వాత?

అవడానికేముందీ, మొండివాడి వంశం అంతరించి పోయింది.

అయ్యో!

అయ్యో, ఏమిటి, దానివల్ల లోకం ఏవన్నా గొడ్డుపోయిందా? సాగిపోవట్లేదూ ఎప్పట్లా?

ఎందుకలా?

ఎందుకేవిటి, దేవుడు మహా మొండివాడు. తను తల్చుకున్నదేదో చేసి తీరతాడు.

పెద్ద పెద్ద జ్ఞానులకే దిక్కులేదు.. అడగటానికి మీరెవరు... నేనెవరు?

ఐతే...

ఇంతవరకే మరి మనకి తెలుసు. మనకి తెలీనిది, దేవుడికి మాత్రమే తెలిసిన సంగతి మరొకటుంది.

మొండివాడు కాశీలో, ఆ చుట్టుపక్కలా అనాథ ప్రేతాలకి, అంతిమ సంస్కారాలు జరుపుతూ... భగవంతుడికి దగ్గరై తన జన్మ సార్ధకం చేసుకుంటున్న సంగతి...

మీకూ నాకూ తెలీకపోవచ్చు, కానీ ఆ మూడోకంటి వాడికెందుకు తెలీదూ?

# నరుడి బ్రతుకు నటన!

**కొత్తపల్లి ఉదయబాబు**
9441860161

> ***వాళ్లు పూర్తిగా వెళ్ళిపోయారు అని నిర్ధారించుకున్నాకా నిత్యజీవితంలో అప్పటి వరకు గుండెనొప్పి వచ్చినట్టు నటించిన నేను దీర్ఘంగా శ్వాస తీసుకుని పడకకుర్చీలో సుఖంగా వెనక్కి వాలాను.***
> ***"నా నటనకు పిచ్చెక్కి ఇంటికి పంపేశారు. ఈ వయసులో మనకివి పడవోయ్!"అన్నాను నర్మగర్భితంగా నవ్వుతూ***

చదువుతున్న వార్తాపత్రిక టీపాయ్ మీద పడేసి బాత్‌రూమ్‌లో దూరాను. స్నానం చేస్తూ నేను చేయబోయే పాత్ర ఎలా ఉంటుందా అని ఊహించుకుంటూ, నాకున్న నాటకానుభవంతో గతంలో చేసిన పాత్రను గుర్తు తెచ్చుకుని నటిస్తూనే స్నానం పూర్తిచేసాను. అహల్య పెట్టిన టిఫిన్ తిని కోడైరెక్టర్‌కి ఫోన్ చేసాను.

''శుభోదయం సర్. డైరెక్ట్‌గా షూటింగ్ స్పాట్‌కి వచ్చేయండి సర్. మొత్తం కార్పొరేట్ కాలేజీలో షూటింగ్! మీరు... హీరోయిన్, హీరోగారు, స్నేహితులు... టీజింగ్... పిచ్చ కామెడీ సీన్లు... సినిమాకి హైలెట్ సర్... ఈ పాత్రతో మీరు సినీరంగంలో స్థిరపడిపోతారు. విషింగ్ యూ ఆల్ ది బెస్ట్ సర్." ఫోన్ కట్ అయింది. "బయట తిళ్ళు తిని ఆరోగ్యం పాడుచేసుకోకండి. బాక్స్‌లో పెరుగు అన్నము, నిమ్మకాయబద్ద పెట్టాను నంజుకోవడానికి. షూటింగ్ అయిన వెంటనే తిన్నగా బస్సెక్కి ఇంటికి రండి. ఏమిటో... రిటైర్ అయి మూడు నెలలన్నా కాలేదు... హాయిగా కృష్ణారామా అనుకునే వయసులో ఆ స్టూడెంట్ ఎవరో... సినిమా తీయడమేంటో, అందులో మిమ్మల్ని పిలిచి మరీ ఆ పాత్ర ఇవ్వడమేమిటో... మీరు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. అది మర్చిపోకండి. జాగ్రత్త! నేను చెప్పే విషయాలు బుర్రకెక్కుతున్నాయా?" అంది బాక్స్ చేతికి అందిస్తూ అహల్య.

"ఆ... సరే!" అన్నానే గానీ, నా దృష్టి అంతా ఈరోజు పొందబోయే అనుభవం మీదే ఉంది. అసంకల్పితంగా అహల్య ఇచ్చిన టిఫిన్‌బాక్స్ తీసుకుని బయల్దేరాను. బయల్దేరుతుంటే ఎడమ మోకాలు తనకు ఇష్టం లేనట్టు కలుక్కుమంది. 'నిన్ను భరించేవాడిని నేనే... నాతో పెట్టుకోకు' నా ఉత్సాహం దాన్ని హెచ్చరించింది. నేను షూటింగ్ జరుగుతున్న ప్రదేశానికి చేరుకోగానే సమీర్ నన్ను గౌరవంగా ఆహ్వానించాడు. యూనిట్‌లో ఉన్న అందరికీ పరిచయం చేసాడు. "నాకు చదువు చెప్పిన మాస్టారు" అని సమీర్ వాళ్ళకి పరిచయం చేశాడు. వాళ్ళందరూ 'అతివినయం ధూర్త లక్షణం'లా వంగి వంగి దండాలెట్టి, మళ్ళీ నేను చూసేసరికి నన్ను గమనించనట్టు సిగరెట్ కాల్చేవాళ్ళు, హీరోయిన్ మీద పచ్చి జోకులు వేసుకునేవాళ్ళు, జేబులోంచి చీప్ లిక్కర్ తాగేవాళ్ళు... కనిపించారు! నేను వాళ్లకి ఉపాధ్యాయుడిని కాదుకదా అనుకుని సరిపెట్టుకున్నాను.

"మీరు అలా కూర్చోండి మాస్టారూ. మీ పాత్ర వచ్చినప్పుడు పిలుస్తాను!" అన్నాడతను.

"ఈలోగా నా పాత్రకు సంబంధించిన సంభాషణలు ఇస్తే ఒకసారి చదివేసుకుంటాను కదా!" అన్నాను.

అతను తేలికగా నవ్వేసాడు. ''భలేవారు మాస్టారు. ఇపుడు రోజులు పూర్తిగా మారిపోయాయి. మీ షాట్‌కు అయిదు

నిముషాల ముందు డైలాగ్స్ ఉన్న కాగితం ఇస్తాం. ఒకసారి చదివేసుకుని చెప్పేయగలిగితే పర్లేదు. లేదా వెనకాల ప్రామిటింగ్ ఇచ్చేస్తారు. అవి వింటూ మీరు పాత్రలోకి వెళ్ళిపోయి సంభాషణలు చెప్పేయడమే. ఈరోజుల్లో స్టేజి నాటకాలకి, టెలీఫిల్మ్స్, సీరియల్స్‌కి అసలు సంబంధమే లేదు. మీరేం కంగారు పడవద్దు. నేను ఉంటానుగా మీ పక్కనే!" అనేసి ఎవరో పిలవగా అటు వెళ్ళిపోయాడు సమీర్.



తరువాత ఒక గంటకి కాబోలు హీరో, హీరోయిన్, వాళ్ళ స్నేహితులుగా నటించే కుర్రాళ్ళు వచ్చారు! ఆధునికంగా దుస్తులు వేసుకోవడం తప్ప మిగతా మన సహజ సాంప్రదాయ వాతావరణం నాకు అక్కడ పుటం వేసినా కనబడలేదు.

ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ప్రార్థన సమయానికి వెళ్లకపోతే నా నరాల్లోంచి ఏదో తప్పు చేసిన బాధ, వణుకు వచ్చేసేది. చిన్నప్పుడు బడికి వెళ్ళేటప్పుడు మారాం చేస్తే... అమ్మ అడిగింది "పెద్ద అయ్యాకా ఏమవుతావ్?" అని. అప్పటికి నాన్న చేసేది బడిపంతులు కాబట్టి "బడిపంతులవుతా!" అన్నాను. అమ్మ నవ్వి చిన్నమొట్టికాయ మొట్టి "అయితే మంచి బడిపంతుడివి అవ్వు. గంపెడు పిల్లల్ని మాత్రం కనకు. అమ్మాయి, అబ్బాయి అంతే సరేనా?" అంది. 'సరే' అని తలూపాను. నాన్నగారికి ఆరోజుల్లో వచ్చే బడిపంతులు జీతంలో ఇంట్లో ఆరుగురం బతికేవాళ్ళం! ఇంటికి పెద్ద కొడుకుని నేను అని తరువాత తెలిసింది. అమ్మ మా కడుపులు నింపడం కోసం రోజూ అతి చిన్న వయసులోనే ఒక పూటే తినే అలవాటు

చేసుకుందని... దాంతో ఆమెకు రక్తహీనత వచ్చి అస్తమాను దగ్గుతోందని... నాన్న రెండుమూడు సార్లు తిట్టడం విన్నాను. "సమయానికి తిండి తినకపోతే ఛస్తావ్. డాక్టర్ దగ్గరకి తీసుకెళ్తాను పద. మళ్ళీ రోగమొస్తే డబ్బుకు డబ్బు ఖర్చు!" అన్నారు. "నేను ఏ డాక్టర్ దగ్గరకూ రాను. ఛస్తే చస్తాను. బడిపంతులని తెలిసి నలుగురు పిల్లలు అవసరమా... మళ్ళీ చేస్తున్నది పదిమందికి నీతులు చెప్పే బడిపంతులు ఉద్యోగం! మనం ఏమిటి, మన స్థితి ఏమిటీ అని ఆలోచించుకోవద్దూ...'' అని అరిచింది అమ్మ. ఆ వారం తర్వాతే నాన్నగారు వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నారని నేను పెద్దయ్యాకా తెలిసింది. ఆమె దగ్గు బాధ చూడలేక చివరకు వూళ్ళో ఆర్.ఎం.పి. డాక్టర్‌ని ఇంటికి తీసుకు వచ్చారు. ఆయన ఆమెను పరిశీలించి టి.బి. ప్రారంభ స్థితిలో ఉందని మందులు వాడితే తగ్గిపోతుందని చెప్పాడు. అమ్మ మందులు వాడుతున్నా సరే మా పిల్లలందరి పనులూ తానే చేసేది. 'నేను సాయం చేస్తానమ్మా' అంటే 'మగపిల్లాడివి నువ్వు ఈ ఆడంగి పనులు చెయ్యకూడదు. నీ తర్వాత తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. ఒకవేళ నేను లేకపోతే అపుడు వాళ్ళ అందరి పనులు నువ్వే చెయ్యాలి అర్థమైందా... అలా చెయ్యాలంటే బడికి మొదటి గంట ముందే వెళ్ళాలి. అలాగే ఏరోజు పాఠాలు ఆరోజు చదువుకోవాలి. ఏ పనీ తరువాత చేద్దాంలే అనుకోకూడదు. ఋతువులు ఆరు.. చూడూ తమ బాధ్యత అన్నట్టు ఖచ్చితంగా సమయం ప్రకారం వస్తాయి. వర్షం రోజున లేటుగా లేచి సూర్యుడు రాలేదు అనుకుంటాం. కానీ పగటి వెలుగు ఎలా వస్తుందనుకున్నావు? ఆయన పని ఆయన సక్రమంగా చేయడం వలన. వసంత ఋతువు వస్తుందనగానే కోయిలలు కూయడం మొదలెడతాయి. చెట్లు తమ ధర్మం ప్రకారం పూలు పూస్తాయి. రేపు పూద్దాంలే అనుకోవుగా... ఈ ప్రపంచంలో సమస్త జీవరాశులూ తమ తమ ధర్మాలను సమయం ప్రకారం పాటిస్తాయి. చదువుకుని, విజ్ఞానం పెంచుకుంటున్న మనం ఆ పని చేయగలమా లేదా? చేయలేకపోతే ఈవేళ్టి నుంచే నువ్వు బడికి వెళ్ళొద్దు.'' అంది అమ్మ.

"లేదమ్మా. ఈవేళ్టి నుంచి నేను మొదటి గంటలోపే బడికి వెళ్తాను. ఈ అలవాటు ఎప్పుడూ మార్చుకోను. నీమీద ఒట్టు.'' అని అమ్మ తలమీద ఒట్టు వేసాను. అమ్మ నన్ను గాఢంగా గుండెలకు హత్తుకుని కన్నీళ్లు పెట్టుకుంది. ఎందుకో అర్థం కాలేదు. ఆరునెలలు తిరగకుండానే అమ్మ చనిపోయింది.

నాన్నగారు 'ఈవిడ మీ రెండో అమ్మ' అని ఒక ఆవిడని తీసుకువచ్చారు. ఆమెకు పిల్లలు పుట్టకపోవడం వల్ల కాబోలు మమ్మల్ని ప్రేమగా చూసేది. సొంతపిల్లల్లా సాకింది. తమ్ముడు, చెల్లెళ్ళు అయితే వాళ్ళకి అమ్మే గుర్తులేదు. నాకు మాత్రం అమ్మ, నేను చేస్తున్న ప్రతీపనిలోను గడియారంలో ముల్లుల్ని చూపుతూ కనిపించేది. ఆ శక్తే నేనూ ఉపాధ్యాయుడిని అయ్యేలా చేసింది. ఆ దృష్టే నన్ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా నిలబెట్టింది. నేను నేర్చుకున్న స్వీయ క్రమశిక్షణను పిల్లలందరూ పాటించేలా చూసుకుంటూ వచ్చాను. కానీ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందాకా నాకు పిల్లల్ని పట్టించుకునే అవకాశం లేకపోయింది. అయినా ప్రతీరోజు ఉదయం ప్రార్థనాసమయంలో నేను చెప్పే ప్రతీ అంశాన్నీ 'స్వీయ క్రమశిక్షణ'కు ముడి పెట్టి చెప్పడం మాత్రం మానుకోలేదు. ఉద్యోగ విరమణ ఆఖరి రోజున కూడా దాని ఆవశ్యకత చెప్పి మరీ ఆఖరి సంతకం చేసాను.

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ – "మాస్టారూ. రెడీగా ఉన్నారు కదా. హీరో హీరోయిన్ల షాట్స్ తీస్తున్నారు. అవి అయిపోయిన వెంటనే మీ షాట్స్ ఉంటాయి. అందాకా అలా వెళ్లి మిగతా ఫ్లోర్స్ చూసిరండి. అక్కడ కూడా షూటింగ్లు జరుగుతున్నాయి. సమీర్ మీతో చెప్పమన్నాడు!" అన్నాడు ఎవడో కుర్రాడు వచ్చి.

"అలాగే బాబూ. అవసరమైతే ఫోన్ చెయ్యమను. నేను ఎక్కడ ఉన్నా వచ్చేస్తాను!" అని అటువైపు నడిచాను నేను.

ఒక ఫ్లోర్ నిశ్శబ్దంగా ఉంది. అక్కడ అన్ని కత్తులు, కటార్లు, కిరీటాలు, విగ్గులు... జానపద సినిమాలు తీసే ఫ్లోర్ అనుకుంటా... బోసిగా దుమ్ము కొట్టుకుపోయి ఉంది. ఒక కుర్రాడెవడో ముఖం మీద ఎర్రటి తుండుగుడ్డ వేసుకు పడుకున్నాడు. ఇంకో ఫ్లోర్ లోకి వెళ్తే ఏదో కొత్త సినిమా కొత్త వాళ్ళతో తీస్తున్నట్టున్నారు. పాట షూటింగ్ అనుకుంటా... వెనకాల స్టెప్పులు వేసే మంద అంతా ఒకే రకమైన డ్రెస్‌లో సాధన చేస్తున్నారు. ఇంకా పిలుపు రాలేదు కదా అని ఫ్లోర్ లోంచి బయటకు వచ్చి, చుట్టూ పెద్ద చప్టా ఉన్న విశాలమైన మామిడి చెట్టు కింద కూర్చున్నాను. దూరంగా సమీర్ హీరో ఫ్రెండ్స్‌గా నటిస్తున్న కుర్రాళ్ళచేత రిహార్సల్స్ చేయిస్తున్నాడు. హీరో హీరోయిన్లు చేతిలో డైలాగ్ పేపర్స్ చదువుకుంటున్నారు. మరో మూడు నిముషాల్లో డైరెక్టర్ షాట్ రెడీ చెప్పడంతో అందరూ పొజిషన్ లోకి వచ్చారు. సమీర్‌ని దూరం నుంచి చూస్తూనే ఆలోచనలో పడ్డాను నేను.

సమీర్ నా దగ్గర చదివిన రోజుల్లో మున్సిపల్ బిల్ కలెక్టర్ కొడుకు. ఎనిమిదవ తరగతిలో నేను పనిచేస్తున్న పాఠశాలలో చేరాడు. చాలా అందగాడు. అతన్ని స్కూల్ హ్యాండ్సమ్ అని పిలిచేవారు. ఆరో తరగతి నుంచే అమ్మాయిలు అతని చూపు తనమీద పడితే చాలు అన్నట్టుగా అతని చుట్టూ గుంపులుగా ఉండేవారు. అయితే అది నేను మొదట్లోనే తీవ్రంగా ఖండించాను. తల్లిదండ్రులను పిలిచి విషయం చెప్పాను.

వాళ్ళు కొడుకునే సమర్థిస్తూ, "అలా అంటారేంటి సారూ! ఏదో చిన్నపిల్లలు... కుర్రవేషాలు ఈవయసులో కాకపోతే ఎపుడూ వేస్తారు చెప్పండి. మీరూ చూసీ చూడనట్టు ఊరుకోండి సర్. మీకిష్టం లేకపోతే చెప్పండి. ఏదో చదువు బాగా చెబుతారని విని ఈ స్కూల్లో వేశాం. ఆడు బాగా చదవకపోతే మాకు కబురుచేయండి, అంతే గానీ ఇంకోసారి ఇలా అనవసరమైన విషయాలకి కబురు సెయ్యమాకండి!" అని వెళ్లిపోయారు.

దీనికి ఏంచెయ్యాలా అని ఆలోచించాను. పిల్లల్ని కొట్టడం నేరమైపోయింది. ఉపాధ్యాయుల మీద తల్లితండ్రులే స్వయంగా వచ్చి దాడి చేస్తున్నారు... లేదా అవమానిస్తున్నారు లేదా పోలీసు కంప్లయింట్ ఇస్తున్నారు. దానిని అలుసుగా తీసుకుని విద్యార్థులు ఉపాధ్యాయులపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. దానికి తోడు కొద్దికాలంగా సమాజాన్నిబలంగాప్రభావితం చేస్తున్నవినోద వ్యాపార మాధ్యమమైన సినిమాలో ఉపాధ్యాయ పాత్రల్ని, అధ్యాపక పాత్రల్ని చాలా హీనంగా చూపిస్తున్నారు. కనీసం పదవ తరగతి అయినా ఆ అబ్బాయి పాసయ్యే జాగ్రత్త తీసుకుంటే, తరవాత ఏమైతే మనకేంటి... అనుకుని ఒక నిర్ణయానికి వచ్చాను.

సమీర్కు మంచిగా చెబుతూనే, అవసరం అయిన చోట ప్రోత్సహిస్తూ, తప్పు చేస్తున్న చోట సున్నితంగా హెచ్చరిస్తూ పరీక్ష పాస్ అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల అతను ఉత్తీర్ణుడై కాలేజీలో చేరాడు. అక్కడితో అతని పట్ల నా బాధ్యత తీరిపోయింది. తర్వాత తన కల నెరవేర్చుకోవడం కోసం ఇంట్లో డబ్బు నగలు దొంగతనం చేసి హైదరాబాద్ వచ్చేసి, ఓ అసిస్టెంట్ డైరెక్టర్ దగ్గర ముందు లైట్ మాన్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగి ఈ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్ట్‌కు చేరాడట. ఈ కష్టంలో కడుపునిండా తిన్న రాత్రిళ్ళు కన్నా, తినని రాత్రులే ఎక్కువ అని చెప్పాడు. సెలవులకు మరల మా ఊరు వచ్చినప్పుడు ఒకసారి వచ్చి నన్ను కలిసి విషయాలన్నీ చెప్పాడు.

"నేను రిటైర్ అయ్యాక ఒక్క సినిమాలో అయినా నటించాలనే నా కోరిక తీరేలా నువ్వు కొంచెం సహకరించవయ్యా చాలు!" అని అడిగాను నేను, నటన మీద ఉన్న ఆసక్తి కొద్దీ.

దాని ఫలితమే ఈ రోజు ఈ విధంగా షూటింగ్‌కి రావడం.

“షాట్ రెడీ సర్. ఎక్కడున్నా వచ్చేయండి!” అని సమీర్ ఫోన్ చేసాడు. ఉత్సాహంగా షూటింగ్ స్పాట్ చేరుకున్నాను.

నన్ను చూస్తూనే దర్శకులు కాబోలు అడిగాడు. ''స్కూల్ మాస్టర్ పాత్రధారి ఈయనేనా?”

“అవును సార్. నాకు చదువు చెప్పిన సార్. ఈ పాత్రకైతే సహజంగా ఉంటారని మీకు చెప్పాను కదా సార్!'' అన్నాడు సమీర్. దాదాపు ముప్పయి రెండేళ్ళు ఉంటాయి అతనికి.

నేను “నమస్తే సార్” అన్నాను.

“సరే... ఆయనకీ ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో వివరించు!'' అని మిగతా టెక్నీషియన్‌కి సూచనలు ఇవ్వసాగాడు. సమీర్ నన్ను పక్కగా తీసుకొచ్చి నాతో అన్నాడు. “మాస్టారూ. ఈ సన్నివేశంలో పాఠశాలలో మీరు మీ సీట్లో కూర్చుని పని చేసుకుంటున్న సమయంలో ఒక తండ్రి వచ్చి ‘నా కూతురు... క్లాసులో లేకుండా ఒక కుర్రాడితో.. పార్క్‌లో కనిపించింది. మీరు ఏం పర్యవేక్షిస్తున్నారు?’ అని అడుగుతాడు. దానికి సమాధానంగా మీరు ఏదో చెప్పబోతుంటే ‘మీమీద పోలీసు కంప్లైంట్ ఇచ్చాంలే. వాళ్ళు వచ్చి తేలుస్తారు’ అని అతను హేళనగా అన్నప్పుడు, అతని బంధువులు కోపంతో ఊగిపోతూ ‘ఇలాంటి బాధ్యత లేని ఉపాధ్యాయుల్ని ఏంచేసినా పాపం లేదు. ఎంతో నమ్మకంతో పిల్లల్ని వీళ్ళ దగ్గర చేర్పిస్తుంటే వాళ్ళు ఏమీ పట్టించుకోరు. వాళ్ల జీతాలు వాళ్ళకి ముఖ్యం. ఇలాంటి వాళ్లను ఊరికే వదిలిపెట్టకూడదు. కొట్టండి.. కొట్టండి..’ అంటూ కుళ్ళిన కోడిగుడ్లు, టమాటాలతో కొడతారు. అప్పుడే బయటి నుంచి వస్తున్న హీరో హీరోయిన్లు అంటే ఆ అమ్మాయి, ఆ కుర్రాడు... మిమ్మల్ని చూసి పకపకా నవ్వుతారు. అది చూసి మిగతా వారందరూ నవ్వుతారు. ఇది సర్ సన్నివేశం.” అన్నాడు సమీర్.

ఆ సన్నివేశం వింటుంటే ఒక్క క్షణం గుండె ఆగిపోయినంత పనైంది నాకు. గత పదేళ్లుగా చలన చిత్రాలలో ఉపాధ్యాయులను, అధ్యాపకులను విద్యార్థులు కొందరు ఏకవచనంతో సంబోదిస్తూ, అసభ్య పదజాలంతో నిందిస్తూ, మాట్లాడకూడని మాటలు పంచ్‌లు విసురుతూ, జాతినేత అయిన ఉపాధ్యాయుని సమాజంలో అట్టడుగు వర్గాల దగ్గర్నుంచి ధనికవర్గం దాకా హీనాతిహీనంగా చిత్రిస్తున్నారు. ఆనాటినుంచి ఉపాధ్యాయుడు దాదాపుగా కళ పేరుతో హత్య చేయబడుతూనే ఉన్నాడు. మళ్లీ అటువంటి పాత్ర ఈ చిత్రంలో నా వృత్తికి అన్యాయం జరుగుతూంటే, ఆత్మవంచన చేసుకుని నటించడం అవసరమా? ఇలాంటి చిత్రాలు టీనేజ్ పిల్లల మనసులపై ఎంత ప్రభావం చూపిస్తాయి? సెప్టెంబర్ 5వ తేదీన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం ఆర్భాటంగా జరిపి, మిగిలిన 364 రోజులు ఉపాధ్యాయుణ్ణి జీవశ్చవాన్ని చేసి ఆడిస్తున్న ఈ సమాజంలో ఈ పాత్ర నాకు అవసరమా? ఈ వయసులో ‘నటన అంటే నటరాజుసేవ ’ అని భావించే నేను, ఇంత హీనపాత్రలో నటించాలా? అలా అనుకోగానే నాకు గుండెల్లో సన్నటి నొప్పి మొదలైపోయింది. చెమటలతో బట్టలు తడిసిపోతుంటే “బాబు సమీర్” అంటూ గుండె పట్టుకుని కిందకు కూలబడిపోయాను.

“సర్ ఏమైంది?'' అంటూ గట్టిగా పట్టుకున్నాడు సమీర్.

“గుండెల్లో నొప్పిగా అనిపిస్తోంది బాబూ. నన్ను... నన్ను... ఇంటికి పంపించేయి!” అన్నాను హీనస్వరంతో.

సమీర్ వెంటనే తన ఇద్దరు స్నేహితుల్ని నన్ను ఆటోలో ఇంటి దగ్గర ఏర్పాటు చేశాడు.

“ఇంకా నయం. స్పాట్‌లో చస్తే మన ప్రాణానికి చుట్టుకునేది!” ఎవరో అంటున్నారు.

నన్ను ఇంటి దగ్గర వాళ్లు బాధ్యతగా దింపి వెళ్ళిపోయారు.

“ఏమైందండీ?” కంగారు పడిపోయింది అహల్య.

వాళ్లు పూర్తిగా వెళ్ళిపోయారు అని నిర్ధారించుకున్నాకా నిత్యజీవితంలో అప్పటి వరకు గుండెనొప్పి వచ్చినట్టు నటించిన నేను, దీర్ఘంగా శ్వాస తీసుకుని పడకకుర్చీలో సుఖంగా వెనక్కి వాలాను.

“నా నటనకు పిచ్చెక్కి ఇంటికి పంపేశారు. ఈ వయసులో మనకివి పడవోయ్!”అన్నాను నర్మగర్భితంగా నవ్వుతూ. “మంచిపని చేశారు. పీడావదిలింది. వేడి వేడి కాఫీ తెస్తాను ఆగండి!” అంటూ ఉత్సాహంగా లోపలకి వెళ్లిన అహల్యని చూస్తూ...

“నా నైతిక బాధ్యతను నిర్వహించే శక్తిని నాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు స్వామీ!” అని కళ్ళుమూసుకున్నాను.

# నిజం

శివల జగన్నాథరావు

9848463120

**విశిష్ట అతిథి కథ**

సాయంత్రం అయిదు గంటలు.

జంక్షన్‌లో వాహనాల రద్దీ పెరుగుతోంది. తిరిగే మనుషులు పెరుగుతున్నారు. జంక్షన్ ఎడమవేపు ఎత్తురోడ్డుకి ఆనుకునివున్న 'అప్పలస్వామి పాన్షాప్'లో అప్పల్స్వామి కిళ్లీ నములుతూ, అటుయిటు చూస్తూ, షాపు దగ్గర ఖాళీబెంచీ కేసి ఓ చూపు సారిస్తున్నాడు. ఎవరో ఇద్దరబ్బాయిలు వచ్చి కూచోటం వాడికిష్టం లేనట్టుంది. మొహం అదోలా పెట్టాడు. వచ్చిన బేరగాళ్ళకి సిగరెట్టిచ్చి పంపించి, కొట్లో వాచీ చూశాడు. ఐదు మీద పదిహేను నిమిషాల దగ్గర 'అబ్బో ఏవిటీ టయంఁవూ! గబగబ గబగబ కాలం ఎళ్ళిపోతన్నాది. ఏళ్ళు ఎళ్ళి పోతన్నాయి. ఆయుర్దాయం ఆటెంట వెళ్ళిపోతన్నాది. ప్స్!' విచారిస్తుంటే రాఘవ వచ్చాడు.

ఎత్తురోడ్డు నుంచి అడుగులో అడుగేసుకుంటూ, నూనీ నీళ్ళూ కలిపి నున్నగా దువ్విన క్రాపింగుని పైపైన సవిరించుకుంటూ చూడ్డానికి తెల్లగా కన్పిస్తూ, కాలర్ దగ్గర దట్టంగా మాసిన చొక్కామీద పడని తొక్కుదేన్నో పడినంత సహజంగా దులుపుతూ బాగా మాసినా, మడత నలగని పాంటుని చూసుకుంటూ వచ్చి, పాంటు జేబులోంచి దుమ్ముకొట్టుకున్న రుమాల్తీసి, దుమ్ములేని బెంచీని (ఆ సరికి ఆ కుర్రాళ్ళు వెళ్ళి పోయారు) దుమ్ము దులిపి కూచున్నాడు.

తలపైకెత్తి చూసి "ఆకాశం చాలా 'తేటగా వుందే' అనుకున్నాడు. ఎదురు రోడ్డుకి ఆడపిల్లల బడి ఆనుకుని వున్న పేవ్‌మెంట్ పక్కన, రాళ్ళపొయ్యమీద పెద్ద బాణలిపెట్టి, తాజా తాజా పకోడీలు తయారు చేస్తున్నాడు, నల్లబనీను నాంచారయ్య. అక్కడే అద్దాలబండీ పెట్టాడు. పొయ్యిలో మంటలు భగభగ నాల్కలు ఎగజాస్తున్నాయి. కమ్మటి పకోడీల వాసన ఆ ప్రదేశం అంతా వ్యాపించింది. రాఘవ రోజూలాగే ఆ వాసన పీల్చుతూ అవి తిన్న అనుభూతిని పొందాడు. అద్దాలబండీలో సరుకులు, ఆ పకోడీలు జోరుజోరుగ అమ్ముడైపోతున్నాయి. రాఘవకి ఎడం పక్క ఓపెన్ వున్న బండీలో తీపి, కారం సరుకులు పెట్టుకుని, గ్యాస్ లైట్తో కుస్తీ పడుతున్న సింవాచెలం మధ్యమధ్య నాంచారయ్య దుకాణంకేసి మిడుతూ మిడుతూ చూస్తున్నాడు. రాఘవకి నవ్వొచ్చింది. సింవాచెలం బండీవేపు ఎవరూ చూట్టంలేదు! ఈ మనుషులు వెరివాళ్ళుకారు. వీళ్ళకి మంచేదో, చెడ్డేదో తెలును. వాళ్ళకి అద్దాలబండిలోవున్న పరిశుభ్రమైన సరుకే కావాలి. అప్పటికప్పుడు తయారయ్యే వస్తువే కావాలి. ఆచ్ఛాదన లేకుండా ఈగలు ముసిరేవీ, పాతవీ ఎవరు కొంటారు? ఈ సత్యం సింవాచెలంకి ఎందుకు తెలీదు? తను రోజూ ఇది సింవాచెలంకి చెప్దామనుకుంటాడు ఎందుకు వచ్చిన దురదలే అనుకున్నాడు. సింవాచెలంని చూసి నవ్వొచ్చి, తన్నవ్వుతున్నట్టు ఎవరికీ కన్పడకుండా రుమాల్తో కప్పుకున్నాడు రాఘవ.

నీలిపువ్వుల ఫ్రాక్ వేసుకున్న అమ్మాయి వెడుతోంది రోజూలాగే. వాలుచూపుల్తో, వాల్జడలతో, వొయ్యారాలుపోతూ వెళ్ళే ప్లాస్టిక్ రింగుల అమ్మాయిల్లో ఒకతె ఎంచేతో లేదివాళ. ఎదురుగా వున్న మంగలి షాపులో వీక్లీ చూస్తూ ఒకడు తిరుగుడు

కుర్చీలోకి చేరి ఆ కుర్చీలోంచి అప్పుడే బైటికి వస్తూ బజ్జీకటింగ్ బస్టాండ్లో బాలామణిని చూస్తూ కింద పేడ చూడక దాన్లో కాలే సేసేదు... ఆ పక్కనించి ఈపాటికి వచ్చేసి ఇక్కడ నిలబడి పోజులుకొట్టే పొడుగుచెంపలబ్బాయి ఇవాళిప్పుడే వస్తున్నాడు. బడ్డీలోంచి భానుమతి "సావిరహే" వినబడుతోంది.

సంధ్య దుస్తులు మార్చుకుందా? అన్పించింది రాఘవకి. ఆకాశాన ఇందాకటి నీలిమలేదు, కుంకుమ అక్కడక్కడ కుప్పలుపోసినట్టుంది. రాఘవకి ఈచోటు నీలాకాశపు పందిరికింద కళ్యాణ మంటపంలా తోస్తుంది. అందమైన సముద్రతీరంలా కనిపిస్తుంది. హడావిడిగా రైలు స్టేషన్లా అనిపిస్తుంది. అక్కడికి కొద్ది దూరానవున్న ఇంటినించి దాదాపు రోజూ వచ్చి ఆ బెంచీమీద కూచునే రాఘవ ఈ అనుభవాల్ని వదులుకొందుకి అయిష్టపడతాడు.

ఎవరో తెలిసిన మనిషి దూరంనించి వస్తూండటం చూసి, గభిక్కున లేచి పోయాడు. బడ్డీ దగ్గరగా.. వెళ్ళి అప్పల్సావితో మాటలు కలిపాడు.

"ఏంవోయ్! ఎంతవరకు వచ్చింది నీ ఇంటి సంగతి? కప్పువేసేవా?"

"నిన్ననే వేశానండి. ఇంకా గచ్చులూ, గలాభాలవీ వున్నయ్..."

"హల్లో! రాఘవా!" అంటూ పలకరించాడు వచ్చినతను.



"నువ్వా మూర్తీ! ఎవరో అనుకున్నాను సుమా! వెధవది పోల్చలేక పోతున్నానోయ్! సైటు వస్తున్నట్టుంది.. టెస్ట్ చేయించాలి. ఆఁ... ఏవిటి విశేషాలు? మీ వాళ్ళంతా బావున్నారా?"

"అంతా బాగానే వున్నారుకాని నీ సంగతి చెప్పు! ప్రమోషన్ యేం లేదా? పిల్లల్ని పెంచుతున్నావా? 'పెళ్ళయిందగ్గర్నించి మీ యింటికి ఒక్కమారూ పిల్చావు కావు.

రాఘవ మూర్తిని ఆపాదమస్తకం చూశాడు.

చాకెలెట్ కలర్ టెర్రీకాట్ పాంట్‌లో గ్రీన్ కలర్ టెర్లీన్ షర్టు టక్ చేశాడు. అంబాసిడర్ బూట్లు నిగనిగలాడుతున్నాయి, పరువంలో తళతళమెరిసే పడతుల్లాగా.

పచ్చటివేళ్ళకి రెండు వుంగరాలు ధగధగలాడుతూంటే ఖరీదైన రిస్ట్ వాచీ చెలికత్తెల మధ్య రాజకుమారిలా ప్రత్యేక శోభని సంతరించుకుని దర్శనమిస్తోంది!

రాఘవ మనసు తెరమీద తనిల్లు క్లోజప్లో వెలిసింది.

అన్ని అవసరాలకి ఆలవాలమైన ఒకే గది. పగిలిన గచ్చు, పడిపోతున్న పెంకులు, పడుతూ లేస్తూ రాగాల్తోమార్మోగించే గుంటవెధవలు, మాసి, అట్టలుకట్టిన. పరుపూ, తలగడలు, చింకి దుప్పట్లు, చింకిచాపలు, బొక్కికుర్చీ, అస్తవ్యస్తంగా బట్టల్లో నంగిరితనం జోడీ భార్య...

గట్టిగా నవ్వేశాడు.

"ఆఁ.. పోదూ.. ఏదో అంటావ్ కాని, నువ్వు మా ఇంటికి ఎందుకు వస్తావు?" మాట మార్చేశాడు. మూర్తి వెళ్ళిపోతుంటే 'అమ్మయ్య! ఇంకానయం! మొండితనంగా వస్తానన్లేదింటికి, రక్షించాడు' అనుకున్నాడు.

మళ్లా బెంచీమీద కూలబడ్డాడు బడ్డీలోంచి ఏదో పాట వస్తోంది. పాట చాలా బావుంది. మనసేం బావులేకపోయినా మనసుని నొక్కి పాటవింటున్న రాఘవ కులాసకి శబ్దరూపంలో కూనిరాగం తీస్తూ పరాకుగా కూర్చున్నాడు. వెనక నుంచి ముష్టివాడి కేక విని వులిక్కిపడి చూశాడు.

మాసి, అట్టలుకట్టి, పేలికలుగ వేళ్లాడుతోన్న లాగూ, చొక్కాలో చువ్వలు అవయవాలుగ పేర్చి నిలబెట్టిన ఆకారం. మూతిమీద అప్పుడే మొలుస్తోన్న మీసం వస్తోన్న యవ్వనాన్ని ఎరుక పరుస్తోంటే రక్తమాంసాలుడిగిన వొళ్ళు, దిగుడు బావులైన కళ్ళు వృద్ధాప్యానికి గుర్తులయి నిలుస్తున్నయి. దరిద్రం... అవకరం! నోరంతా తెరిచి వికృతంగా అరుస్తున్నాడు,

"ఆమ్ మాఁహహఁహహ......"

రాఘవ వాడిమీంచి చూపుల్తిప్పుకున్నాడు. హడావిడిగ చుట్టూ చూసేడు. కిళ్లీ బడ్డీ అప్పల్సావి, పకోడీల నాంచారయ్య, బండీ సింవాచెలం, పొడుగు చెంపలబ్బాయి, బస్టాండు బాలామణులూ... అంతా అంతా ఇటే చూస్తున్నట్టు అనిపించింది.

బెంచీమీద ఇబ్బందిగా కదిలాడు. అప్పల్సావి వాణ్ణి పిల్చి మూడు పైసలు వేశాడు. పొడుగు చెంపలబ్బాయి దగ్గరికి వెళ్ళాడా ముష్టివాడు. అతను విసుగ్గా చూసి, ఆ పక్కనించి వెళ్తోన్న రెండు జడలమ్మాయి తన పిసినారితనాన్ని

ఏవగించుకొన్నట్టనిపించిందేమో! గభాల్న జేబులోంచి అయిదు పైసలు తీసి ఇచ్చాడు. పకోడీల నాంచారయ్య కసిరేశాడు గాని, సింవాచెలం రెండు పైసాలేశాడు. ముష్టికుర్రాడు మళ్ళా రాఘవ దగ్గిరికి వచ్చాడు.

రాఘవ ఇబ్బందిగ మొహంపెట్టాడు. అప్పల్సావి "అంత ఇదిగా అడుగుతూంటే పైసా అయినా ఎయ్యకూడదా, బాబూ?" అని అంటున్నట్టు అన్పించింది. వాళ్ళచూపులు.. చెవుల్లో హోరు...

"నీటుగానే కన్పిస్తున్నావు. రుమాల్తో బెంచీని దులిపే కూచుంటున్నావు. మాటి మాటికీ ఈలేస్తున్నావు. ఆధిక్యతని కన్పరుస్తున్నావు. వాడికి దానం చెయ్యటానికి డబ్బుల్లేవేం నీ దగ్గర?"

"ఎందుకు వుండవు? వుంటాయి, తియ్యి!"

రాఘవ పళ్ళతో పెదిమల్ని కరిచిపట్టి పాంటు జేబులో చెయ్యి పెటాడు. ముష్టికుర్రాడు డేంజరు సైరన్లా అరుస్తున్నాడు! రాఘవ మనసులో వీశరాయి దించినట్లయింది. చెయ్యితియ్య లేదు. కదుపుతూ కనుబొమలు ముడిచాడు, గాభరాగా చెయ్యి తీసేశాడు. కంగారుగా చొక్కాలు, పాంటూ చూసుకున్నాడు. ఆత్రంగా తనువున్న బెంచీమీదా, నేలమీదా చూపుల్తో వెతికాడు. భయంగా, ఆందోళనగా అటుఇటు చూశాడు.

అప్పల్సావి రాఘవని చూస్తున్నాడు.

"ఏటి బాబూ? అట్టా ఎతుకుతున్నారేంటీ? ఏదన్నా పోయిందా?" అడిగాడు.

"అవునోయ్. ఈ జేబులో పర్సుండాలి, వీడికి డబ్బులేద్దామని తియ్యబోతే... లేదు"

ఎవరో వస్తే రెండరటిపళ్ళు ఇచ్చి పంపేసి "ఇక్కడ కూచున్నప్పుడు జేబు చూసుకున్నారా?" అడిగాడు అప్పల్సావి అరటిపళ్ళు పుచ్చుకున్న ఆసామీ రాఘవని తిరిగితిరిగి చూస్తూ వెళ్ళాడు.

"చూసుకో లేదోయ్ అయినా పోతుందని కలగంటామా?"

బస్సొచ్చి కొందర్ని ఎక్కించుకుని, కొంత దుమ్ము అక్కడివాళ్ళు మొహాన్న కొట్టి, వెళ్ళిపోయింది.

"నా కొట్టు దగ్గర దొంగతనం జరగడం నాకవమానం. ఎవళ్ళమీదేనా అనుమానం వుంటే సెప్పండి."

అప్పటికీ అప్పల్సావి మాటలు విని దోవన పోయేవాళ్ళు ఒకరూ ఒకరూ అక్కడికి చేరుతున్నారు. రాఘవకి దడ పుట్టింది. రోడ్డుమీద ఇలాంటి భాగోతాలు... అందులో తనకు సంబంధించినవి అంటే మరీ తలకొట్టేసినట్టుంటుంది.

ఒకసారి పూర్ణా మార్కెట్ రోడ్డు వెంబడి వస్తున్నాడు. ఓ సైకిల్‌వాలా ర‌య్‌మని వస్తూ, తనెటు తప్పుకుంటే అటువస్తూ, కంగారు పెట్టేశాడు. ప్రమాదము జరుగుతుందేమోనని భయపడ్తూ అటిటు అడుగులేస్తూనే ఆ కంగారులో చటుక్కునో పక్కకి పడిపోయాడు. రాళ్ళు తగిలి మోచేతులు చెక్కుకు పోయేయి. పదిమంది మూగి సైకిల్‌వాలాని మందలించారు. తనని లేపి జాలితో, సానుభూతితో ఓదార్చారు. "అయినా కాస్త చూసుకు నడవా" లన్నారు హెచ్చరిస్తూ! ఎవరి సంగతయినా ఏమోగాని తనకా పరిస్థితి భరించలేనిది! ఎట్లాగో బైటపడ్డాడక్కణ్ణుంచి!

మరోసారి... ఎవతో పిచ్చిది! బజారులో చేతులు పట్టేసుకుని "బాబ్బావా... పయిసియ్యావా?" అని వదల్లేదు! ఎవరో నవ్వుతున్నారు! చేతులు బలవంతంగా గుంజి, అది పడిపోయినా చూడక వడి వడిగా వచ్చేశాడు.

కొందరు రోడ్డుమీద పెద్దగొంతుతో మాట్లాడుకొంటారు. వాళ్ళని చూస్తే వొళ్ళు మండుతుంది తనకి. ఇళ్ళు కాలిపోయినట్టు ఎందుకా కేకలు?

ఇంక కొందరు పన్లన్నీ ఆపేసుకుని రోడ్డుమీద పాములాడించే వాళ్ళ చుట్టూ దడి కట్టేస్తారు.

మరికొందరు పైసాకీ, పరక్కీ బేరగాళ్ళతో పెద్ద జగడం పెట్టేసుకుంటారు. ఇట్లాంటి వాళ్ళంటే తనకి చిరాగ్గా వుంటుంది...

ఆలోచిస్తూ రాఘవ అప్పల్సావి కేక విని తుళ్ళిపడ్డాడు. అప్పల్సావి ఆ ముష్టి కుర్రాడి మీద కేకలేస్తున్నాడు! వాడు చేత్తో సౌంజ్ఞ చేస్తూ "నాన్తియ్యలేదు... నాకేం తెలవదం" టున్నాడు!

"ఎంతపోయింది, మాస్టారూ?" అదిగో అప్పుడే పరామర్శ మొదలు!

రాఘవ మౌనాన్ని వాళ్ళు మరొకలా బోధపర్చుకున్నారు.

"ఏవిటి మాట్టాడుతారు... చెప్పండి? డబ్బుపోయిన విచారంలో మాటరావటం కష్టమే, మరి!"

"అయినా మరీ అంత అజాగ్రత్త పనికిరాదు"

"ఆ దొంగవెధవెవడో డబ్బు తీస్తాడని ఆయన కలగన్నాట్టండీ? ఎవరి ధ్యాసలో వాళ్ళుంటాం. ఎన్ని కళ్ళని పెట్టి చూసుకోగలం?"

ఒకరిద్దరు అపనమ్మకంగా ముష్టికుర్రాణ్ణి చేతికి తగిలించుకున్న చిన్న గోనెసంచీ ఒలకబొయ్యమన్నారు. వాడు పైసాలు బెంచీమీద పెట్టుకుని, సంచీ తీస్తున్నాడు.

రాఘవకి వళ్లు కంపరమెత్తింది.

ఇంకా... ఇంకా... చేరుతోన్నారు అక్కడికి.

పాములవాడి ఆట చూడ్డానికి వచ్చినట్టు! గారడీవాడి ప్రదర్శన తిలకించటానికి అరుదెంచినట్టు! ఆసక్తిగా... కుతూహలంతో! ప్రదర్శన!? ప్ర..ద..ర్శ..న..! ముష్టికుర్రాడితోబాటు ప్రదర్శితుడు తనూ! అప్పల్సావీ, నాంచారయ్య, సింవాచెలం, పొడుగు చెంపలబ్బాయి... ఇంకా ఎవరెవరి కళ్ళల్లోనో తాము!

పకోడీల గాడిపొయ్యిలో మంటలు మనసులో రగుల్తున్నయ్!

బస్సు వెనక దుమ్ములాంటి కసి ఏదో రేగుతోంది!

వొళ్లు చెమట పట్టింది. నెత్తురు వేడెక్కింది.

ఒక్క కేక పెట్టాడు!

“ఆఁ! జ్ఞాపకం వచ్చింది! నేను పర్సు తీసుకురాలేదు సార్! తెచ్చేననుకున్నాను... అరెరె! అనవసరంగా కంగారుపడ్డాను హెహ్హహ్హ ? వెడతాను, అప్పల్సామీ! పాపం, వాణ్ణేం అనకండి...”

అంటూ, దడికడుతున్న వాళ్ళంతా తెల్లబోతుంటే, మొహాలు చూసుకుంటూంటే, విడిపోతూ ఏదో అనుకుంటుంటే... పరుగెత్తుతున్నంత వేగంగా నడిచాడు.

ఇంట్లో అడుగు పెడుతూండగానే, “ఇంట్లోంచి వెళ్ళిపోతే నే నెక్కణ్ణించి తెస్తాననుకున్నారు! మళ్ళా విస్తట్లో కూర లేకపోతే వూరుకోరు. ఇందాకా ఎవత్తో వంకాయలు తెస్తే కొన్నాను, మళ్ళా వస్తానంది, డబ్బులివ్వండి” మహాలక్ష్మి గడగడ వల్లించింది.

“ఇదిగో! ఇంక నా ప్రాణాలీస్తినా నా దగ్గర పైసాలేదు” అంటూ రాఘవ పాంటు జేబులోంచి తీసి గిరవాటేశాడు.

అర్ధరూపాయి నాణెం ఠంగుమంటూ పడింది నేలమీద!

*(యువ మాస పత్రిక నుండి పునర్ముద్రణ)*

# హనుమంతుని స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం

ఆవంత్స సోమసుందర్

## కథామార్గదర్శి కథ

***కొరియాను ఖాళీ చేసి, సోవియెట్ సైన్యాలు వెళ్లిపోయాయి.***
***హనుమంతుడికింకా ఆలోచన స్ఫురించలేదు.***
***కమ్యూనిస్టుల పోరు పడలేక, చైనా ప్రెసిడెంట్ 'చాంగ్ కై షేక్' తన పదవికి రాజీనామా ఇచ్చాడని ధ్రువపడని వార్తలు ప్రకటించాయి. ఇంకా హనుమంతుడికి ఉపాయం తట్టలేదు.***

అభాగ్యుని అనంతకోటి ఆశల్లాగ కోటి యోజనాల దీర్ఘంగా తన వాలాన్ని పెంచుకున్నాడు హనుమంతుడు. తన వాలాన్ని చుట్టలుచుట్టలుగా చుట్టుకొని, రావణబ్రహ్మ సింహాసనమంత ఉన్నతంగా పేర్చుకొని, ఆసనం అమర్చుకొని, ఆసనశుద్ధిగా కూర్చున్నాడు.

కూర్చొని, మోకాళ్లపై బుర్ర పెట్టుకున్నాడు. పెట్టుకొని ఏడవడం ప్రారంభించాడు. వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. మాసిన, జడలు కట్టిన జీబురు గెడ్డంలోకి చొచ్చుకుపోయాయి కన్నీళ్లు. ఏడ్చి, ఏడ్చి అలాగే నిద్రపోయాడు.

స్వప్నం... స్వప్నంలో తన మాతృరాష్ట్రం స్వరాష్ట్రం సంపాదించుకుంది. ముక్కోటి ఆంధ్రులూ ఒక్కటై జీవిస్తున్నారు. కళకళలాడుతూ, శోభాయమానంగా వెలిగిపోతోంది తెలుగుతల్లి. విశాలాంధ్రలో ప్రజారాజ్యం కన్నులపండువగా కనిపిస్తోంది... కలలు కంటున్నాడు హనుమంతుడు.

'ఇంతకీ హనుమంతుడికీ ఆంధ్రరాష్ట్రానికీ సంబంధం ఏమిటి చెప్మా... అని అనుమానిస్తున్నావు' నాకు తెలుసు. ప్రశ్నించడానికి ఉపక్రమిస్తున్నావు కూడానూ! నీ సందేహనివృత్తి చేయడం కూడా నాకు ధర్మమే.

నిజమే... హనుమంతుడు ఆంధ్రుడా లేక తమిళుడా అన్న వివాదం చాలా రోజుల నుంచీ తెలుగు పత్రికారాజాల్లో రాద్ధాంతంగా పరిణమించిన మాట వాస్తవమే! కానీ, ఒక్క విషయం నీకు తెలియదన్నమాట.

"ఆంధ్రులూ–వారి పూర్వులూ" అన్న విషయంపై తీవ్రంగా పరిశోధనలు జరుపుతున్న 'భండార్కర్' ఇన్స్టిట్యూట్ వారు హనుమంతుడు 'ఆంధ్రుడే' అని ప్రకటించినట్టు ఈమధ్యనే లాబీ వర్గాలవారు అత్యంత విశ్వసనీయంగా తెలియజేశారు. కాబట్టి, హనుమంతుడు ఆంధ్రుడా తమిళుడా అన్న విషయంలో వివాదం అనవసరం! ఖచ్చితంగా హనుమంతుడు ఆంధ్రుడే అన్న విషయం నొక్కి వక్కాణించగలం!

అందుచేతనే, ఆంధ్రుడైన హనుమంతుడు... అజరామరుడైన హనుమంతుడు... ఆంధ్రరాష్ట్రాన్ని స్వప్నంలో దర్శించుకుంటున్నాడు.



జనాలు తండోపతండాలుగా జండాలు పట్టుకొని, ఏవో పిచ్చికేకలు వేసుకుంటూ వెళ్లిపోతున్నారు. కలకల ధ్వనితో అంతా నిండిపోయింది లోకం.

బంగారుకలలు కంటున్న హనుమంతుడికి నిద్రాభంగం కలగడానికి అదే కారణం. కళ్ళు నులుముకుంటూ లేచాడు. బహుశా తన కలలు నిజమైనవనుకున్నట్టున్నాడు. అడిగేశాడు కూడానూ "ఏమ్రా ఆంధ్రరాష్ట్రం వచ్చిందా?" అని.

"ఇంకా రాలేదు ప్రభూ! భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే ఈ ఉత్సవం" ప్రజాకంఠం సమాధానమిచ్చింది.

కళ్ళు పెద్దవి చేశాడు... బాగా పరికించి చూశాడు. అప్పుడు తెలిసింది... తన కలలింకా కలలేననీ, వచ్చిన స్వరాజ్యంతో ఆంధ్రరాష్ట్రానికి సంబంధం లేదనీ.

'నా స్వప్నాలనీ నిష్ఫలమై పోవలసిందేనా?' ప్రశ్నించుకున్నాడు. ఆకాశం మూగనోము పట్టింది. సమాధానం రాలేదు. తన కలలన్నీ జ్ఞప్తికి తెచ్చుకున్న కొద్దీ ఆపుకోలేని దుఃఖం ఆక్రమించింది. ఏడ్చి ఏడ్చి అలాగే నిద్రపోయాడు హనుమంతుడు.

దీర్ఘంగా నిద్రపోయాడు. నిద్రలో కల కంటున్నాడు. ఆంధ్రరాష్ట్రం స్వయం నిర్ణయ సూత్రంపై విడదీయబడినది. అన్యరాష్ట్రీయుల దోపిడీ కూడా అంతమైంది. తిండికీ, బట్టకూ లోటులేకుండా తృప్తిగా ఉంటున్నారు ప్రజలు... మళ్ళీ కలగన్నాడు హనుమంతుడు!

అంతమాత్రంలో అతని చెవుల్లో చెట్లు మొలిచాయనుకోవడం శుద్ధ పొరపాటు!

హనుమంతుడు పూర్వం తపస్సు చేశాడు. దేముడు కూడా ప్రత్యక్షమయ్యాడు. "ఏం కావాలో కోరుకో" అన్నాడు. అప్పుడు హనుమంతుడడిగాడు "మా మేనమామ చాలా అదృష్టవంతుడు! అతని చెవుల్లో వెంట్రుకలున్నాయి. నాకూ అలాంటివి ప్రసాదించు" అని.

"తథాస్తు" అన్నాడు దేముడు. అంతర్ధానమయ్యాడు.

దేవుణ్ణి స్మరించుకుంటూ కళ్ళు తెరిచేసరికి శ్రవణపుటాల్లో కేసరాలు ఏర్పడ్డాయి. చూసుకొని మురిసిపోయాడు. సంతోషంగా జబ్బలు చరుచుకుంటూ ఇంటికి... అంటే ఆంధ్రదేశానికి వచ్చేశాడు ఆంధ్రుడైన హనుమంతుడు.

అతడు రాగానే, అతడ్ని రణగొణ ధ్వనితో చుటూ మూగారు జనం. జనసమూహంలో కోలాహలం చెలరేగుతోంది. ప్రజాఘోష తీవ్రతరం అవుతోంది. అయినా హనుమంతుడు చలనం లేకుండా అలాగే నిలబడ్డాడు! మెరుపులాంటి ఉపాయం తోచింది జనానికి. జాతీయగీతాన్ని ప్రారంభిచారు భక్తిగా... హనుమంతునికి మరింత చేరువగా సమీపించారు. 'రఘుపతి రాఘవ రాజారాం... పతీత పావన సీతారాం' భజన ప్రారంభించారు.

పాటకి లయగా హనుమంతుని చెవి కదలడం ప్రారంభించింది. మెల్లగా మేలుకున్నాడు హనుమంతుడు. ప్రజలు 'వైష్ణవ జనతో' పాడేరో లేదో తెలియదు గాని, హనుమంతుడు కదలడంతోటే "మాకేం సెలవిస్తావు స్వామీ?" అని దీనంగా అడిగారు.

ఒక్కసారిగా హనుమంతుడు మేల్కొన్నాడు. కళ్ళు నులుముకున్నాడు. ఎంతకాలానికి విన్నానురా ఈ కలియుగంలో ఇంత మధురగానం అనుకున్నాడు. చుట్టూ కలయజూశాడు. తోసుకుంటూ ముందుకు వచ్చిన నరపుంగవుడు, హనుమంతుని మెడలో పూలమాల అలంకరించాడు. ఆశ్చర్యచకితుడై ప్రశ్నించాడు... 'ఏమర్రా ఆంధ్రరాష్ట్రం వచ్చిందా?" అని.

"లేదు ప్రభూ! ఆంధ్ర రాష్ట్రావశ్యకతను గురించి పరిశోధన చెయ్యడానికి 'దార్ కమిటీ' వేంచేసింది స్వామీ. మమ్మల్ని ఏమి విజ్ఞప్తి చేయమని సెలవిస్తావు స్వామీ?" అడిగారు ప్రజలు.

"దార్ కమీటీయా? నా శ్రాద్ధం కమిటీ కాదూ! వచ్చి ఏం చేస్తుందేమిటీ! ఆంధ్రరాష్ట్రం అవసరమా కాదా అని చర్చిస్తుందా? ఏడ్చినట్టే ఉంది. మీరా కమీటీ ముందుకు పోనక్కర్లేదసలు. ఇలాంటి గుడ్డి కమిటీలను వెయ్యడం ఇంగ్లీషువాడు నేర్పాడు గాబోలు... వెళ్లిపోతూ!" అని క్షణం మౌనం వహించాడు హనుమంతుడు. ప్రజలూ నిశ్శబ్దంగానే నిల్చున్నారు.

మళ్ళీ ప్రారంభించాడు. "ఈ మహా ఘనకార్యం కోసమా నా తపస్సంతా భంగం చేశారు? ఈ మాత్రం సౌభాగ్యానికి వెధవ పూలమాలలెందుకోయ్... ఆకలేసి చంపేస్తుంటేనూ!" విసురుగా, దూకుడుగా అన్నాడు. కోపంతో మండిపోయాడు.

ఇంతలోనే భక్తకోటి లోనుంచి హనుమంతుని కోపానికి కారణం గ్రహించిన ఎవరో పీపీలికుడొక టెంకాయ సమర్పించాడు. దాన్నొక గుద్దు గుద్ది, ఒక్క గుటకలో దాన్ని లేదనిపించాడు హనుమంతుడు. తరవాత శాంతించాడు.

ప్రజలు మనవి చేసుకోవడం ప్రారంభించారు. "స్వామీ తమరు అలా అనడానికి వీల్లేదు. ఈ కమీటీ మన ప్రజాప్రభుత్వం వారిచే నియమించబడినది. దీని ద్వారా ఆంధ్రరాష్ట్రాగమనం నిశ్చయం గాబట్టి, మేమేమని విజ్ఞప్తి చెయ్యాలో వివరించండి?" అన్నారు.

ఇలాంటి కమిటీల ద్వారా కార్యం సానుకూలమౌతుందని కలలోకూడా అనుకోలేదు హనుమంతుడు. అయినా తన ప్రజలు తననే వ్యతిరేకించే పరిస్థితులు ఏర్పడడం ఉభయత్రా శ్రేయస్కరం కాదనుకున్నాడు. ఆ ఉద్దేశ్యంతోనే ఇలా అన్నాడు.

"మీరు తక్షణమే పోయి, ఆంధ్ర రాష్ట్రము కడుంగడు వాంఛనీయమనియూ, అచిరకాలముననే సిద్ధించక పోయినచో అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడుననియూ, ఆ రాయబారులతో నుడువుడు. పొండు!" అని వురిమాడు.

"చిత్తం" అంటూ కోలాహలంగా కలకల ధ్వనులు చేసుకుంటూ వెళ్ళిపోయారు ప్రజలు.

'కమిటీలట... కమిటీలు! వెంట్రుకవాసి కార్యమైనా సాధించవీ కమిటీలు! పైగా ఆంధ్రుడు శాశ్వతంగా నిర్భాగ్యుడయ్యే ఏర్పాట్లన్నీ చేస్తాయి. కమిటీలట... కమిటీలు' అని సణుగుకున్నాడు హనుమంతుడు! అలాగే నిద్రపోయాడు. అయితే ఈమారు మాత్రం ఏడవలేదు!

నిశ్చింతగా, నిష్పూచీగా అలాగే నిద్రపోయాడు. నిద్రలో కలలేమీ రాలేదని చెప్పడానికి వీల్లేదు. ఆంధ్రరాష్ట్రం సస్యశ్యామలం... శోభాయమానం. విశాలాంధ్రలో ముక్కోటి ప్రజల సౌఖ్యమయ జీవితం. బంగారు కల కన్నాడు. అనేక రోజులు నిద్రపోయాడు.

మళ్ళీ తండోపతండాలుగా ప్రజలు! ఈమాటు మాత్రం సంతోషంగా కలకల ధ్వనులు చేయడంలేదు. జనసందోహంలో కోలాహలం చెలరేగడంలేదు. వెక్కివెక్కి ఏడుస్తోంది ప్రజ. జనకంఠం రుద్ధమైంది. అప్పుడప్పుడు 'మాకేటి దారి స్వామీ' అన్న మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి జనంలో నుంచి.

ఏదో విపత్తు సంభవించిందని తెలుసుకున్నాడు అదృష్టం కోసం నిరీక్షిస్తున్న హనుమంతుడు. ప్రజలు ఘోరంగా విలపించారు. అయినా ఆలోచన స్ఫురించలేదు హనుమంతుడికి! అలాగే ప్రజలు చక్రవాకాల వంటి కన్నులతో హనుమంతుని వచస్సుధా సృష్టి కోసం నిరీక్షిస్తూ అలాగే నిలబడ్డారు. తీవ్రాతి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు హనుమంతుడు.

కొరియాను ఖాళీ చేసి, సోవియెట్ సైన్యాలు వెళ్లిపోయాయి. హనుమంతుడికింకా ఆలోచన స్ఫురించలేదు.

కమ్యూనిస్టుల పోరు పడలేక, చైనా ప్రెసిడెంట్ 'చాంగ్ కై షేక్' తన పదవికి రాజీనామా ఇచ్చాడని ధ్రువపడని వార్తలు ప్రకటించాయి. ఇంకా హనుమంతుడికి ఉపాయం తట్టలేదు.

పన్నెండు వారాల తీవ్ర వాదోపవాదాల అనంతరం, ప్రపంచశాంతికి కావలసిన చిచ్చు రగిల్చిన అనంతరం... భద్రతా సమితి సమావేశం శాంతి భద్రతలతో ముగిసింది. అయినా హనుమంతుడికి ఆంధ్ర రాష్ట్ర సముపార్జన నిమిత్తం మార్గాంతరం వ్యక్తం కాలేదు. అయినా మానకుండా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు... ఉపాయాన్ని శోధిస్తున్నాడు.

ఆంధ్రుడైన హనుమంతుడికి అంత త్వరగా స్ఫురించదు ఉపాయం. స్ఫురించిందా ఇక దానికి తిరుగులేదు. ఏ ఉపాయం వల్ల ఏమపాయం ఉందోనని వెనకా ముందూ తటపటాయిస్తున్నాడు.. తనబలం తనకు తెలీని హనుమంతుడు.

సముద్ర లంఘనానికి కావలసిన జవ సత్వాలున్నాయనీ, బాధల విముక్తికి సరిపోయిన మేధస్సంపద ఉందనీ ఎవరైనా తెలియజేస్తే తప్ప తెలియదు ఆంధ్రుడైన హనుమంతునికి! అందుకోసమే... అనుకూలమైన ఆ సలహా కోసమే ఎదురు చూస్తున్నాడు.

జనసందోహంలో కోలాహలం చెలరేగుతోంది. మార్గాంతరం కోసం తలపడుతున్నారు ప్రజలు. వారి ఓరిమి సన్నగిల్లుతోంది. అయినా తాపీగా యోచిస్తున్నాడు హనుమంతుడు.

యోచించి యోచించి, ఉత్తమపురుషైక వచనంలో, సంభోదనా ప్రథమావిభక్తిలో, తనను తానే హెచ్చరించుకున్నాడు. 'ఓ ఆంధ్రుడా తస్మాత్ జాగ్రత జాగ్రతా' అని. హనుమంతుడికీ, జడభరతుడికీ ఉన్న దగ్గరి చుట్టరికం గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించడం అప్రస్తుతం.

హెచ్చరించుకున్న హనుమంతుడు కట్లు వీడిన తెలుగుతల్లిని, శోభాయమానమైన విశాలాంధ్రని స్వప్నంలో సందర్శించుకున్నాడు.

(ఆనందవాణి పత్రిక నుంచి పునర్ముద్రణ)

"సామాజిక స్పృహ...!"

ఈ మాట తెలియని కథకులు ఉండరనేది అతిశయోక్తి కాదు.
ముఖ్యంగా కథావిశ్లేషకుల, విమర్శకుల సమీక్షలలో
ఈ మాట తప్పక చోటు చేసుకుంటుంది.

ఏమిటీ సామాజిక స్పృహ...?

కథలలో, సమీక్షలలో దీని ప్రాముఖ్యత ఏమిటన్న ప్రశ్న పాఠకుల
మనసులలో ఉద్భవిస్తూనే ఉంటుంది.

మనిషి.. సమూహ వ్యక్తి, సంఘజీవి. అతను మెసలే సమాజం కొన్ని
నియమాలను, కట్టుబాట్లను నిర్ణయిస్తుంది. కనుక అతనో నియమబద్ధుడు.
తన ప్రవర్తన, తన అభిప్రాయాలు ఆ సమాజానికి అనుగుణంగా ఉండేలా
చూసుకోవాల్సిన బృహత్తర బాధ్యత మనిషిపై ఉందన్నది స్పష్టమౌతుంది.
బహుశా ఆ బాధ్యతనే సామాజిక స్పృహ అంటారేమో!

మరి కథారచయితలు, రచయిత్రులు కూడా ఆ మానవసమాజ
నియమావళికి బద్ధులే కదా! కనుకనే  వారు తమ రచనలలో
సామాజిక స్పృహ ద్యోతకమవ్వాలన్న ఆశయానికి దోహదపడుతూ
తమ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు.

కథలెప్పుడూ వర్తమాన సామాజిక జీవితాలకు ప్రతీకగా నిలుస్తాయి.
ప్రస్తుతకాలపు జీవితాలను తమ రచనలలో ప్రతిబింబించడానికి కథకులు
విశేషకృషి చేస్తున్నారు. వారి కథలు సమాజాన్ని వేగంగా అర్థం చేసుకోడానికి
అస్కారమిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నాయి.

వైవిధ్యమైన ఇతివృత్తంతో, మానవసమాజం లోని బహుళత్వాన్ని
స్పృశిస్తున్న అనేక కథలను 'కథామంజరి' ప్రచురిస్తూ వస్తోంది.
పాఠకుల ప్రశంసలను అందుకుంటూనే ఉంది.
ఇది పునరుద్ఘాటించ నవసరం లేని సర్వజన విదిత సత్యమే!'

